# ఆంధ్రజ్యోతి
## అమరావతి గుంటూరు

బుధవారం 30 ఆగస్టు 2017 | 20 | 1, 2 ★






అర్జున అవార్డుతో జ్యోతి సురేఖ, తల్లి శ్రీదుర్గ

# విలువైన ఘనత

7లో..

- అర్జున అవార్డు అందుకున్న జ్యోతి సురేఖ
- ఆనందోత్సాల్లో కుటుంబ సభ్యులు, అభిమానులు
- నేడు విజయవాడలో ఘన స్వాగతం

అర్జున అవార్డు.. క్రీడల్లో ఆ ఘనత అతి కొద్ది మందికే దక్కుతుంది. ఆ శిఖరాన్ని చేరుకోవా లంటే కఠోర శ్రమతోపాటు ఎంతో ఓర్పు, నేర్పు అవసరం. చిన్న వయసులోనే చెరుకుపల్లికి చెందిన విలువిద్య క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ దక్కించుకు న్నారు. న్యూఢిల్లీలో మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా అర్జున అవార్డును అందుకు న్నారు. రాష్ట్రంలో క్రీడా ప్రతిభకు కొదవలేదని, అవకా శాలు, సౌకర్యాలు కల్పిస్తే సత్తా చాట గలుగుతారని జ్యోతి సురేఖ నిరూపించారు. బుధవారం విజయవాడ చేరుకోనున్న ఆమెకు కేఎల్‌యూ వర్సిటీ బృందం ఘన స్వాగతం పలకనున్నది.


# పైసా వసూల్!



8

- లబ్ధిదారుల నుంచి ఉద్యాన శాఖ డీడీ జయచంద్రారెడ్డి లంచం డిమాండ్
- డబ్బు ఇవ్వాల్సిందేనంటూ ఫోన్‌లో డిమాండ్
- వాయిస్ రికార్డు చేసి ఉన్నతాధికారులకు వినిపించిన రైతులు
- కమిషనర్‌తో పాటు విజిలెన్స్ దర్యాప్తు
- సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు

లబ్ధిదారుల నుంచి తీవ్ర ఆరోపణలు రావడంతో ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. డబ్బులు డిమాండ్ చేస్తుండగా రైతులు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి ఉన్నతాధికారులకు వినిపించడంతో శాఖాపరమైన చర్యలు చేపట్టారు. నర్సరీ యజమానులతో కూడా ఆయన లాలూచీ పడి నట్లు ఆరోపణలు ఉన్నాయి. మాచర్ల, వినుకొండ, మంగళగిరి, తాడికొండ, నారాకోడూరు, తెనాలి తదితర ప్రాంతాల నుంచి రైతులు.. ఉద్యానవన శాఖ సబ్సిడీ పథకాలు అందడం లేదని, లబ్ధిదారుల ఎంపిక, పథకాల అమలులో అవకతవకలకు పాల్పడుతున్నట్లు లిఖిత పూర్వకంగా కూడా తెలిపారు. గతంలో ఏడీగా పనిచేస్తున్న సమయంలోనూ ఆయన సస్పెండ్ అయ్యారు.




వైకుంఠపురం మీదుగా..

# రాజధానికి రైలు వంతెన!

- ఈటీఎస్ సర్వే నిర్వహిస్తున్న చెన్నై సంస్థ
- త్వరలో రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్‌కు నివేదిక
- 2016 బడ్జెట్‌లో నూతన రైలుమార్గం మంజూరు
- నాలుగేళ్లలో పూర్తి చేసేలా లక్ష్యం

మెయిన్‌లో..

# మేము సైతం

- ఉపపోరులో జిల్లా నేతల కీలకపాత్ర
- నంద్యాలలో ఫలించిన ప్రణాళికలు
- ప్రచారంలో భాగస్వాములైన నేతల్లో విజయానందం
- సీఎం చంద్రబాబు నుంచి మెచ్చుకోలు

9

# హస్తం.. నిస్తేజం

- నంద్యాల పరాజయంతో కాంగ్రెస్‌లో కలవరం
- రాజకీయ భవిష్యత్తుపై జిల్లా నేతల్లో బెంగ

9



ఇద్దరి కర్మకాండలు ఒకే చోట నిర్వహిస్తున్న దృశ్యం

16

# కర్మకాండలకు.. స్థలం కరువు

- ముందస్తుగా రిజర్వు చేసుకోవాల్సిన దుస్థితి
- అద్దె ఇళ్లలో ఉండే వారిబాధలు వర్ణనాతీతం
- సౌకర్యాలపై కార్పొరేషన్ కనికరం చూపాలి

# సీపీఎస్.. వద్దే వద్దు



● 1న విజయవాడ వేదికగా ఉద్యోగుల 'మిలియన్ మార్చ్'

● లక్షలాది మంది ఉద్యోగులతో తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి మహార్యాలీ

● బిషప్ అజరయ్య స్కూల్‌లో భారీ బహిరంగ సభ

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమల్లోకి తీసుకురావటంపై ప్రభుత్వ ఉద్యోగులు అమీతుమీ తేల్చుకోవటానికి సిద్ధమయ్యారు. సీపీఎస్ విధానంలోని ఇబ్బందులను గుర్తించిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమయ్యారు. రేపు మాకేమైనా అయితే మా పిల్లల పరిస్థితి ఏమిటన్న భయం ప్రతి ప్రభుత్వ ఉద్యోగిని వేధిస్తోంది. అందుకే సీపీఎస్‌ను వ్యతిరేకిస్తూ మిలియన్ మార్చ్‌కు ఉద్యోగులు శ్రీకారం చుట్టారు. బెజవాడ వేదికగా లక్షలాది మందితో గర్జించటానికి 'మిలియన్ మార్చ్'కు ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ శ్రీకారం చుట్టింది. శుక్రవారం విజయవాడలో జరిగే మిలియన్ మార్చ్‌లో అన్ని ప్రభుత్వ సంఘాల ఉద్యోగ సంఘాలు సంయుక్తంగా పాలు పంచుకుంటున్నాయి.

(గుంటూరు)

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం తప్పనిసరి చేసిన సీపీఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యో గులకు కూడా వర్తింపు చేస్తూ ఉన్నతాధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయంపై ప్రభుత్వ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ఉద్యోగుల సమిష్టి ఆందోళనలతో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ప్రయోజనం కల్పించే దిశగా ఫ్యామిలీ పెన్షన్, డెత్ గ్రాట్యుటీలకు సంబందించిన జీవోలు జారీ చేసినప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం సీపీఎస్ వ్యవస్థ రద్దునే కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ విషయంలో సంఘటిత చైతన్యాన్ని చాటడానికి భవిష్యత్తులో నిర్వహించబోయే మహోద్యమం గురించి కార్యాచరణ రూపొందించుకోవటానికి ఈ మిలియన్ మార్చ్‌కు శ్రీకారం చుడుతున్నారు.

### ● ఏమిటీ సీపీఎస్ ?

సీపీఎస్ అంటే... కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్. దీనిని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఉద్యోగుల భవిష్య నిధి (పీఎఫ్) స్థానంలో ఈ సరికొత్త విధానాన్ని తీసుకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రవేశపెట్టిన నూతన విధానం ఇది. దీని ప్రకారం 2004 సంవత్సరం తర్వాత వచ్చిన ఉద్యోగులంతా సీపీఎస్ పరిధిలోకి వస్తారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసమే ఈ విధానం తీసుకున్నప్పటికీ, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాన్ని తమ ఇష్టానుసారం అనుసరించవచ్చునని సూచించటం జరిగింది. దీనిని అమలు చేయాలన్నా, చేయకూడదనుకున్నా పూర్తి విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకుసీపీఎస్‌ను తప్పనిసరి చేయలేదు.

### ● ఉన్నతాధికారుల అనాలోచిత చర్యతో అమల్లోకి :

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల అనాలోచిత దుందుడుకు చర్యల ఫలితంగా... ఇక్కడి ప్రభుత్వ ఉద్యోగులు సీపీఎస్ విధానంలోకి వచ్చారు. ఒక్క ఉదుటున జీవో నెంబర్ 653, 654, 655 లను జారీ చేసి, సీపీఎస్ వ్యవస్థను అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ విధానాన్ని అమలు చేసే ముందు ప్రభుత్వ ఉద్యోగ సంఘాల అభిప్రాయం ఏమిటన్నది కూడా తీసుకోకుండా ఏకపక్షంగా అమల్లోకి తీసుకు వచ్చారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది ఉద్యోగులు ఆందోళన బాట పడుతున్నారు.

### ● పాత విధానం ఇలా ..

గతంలో ఉన్న విధానాన్ని చూస్తే... ఉద్యోగులు భవిష్యనిధి కోసం తమ వంతు ప్రతి నెలా దాచుకునేవారు. దీనికి ప్రభుత్వం కొంత మ్యాచింగ్ కలిపి జమ చేస్తుంది. పదవీ విరమణ తర్వాత వడ్డీతో సహా మొత్తం దాచుకున్న సొమ్మును పొందేవారు. కేడర్‌ను బట్టి నిర్ణీత గ్రాట్యుటీ, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, కమ్యూటేషన్‌లు పొందేవారు.

### ● కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానం ఇలా :

సీపీఎస్ నూతన విధానంలో పాత విధానం ఉండదు. కేడర్‌ను బట్టి ఉద్యోగి బేసిక్‌లో డీఏ 10 శాతం ఎంత మొత్తం అయితే అంత మొత్తం ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ వేసి ఆ మొత్తాన్ని శాశ్వత పదవీవిరమణ (ప్రాన్) ఖాతాలో జమ చేస్తుంది. ఇలా ఈ ఖాతాలో ఉన్న సొమ్మును ఎన్ఎస్‌బీఎల్ అనే ప్రైవేటు సంస్థ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతుంది. ఈ సంస్థకు చెందిన ఫండ్ మేనేజర్లు రకరకాల సంస్థలలో పెట్టుబడులు పెడతారు. మన రాష్ట్రానికి వచ్చేసరికి ఎల్ఐసీ, యూటీఐ, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలలో పెట్టుబడులు పెడతారు.

### ● 'సీపీఎస్' పై ఎందుకింత రాద్ధాంతం ?

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంలో గ్రాట్యుటీ, పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్, కమ్యూటేషన్‌లు వంటివి ఉద్యోగులు పొందే పరిస్థితి లేదు. అనేక ఇబ్బందుల గురించి ప్రభుత్వ ఉద్యోగులు ప్రస్తావిస్తూ పెదవి విరుస్తున్నారు. ఉద్యోగి చనిపోతే దహన సంస్కారాలకు రూ.15 వేలు తప్పితే ఈ విధానం ద్వారా పొందే అదనపు ప్రయోజనాలు లేవు. పదవీ విరమణ చెందిన ఉద్యోగికి తాను దాచుకున్న సొమ్ములో పూర్తిగా తీసుకోవటానికి వీలు లేదు. ఉద్యోగి సొమ్మును 60 - 40 గా విభజిస్తారు. ఉద్యోగి వాటా 60 శాతంలో 30 శాతం ట్యాక్స్ మినహాయింపులుపోను మిగిలిన సొమ్మును అందిస్తారు. అంటే ఒక ఉద్యోగి రూ.30 లక్షలు దాచుకుంటే అందులో 30 శాతం రూ.9 లక్షలు పోగా రూ.21 లక్షలు మాత్రమే ఇస్తారు. ఇక పోతే మిగిలిన 40 శాతం ఉద్యోగుల పొదుపును మళ్ళీ యాన్యుటీలలో (షేర్ మార్కెట్) పెట్టుబడులు పెడతారు. వీటిపై వచ్చే వడ్డీని 12 నెలల దామాషాలో విభజించి ఏ ఏడాది కాఏడాది పింఛను ఇస్తారు. సీపీఎస్ విధానంలో భాగంగా ఉద్యోగుల దాచుకున్న సొమ్మును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం వల్ల మార్కెట్ హెచ్చు తగ్గలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు ఆధారపడి ఉంటాయి. మార్కెట్ పడిపోతే ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలు కూడా తగ్గిపోతాయి. చనిపోయిన ఉద్యోగులు పింఛను అందుకోవాలన్నా కష్ట సాధ్యంగా ఉంటుంది.

### ● పోరాటాలతో... డెత్‌గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధన

ప్రభుత్వ ఉద్యోగులంతా సంఘటితమై విజయవాడ నుంచి ఉద్యమాన్ని ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా ఉధృత స్థాయిలో ఆందోళనలు చేయటంతో ప్రభుత్వం స్పందించింది. హర్యానా తర్వాత మన రాష్ట్రం రెండవదిగా డెత్ గ్రాట్యుటీని ప్రవేశపెట్టింది. ఫ్యామిలీ పెన్షన్‌ను మొదటి సారిగా మన రాష్ట్రమే అమలు చేసింది. చనిపోయిన ఉద్యోగులు డెత్ గ్రాట్యుటీతో పాటు, ఫ్యామిలీ పెన్షన్ లను పొందే సౌకర్యం ఉంది





## దుర్గగుడిలో ఆర్జిత సేవలు

- తెల్లవారు జాము 3.00గంటలకు కవాట ఉద్ఘాటన. అనంతరం సుప్రభాత సేవ, ప్రాతఃకాలర్చాన, బాలభోగనివేదన, హారతి
- ఉదయం 6-7, 10.45-11.45, 4.45 నుంచి 5.45 గంటల వరకు త్రికాలార్చన
- 4 గంటలకు సర్వదర్శనం, 5 గంటల వరకు ఖడ్గమాల పూజ
- 6.30గం. అమ్మవారికి నివేదన
- ఉదయం 7 - 9గంటల మధ్య రుద్రహోమం
- ఉదయం 9 - 12.00 మధ్య లక్ష కుంకుమార్చన, శ్రీచక్రార్చన, చండీహోమం, శాంతి కల్యాణం
- 11 - 12 మధ్య సౌభాగ్య ప్రదాయనీ పూజ
- మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన
- సాయంత్రం 6- 6.30 గంటల మధ్య పంచహారతులు
- రాత్రి 10 గంటలకు ఆలయం మూసివేత

## శ్రీవారి సమాచారం



తిరుమల తిరుపతి శ్రీవారి ఆర్జిత సేవలు వివరాలు టీటీడీ కళ్యాణ మండపం లోని ఈ దర్శనం కౌంటర్‌లో...

**ప్రత్యేక దర్శనం** : ఆగస్టు 30 నుంచి నవంబర్ 30 వరకు ఖాళీలు ఉన్నాయి.

**ఆర్జిత సేవలు** : కల్యాణం, ఊంజల్ సేవ, వసంతోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం,సహస్ర దీపాలంకరణ, విశేషపూజ సేవలకు సంబంధించి అక్టోబరు 28,29 తేదీలకు బుధవారం జారీ చేస్తారు.

**కాటేజీలు:** అక్టోబర్ 11 నుంచి డిసెంబర్ 23 వరకు ఖాళీలు ఉన్నాయి. రూ.300ల ప్రత్యేక దర్శకం టిక్కెట్లు ఒక్కరు ఎంత మందికైనా పొందవచ్చు. సేవా టిక్కెట్లు ఇద్దరికే జారీ చేస్తారు. టిక్కెట్ల కోసం వెళ్లే భక్తులు తమ ఆధార్ కార్డును, టిక్కెట్లు ఎవరికి తీసుకుంటున్నారో వారి ఆధార్ కార్డులను తీసుకు వెళ్లాలి. సేవా టిక్కెట్లు 60 రోజుల ముందుగా, ప్రత్యేక దర్శనం టిక్కెట్లు, కాటేజీలు 120 రోజుల ముందు జారీ చేస్తారు.

**ఈదర్శన్ కౌంటర్‌లు పనిచేయు వేళలు** : సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 1గంట వరకు, తిరిగి సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు, ఆదివారం సాయంత్రం 7 గంటల వరకు కేంద్రం పనిచేస్తుంది. ప్రతి మంగళవారం శెలవు

- చిలకలూరిపేట టౌన్

## మినీ లోకం




ఇకనైనా పాఠాలు నేర్చుకోండి!!

# సహజీవనం చేశాడు .. హతమార్చాడు

**అమరావతి**: వివాహితతో సహజీవనం చేస్తూ అనుమానంతో ఆమెను హత్య చేసిన ఘటన అమరావతి మండల పరిధిలోని ధరణికోట గ్రామం అంబేద్కర్ కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సత్తెనపల్లి సమీపంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన బత్తుల బాలశౌరి భార్యా పిల్లలను వదలిపెట్టి ధరణికోట గ్రామానికి చెందిన మండెపూడి సునంద(32)తో సహజీవనం చేస్తున్నాడు. సునంద భర్త నీలాంబరం ఏడు సంవత్సరాల క్రితం మరణించాడు. మంగళవారం మధ్యాహ్నం సునంద ఇంట్లో ఉండగా బాలశౌరి ఆమె ప్రవర్తనపై అనుమానంతో ఘర్షణ పడ్డాడు. ఇంట్లో ఉన్న రెక్కలు లేని సీలింగ్ ఫ్యాన్‌ను తీసుకుని సునంద తలపై కొట్టడంతో బలమైన గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సునంద తండ్రి మరియదాసు ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు నరసింహారావు, రహంతుల్లా హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సునందకు కుమార్తె ఉంది.




బాలశౌరి, సునందల ఫైల్ ఫొటో, రక్తం మడుగులో సునంద మృతదేహం

## జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజీవ్ ఆనంద్

**గుంటూరు(లీగల్)**: గుంటూరు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరుకు చెందిన న్యాయవాది శ్రీరామ్ రాజీవ్ ఆనంద్‌ను నియమిస్తూ ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి డీవీ రమణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజీవ్ ఆనంద్ జిల్లా ప్రధాన న్యాయస్థానంలో మూడేళ్లపాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించనున్నారు. ప్రస్తుతం టీడీపీ లీగల్ సెల్ నగర అధ్యక్షుడిగానూ, మిర్చి యార్డు పాలకవర్గ సభ్యునిగానూ ఉన్నారు. తనను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించినందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, జిల్లా మంత్రులు, చీఫ్ విప్, ఎంపీలకు, ఎమ్మెల్యేలకు, మిర్చి యార్డు ఛైర్మన్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిల్డర్‌కు జిల్లా ఫోరంలో జరిమానా

**గుంటూరు(లీగల్)**: అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అడ్వాన్స్‌లు తీసుకొని నిర్మాణం మధ్యలోనే ఆపిన ప్యారడైజ్ కన్స్ట్రక్షన్స్ బిల్డర్ కల్యాణపు వెంకటేశ్వరరావును జిల్లా వినియోగదారుల ఫోరం మండిపడింది. తీసుకున్న అడ్వాన్స్‌తో పాటు రూ. 50 వేలు పరిహారం చెల్లించాలని బిల్డర్‌ను ఫోరం ఛైర్మన్ రామారావు, సభ్యులు సునీత ఆదేశించారు. దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నారదాసు బుచ్చయ్య గుంటూరులో ప్లాటు కొనదలచాడు. ఆ సమయంలో ప్యారడైజ్ కన్‌స్ట్రక్షన్స్ బిల్డర్ వెంకటరావు తాను టీజేపీఎస్ కళాశాల దగ్గరలో పూర్ణచంద్ర ప్యారడైజ్ అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నానని తెలిపారు. ఒక ప్లాట్‌కు రూ. 32 లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. 2015 ఏప్రిల్ 9న రూ. ఏడు లక్షలు అడ్వాన్స్‌గా బిల్డరకు చెల్లించాడు. మిగతా రూ 25 లక్షలు నిర్మాణం పూర్తయ్యేలోపు చెల్లించేటట్లు వారి మధ్య ఒప్పందం కుదిరింది. బిల్డర్ వెంకటేశ్వరరావు పునాదుల మేరకు నిర్మించి, చేతులెత్తేశాడు. నిర్మాణం పూర్తి చేసి ప్లాట్ అప్పగించాలని, లేకుంటే తీసుకున్న అడ్వాన్స్ తిరిగి చెల్లించమని పలుమార్లు తిరిగినా ఫలితం లేకపోవడంతో జిల్లా వినియోగదారుల ఫోరాన్ని బుచ్చయ్య ఆశ్రయించాడు. ఈ కేసులో ఇరుపక్షాల వాదనను విన్న ఫోరం మంగళవారం తీర్పు చెప్పింది. అడ్వాన్స్ రూ. 7 లక్షలకు రూ. 9 శాతం వడ్డీతో ఇచ్చేయాలని, పరిహారం కింద రూ. 50 వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ. 5 వేలు బుచ్చయ్యకు ఆరువారాల్లో చెల్లించాలని బిల్డర్‌ను ఆదేశించింది.

# కాల్వలో దూకి గర్భిణి మృతి

**దుగ్గిరాల:** మండలంలోని రేవేంద్రపాడు గ్రామానికి చెందిన చావలి భవ్య(24) పుట్‌బ్రిడ్జిపై నుంచి పశ్చిమడెల్టా కాల్వలోకి దూకింది. ఆమె ఏడు నెలల గర్భిణి. మంగళగిరిలో వైద్యపరీక్షల నిమిత్తం మంగళవారం ఉదయం ఇంటి నుంచి తండ్రితో ఆమె బయలుదేరింది. తండ్రి శివలాల్ పుట్‌బ్రిడ్జిపై ముందు నడుస్తుండగా వెనుకనున్న ఆమె ఉన్నట్లుండి ఒక్కసారిగా పశ్చిమడెలా కాల్వలోకి దూకింది. తండ్రి గమనించి కేకలు వేశాడు. సమీపంలో సాయపడేందుకు ఎవరూ లేకపోవడం, 4 వేల క్యూసెక్కుల నీటితో నిండుగా ఉధృతంగా ప్రవహిస్తున్న కాల్వలోకి దూకిని వెంటనే భవ్య మునిగిపోయింది. వట్టిచెరుకూరు మండలం సౌపాడుకు చెందిన చావలి వీరనారాయణతో భవ్యకు ఏడాదిన్నర క్రితం వివాహమైంది, భవ్యకు తొలి విడత అబార్షన్ కాగా, అప్పటి నుంచి ఆమె మానసిక పరిస్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. నెలరోజులక్రితం సౌపా డు నుంచి పుట్టింటికి వచ్చిన భవ్య తనతో ఫోన్‌లో ఎప్పుడూ పరధ్యానంగా మాట్లాడేదని భర్త వీరనారాయణ తెలిపారు. ఎస్ఐ ఎం.మురళి సంఘటనా స్థలానికి చేరుకుని భర్త, తండ్రి ఇతర కుటుంబ సభ్యులను విచారించారు. కాల్వలో దూకిన భవ్య ఆచూకీ సాయంత్రం వరకూ లభించలేదని ఎస్ఐ తెలిపారు.



భవ్య (ఫైల్ ఫొటో)

# ఉద్యోగోన్నతి పొందిన ఏఎస్ఐలు మరింత బాధ్యతగా ఉండాలి

● అర్బన్ ఎస్పీ విజయరావు ● పుష్పగుచ్ఛం అందించిన వైనం



**గుంటూరు:** ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు మరింత బాధ్యతగా పని చేయాలని అర్బన్ ఎస్పీ సీహెచ్ విజయరావు సూచించారు. హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన వారు మంగళవారం అర్బన్ ఎస్పీ విజయరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగోన్నతి పొందడం అంటే బాధ్యత పెరిగినట్లేనని గుర్తించాలన్నారు. ప్రజలు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా మెలుగుతూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వైటీ నాయుడు, తిరుపాల్, డీఎస్పీ దేవరకొండ ప్రసాద్ పాల్గొన్నారు.

**స్వచ్ఛంద సేవకుల ఎంపిక!**

అర్బన్ జిల్లా పరిధిలోని పది స్వచ్ఛంద సేవకులను ఎంపిక చేసి ముందుగా వారికి శిక్షణ ఇస్తామని, వారి ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇస్తారని అర్బన్ ఎస్పీ తెలిపారు. మంగళవారం పోలీస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన, అదనపు ఎస్పీలు ఎన్ఎస్ఎస్, స్వచ్ఛంద సేవా ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి జిల్లా నుంచి 10 మంది స్వచ్ఛంద సేవకులను ఎంపిక చేసి, వారికి పోలీస్ శాఖ ద్వారా శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. వారు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 8,9వ తరగతుల వారికి సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సి ఉంటోందన్నారు. అర్బన్ పోలీసులు గుర్తించిన పది మంది స్వచ్ఛంద సహాయకుల వివరాలను ఏపీ స్టేట్ నోడల్ అధికారి ఐసీ ఎన్. సంజయ్‌కు పంపామని అన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ వైటీనాయుడు, డీఎస్పీలు సరిత, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## అరవింద విద్యార్థులకు దంత పరీక్షలు



**మంగళగిరి టౌన్:** స్థానిక నిడమర్రు రోడ్డులోని అరవింద మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం దంత పరీక్షలు నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలోని డాక్టర్ శ్రీధర్, ఓరల్ హెల్త్ ఫౌండేషన్‌కు సంబంధించిన వైద్యులు చంద్ర, మనీషా, నవ్య, సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో అరవింద యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

# హామీలను నెరవేర్చాలి

**• సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల**



ప్రసంగిస్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు

**మంగళగిరి:** అగ్రిగోల్డ్ ఖాతాదారులకు, ఏజెంట్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకుంటే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అగ్రిగోల్డ్ కష్టమర్లను, ఏజెంట్లను చైతన్యవంతం చేసేందుకు అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ కస్టమర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఇచ్ఛాపురం నుంచి చేపట్టిన అగ్రిగోల్డ్ బాధితుల చైతన్య యాత్ర మంగళవారం పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తెనాలి రోడ్డులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చైతన్య యాత్ర బృందానికి ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి ద్విచక్రవాహనాలతో ర్యాలీగా ఈద్గా మసీదు షాదీఖానా వద్దకు చేరుకున్నారు. అనంతరం బహిరంగ సభలో ముప్పాళ్ల ప్రసంగించారు. ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 32 లక్షల మంది, ఏపీలో 19.5 లక్షల మంది కుటుంబాలను అగ్రిగోల్డ్ సంస్థ వీధిపాలు చేసిందని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వి.తిరుపతిరావు మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కాలయాపన చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఇంటింటికీ వెళ్లి బాధితులను కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు తమ పాటలతో బాధితుల్లో చైతన్యం నింపారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ ఏజెంట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయసింహా, జిల్లా కార్యదర్శి అగస్టీన్, సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి శివారెడ్డి, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, పిల్లలమర్రి నాగేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు, పత్తెపరపు శివ, సుహాస్, శివకరరావు పాల్గొన్నారు.

## పంట కాలువలోకి ప్రైవేటు బస్సు

**● ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డ 30 మంది**
**● ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ వద్ద ఘటన**



స్కూలు బస్సును పరిశీలిస్తున్న ఎస్‌ఐ వాసు

**మంగళగిరి రూరల్:** ఓ స్కూలు బస్సు రోడ్డు మార్జిన్ దిగి, పంట కాలువలోకి వెళ్లింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా ఈ ఘటన జరిగిందని తల్లిదండ్రులు ఆరోపించారు. కోపోద్రుక్తులైన వారు బస్సు అద్దాలు పగలగొట్టారు. ఆ వివరాలు.. మండలంలోని ఐనవోలు మంగళగిరి మార్గమధ్యలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ సమీపాన బస్సు కాలువలోకి దిగింది. పక్కకు పడినట్లయితే పెను ప్రమాదం సంభవించేదని పలువురు చెబుతున్నారు. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటనా స్థలానికి చేరుకొని, డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనే ఇలా జరిగిందంటూ ఆగ్రహావ్యక్తం చేశారు. పలువురు, బస్సు అద్దాలను పగులగొట్టారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ ఎస్‌ఐ కె వాసు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై తమకు ఏవిధమైన ఎలాంటి ఫిర్యాదూ అందలేదని తెలిపారు.

## క్షుద్ర పూజ చేస్తున్న వారిపై ఫిర్యాదు



ఇండస్ట్రియల్ ఏరియాలో క్షుద్ర పూజ కోసం తీసిన గుంత

**మంగళగిరి రూరల్:** తమ స్థలం హద్దుల్లో గల రేకులను తొలగించి, రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేస్తున్నారని కొత్తపల్లి శ్రీనివాసరావు మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియా, ప్లాట్ నెంబర్ - 36లో గతంలో ఎయిర్‌కూలర్స్ తయారుచేసే వారమని, ప్రస్తుతం చేయడం లేదు. సోమవారం సాయంత్రం తమ ప్లాటు స్థలం హద్దుల్లో గల రేకులను తొలగించి, క్షుద్రపూజలను గుర్తు తెలియని వ్యక్తులు చేస్తున్నారు. వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో ఉంది.

## తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుదాం





ప్రసంగిస్తున్న కరస్పాండెంట్ రాజశేఖర్

**మంగళగిరి:** తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని వీజే విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్ అన్నారు. స్థానిక వీజే డిగ్రీ కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడారు. అమెరికా తదితర దేశాల్లో సైతం తెలుగు వారికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందన్నారు. ఉపాధి కోసం ఆంగ్లం ఆవశ్యకత ఉండొచ్చు గానీ, దానిని మాతృభాషకు ముడి పెట్టడం సరికాదన్నారు. తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శిఖా శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమ్మె నోటీసు అందజేత

**తాడేపల్లి టౌన్:** జీవో నెంబర్. 279ని రద్దు చేయాలంటూ సెప్టెంబర్ 15వ తేదీ నుంచి సమ్మెలోకి వెళతామని తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ శివారెడ్డికి మంగళవారం మున్సిపల్ కార్మికుల జేఏసీ నేతలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు బూరగ వెంకటేశ్వర్లు, కోలపల్లి ప్రభాకర్, దాసు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా- ఒకరికి గాయాలు

**● వెంకటరెడ్డిపాలెం వద్ద ఘటన**



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

**మంగళగిరి రూరల్:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలపాలైన ఘటన మండలంలోని కాజ వెంకటరెడ్డిపాలెం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజ సర్వీస్ రోడ్‌లో గుంటూరు వైపు వెళుతున్న లారీని, ఆటో ఓవర్ టేక్ చేస్తున్న క్రమంలో ఢీకొని బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన మల్లవరపు వెంకటస్వామి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని రోడ్డు సేఫ్టీ వెహికల్ త్రీ సిబ్బంది, అంబులెన్సులో గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు.

## బేతపూడిలో అన్నదానం

**మంగళగిరి రూరల్:** మండలంలోని బేతపూడి గ్రామంలో గణేష పూజా మందిరం వద్ద మంగళవారం పలువురు గ్రామస్థులు, టీడీపీ నేతలు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆరుద్ర భూలక్ష్మి, పలువురు గ్రామస్థులు, నేతలు పాల్గొన్నారు.

## కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారు

**● సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా**





ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు,కార్యకర్తలు

**తాడేపల్లి టౌన్:** మున్సిపల్ అధికారులు కృష్ణా నగర్‌కు కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ కృష్ణనగర్ జోన్ సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వేముల దుర్గారావు మాట్లాడారు. కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, మున్సిపల్ అధికారులు ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడడం తగదని హితవుపలికారు. పలువురు మహిళలు కలుషిత నీటి బాటిల్స్‌ను చూపించారు. ఈ కార్యక్రమంలో నేతలు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, సరస్వతీ, శౌరీ, బాష్యరెడ్డి, ముత్యాలరావు, బుజ్జి పాల్గొన్నారు.

**మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తాం: మున్సిపల్ కమిషనర్**

కృష్ణనగర్ వాసులకు మినరల్ వాటర్‌ను తక్షణమే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తాం. నెలరోజుల లోపే పరిశుభ్రమైన తాగు నీరు అందిస్తాం.



కలుషిత నీటిని చూపిస్తున్న మహిళలు

## ఆటో, బైక్ ఢీ- ఒకరికి తీవ్ర గాయాలు

**● ఆత్మకూరు హ్యాపీ క్లబ్ సమీపాన ఘటన**



క్షతగాత్రుడు ఇందుమౌళి



నుజ్జునుజ్జయిన బైక్

**మంగళగిరి రూరల్:** మండలంలోని ఆత్మకూరు హ్యాపీ క్లబ్ సమీపంలో మంగళవారం ఆటో, బైక్ ఢీ కొని ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం ఇందుమౌళి అనే యువకుడు ద్విచక్రవాహనంపై గుంటూరు వైపు నుంచి విజయవాడకు వెళుతున్నాడు. ఆత్మకూరు ప్రాంతానికి చేరుకోగానే ముందు వైపు ఉన్న ఆటో సడెన్ బ్రేక్ వేయగా బైక్, ఆటో ఢీ కొన్నాయి. బైక్‌పై ఉన్న ఇందుమౌళికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించారు. రూరల్ ఎస్‌ఐ వాసు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## సినిమా గైడ్

| | |
|---|---|
| ఊర్వశి | ఆనందో బ్రహ్మ |
| గోపాలకృష్ణ | ఫిదా |
| వెంకటేశ్వర | నేనే రాజు.. నేనే మంత్రి |
| విజయ | జయజానకీ నాయక |

## హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

**సమయం :** ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య
**ఫోన్ నెంబర్ :** 9985411231

# హా..ర్టీసీ

హా.. ర్టీసీ ! సీఎన్‌జీ బస్సు క్షణాల్లో అగ్నికి ఆహుతైంది. నలభై మంది ప్రయాకులతో బయలుదేరిన ఈ బస్సు బెజవాడలో మంగళవారం 16వ నెంబర్ జాతీయ రహదారిపై దగ్ధమైంది. డ్రైవర్ వెంకటేశ్వరరావు చాకచక్యంగా ప్రయాణికులను అప్రమత్తం చేయటంతో పెనుప్రమాదం తప్పింది. వారు దిగగానే బస్సు కింద భాగంలో చెలరేగిన మంటలు దావానలంలా వ్యాపించాయి. చూస్తుండగానే బస్సు మొత్తం అగ్నికీలల్లో చిక్కుకుంది. ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. దాదాపు అర్ధగంటపాటు బస్సు దగ్ధమౌతూనే ఉంది. అగ్నిమాపక శాఖ అధికారులు వచ్చి పదిహేను నిమిషాల్లో మంటలను అదుపులోకి తెచ్చారు. సీఎన్‌జీ సిలిండర్ల నుంచి గ్యాస్ లీక్ కావడం వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చునని మొదట భావించారు కానీ బస్సుకు కుడి భాగంలో వెనుక టైర్ల వెనుక ఈ సిలిండర్లు ఉన్నాయి. ఈ భాగంలో కేబుల్స్ కూడా ఉండవు. ప్రమాదం ఎలా సంభవించిందన్నది అధికారులకు కూడా అంతు చిక్కటం లేదు. సీఎన్‌జీ లీక్‌తో పాటు, షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయని ప్రత్యక్షంగా చూసిన వారు చెబు తున్నారు.

- క్షణాల్లో అగ్నికి ఆహుతి
- ఇలా జరగడం రెండో సారి
- డ్రైవర్ , కండక్టర్ అప్రమత్త త: తప్పిన పెను ముప్పు
- 40 మంది ప్రయాణికులు సురక్షితం
- అశోక్ లేలాండ్ ప్రతినిధులకు సమాచారం



బస్సు దగ్ధంతో ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మాచవరం / భారతీనగర్):**

గవర్నర్ పేట - 2 డిపోకు చెందిన రూట్ నెంబర్ 54 సీఎన్‌జీ బస్సు ఆటోనగర్ బస్సు డిపో నుంచి మొత్తం 70 మంది ప్రయాణికులతో ఉదయం 8 గంటలకు బయలు దేరింది. బెంజ్‌సర్కిల్ వరకు బాగానే వచ్చింది. అక్కడి నుంచి 16వ నెంబరు జాతీయరహదారి వైపునకు వచ్చే సందర్భంలో బస్సు సమస్యాత్మకంగా ఉందని గుర్తించారు. గవర్నమెంట్ హాస్పిటల్ వరకు బస్టాపుల్లో ప్రయాణికులు ఎక్కి దిగుతూనే ఉన్నారు. ప్రభుత్వాసుపత్రి స్టాప్ నుంచి బయలు దేరే సమయానికి బస్సులో 40 మంది ప్రయాణికులు వున్నారు. కొద్ది దూరం వెళ్ళగానే బస్సులో ఒక్కసారిగా శబ్ధం రావటంతో బస్సును నిలుపు చేసి కుడివైపున పరిశీలిస్తుండగా.. ఎడమవైపు నుంచి పొగలు రావటం గమనించారు. పొగతో పాటు మంటలు రావటంతో ఒక్కసారిగా కండక్టర్‌ను, ప్రయాణి కులను డ్రైవర్ అప్రమత్తం చేశారు. వారు దిగిపోయారు. వెంటనే నిమిషాల వ్యవధిలో బస్సు మొత్తానికి మంటలు వ్యాపించాయి. బస్సు దగ్ధమైనా సీఎన్‌జీ సిలిండర్లు మాత్రం పేలలేదు. ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ ఎన్‌వీ రావు, కృష్ణా ఆర్ఎం పీవీ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. బస్సు ప్రమాద ఘటనపై అంచనాకు రాలేకపోయారు. అశోక్ లేలాండ్ ప్రతినిధులకు సమాచారం అందిం చారు. వారు ఈ బస్సును పరిశీలించి నివేదిక ఇవ్వనున్నారు.

### ఇది రెండో సీఎన్‌జీ బస్సు ప్రమాదం

ఆర్టీసీ సీఎన్‌జీ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు తెలుపుతున్నారు. దగ్ధమైన బస్సుల్లో ఇది రెండో సీఎన్‌జీ! ఇంతకు ముందు నున్న వెళ్ళే మార్గంలో సీఎన్‌జీ బస్సు దగ్ధమైంది. అప్పట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా బస్సు దగ్ధమైంది. ప్రస్తుత ఘటనలో గ్యాస్ లీక్ అయినా ... షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగినట్టు తెలుస్తోంది. రెండు ఘటనల్లోనూ సిలిండర్లు పేలలేదు. సీఎన్‌జీ సిలెండర్ల నుంచి మంటలు వచ్చే అవకాశం ఉండదని, గ్యాస్ లీకైన మాట వాస్తవమే అయినా ఫైర్ ఎక్కడి నుంచి వచ్చిందన్నది అధికారులకు అంతుచిక్కక లేలాండ్ కంపెనీ ప్రతినిధులను పరిశీలించటానికి ఆహ్వానించారు. సీఎన్‌జీ కాకుండా ఇటీవల కాలంలో ఇప్పటికే రెండు బస్సులు దగ్ధమయ్యాయి. విజయవాడ డిపో గ్యారేజీలో ఒక గరుడ , ఒక సూపర్ లగ్జరీ బస్సు దగ్ధమైంది.

### ఆర్టీసీ సిబ్బందికి నగదు రివార్డులు

ప్రమాదం గురించి తెలుసుకున్న ఆర్టీసీ ఎండీ మాలకొండయ్య ప్రయాణికులను అప్రమత్తం చేసి వారి ప్రాణాలను కాపాడిన బస్సు డ్రైవర్ ఏ వెంకటేశ్వరరావు, కండక్టర్ శిరీషలను సన్మానించారు. ప్రశంశా పత్రాలతో పాటు రూ. 2 వేల నగదు బహుమతిని అందించారు.



డ్రైవర్ వెంకటేశ్వరరావు , కండక్టర్ శిరీష




సమావేశంలో ప్రసంగిస్తున్న అశోక్‌కుమార్. హాజరైన ఆడిటర్లు, బిల్డర్లు, అకౌంటెంట్లు

## జీఎస్‌టీ సులభతరం, అపోహలొద్దు

**అవగాహనా కార్యక్రమంలో అమరావతి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఐ.అశోక్‌కుమార్**

**విజయవాడ సెంట్రల్:** జీఎస్‌టీపై ప్రజలకు, వ్యాపారులకు ఎటువంటి అపోహలు వద్దని ఇది ఎంతో సులభతర పద్దతని, టాక్స్ కడితే ఎటువంటి ఇబ్బంది ఉండదని జీఎస్‌టి అమరావతి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఐ.అశోక్‌కుమార్ అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి సెంటర్ జనరల్ బాడీ సమావేశంలో భాగంగా మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం బిల్డర్లు, కాంట్రాకర్లు, ఆడిటర్స్, అకౌంటెంట్స్‌కు జీఎస్‌టిపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో నేటికి 36 లక్షలకు పైగా 3బి రిటన్స్ దాఖలు చేశారని ఇది ఎంతో శుభపరిణామమని అన్నారు. జీఎస్‌టి అంటే అందరూ భయపడుతున్నారని, మనం ఏదైనా కొత్తది సాధించాలంటే మొదట కొంత కష్టంగా ఉంటుందని అన్నారు. చెల్లించే పన్నును ఇన్‌పుట్ ద్వారా పొందవచ్చని, అడ్డంకులన్నీ రెండు మూడు నెలల్లో సర్దుకుంటాయని అన్నారు. రిటర్న్‌లో ఇన్‌పుట్ ట్యాక్స్ పొందుపరిచేప్పుడు కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటు ందని పేర్కొన్నారు. వ్యాపారస్తుల్లో ఉన్న సందేహాలను తొలగించేందుకు జీఎస్‌టి సెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమరావతి పరిధిలో 7 రేంజ్‌లు ఏర్పాటు చేస్తామని, పనిదినాలలో వారికి ఎటువంటి సందేహాలు ఉన్నా నేరుగా ఆఫీసుకు వచ్చి క్లియర్ చేసుకోవాల న్నారు. అనంతరం రేట్ ఆఫ్ ట్యాక్స్ డిఫరెన్స్, బిల్డర్లు జీఎస్‌టికి ముందు ఉన్న బిల్లులు జీఎస్‌టి అమలులోకి వచ్చిన తరువాత ఎలా పొందుపరచాలి, వాటి ఇన్‌పుట్‌ను ఎలాపొందాలి, జీఎస్‌టిలో ఉన్న సదుపా యాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో జీఎస్‌టి అమరావతి రేంజ్ సూపరింటెండెంట్ తుమ్మల విజయలక్ష్మీ, బీఏఐ అమరావతి సెంటర్ ఛైర్మన్ అత్తలూరి నాగ మల్లేశ్వరరావు, అధ్యక్షులు ఎంబి ఫణికుమార్, కార్య దర్శి తుమ్మల వంశీకృష్ణ, కోశాధికారి రజా, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, ఆడిటర్లు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

## డీఈవోల బదిలీలు పారదర్శకంగా జరగాలి

- ప్రభుత్వానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల విజ్ఞప్తి

**విజయవాడ సెంట్రల్:** రాష్ట్రంలో అన్ని డీఈవో స్థాయి పోస్టులు ఒకేసారి భర్తీచేయాలని, ప్రమోషన్లు, బదిలీలలో పారదర్శకత పాటించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విధానాన్నే డీఈవోలకు పాటించాలని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం (పీడీఎఫ్) ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రమణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులురెడ్డి, రాము సూర్యారావులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో మినహా అన్ని జిల్లా లలోను జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీ విషయంలో అనేక అక్రమాలు జరుగుతు న్నట్లు వార్తలు రావడం దురదృష్టకరమన్నారు. డీఈవో పోస్టుల భర్తీ విషయంలో కార్పోరేట్ విద్యాసంస్థలు కూడా జోక్యం చేసుకుం టున్నాయని పేర్కొన్నారు. రెగ్యులర్ డీఈవో పోస్టుల్ని ప్రస్తుతం నింపి సర్వశిక్షాభియాన్ పోస్టుల్ని తర్వాత భర్తీచేయాలనుకోవడం కూడా అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అన్ని డీఈవో స్థాయి పోస్టులు ఒకేసారి భర్తీ చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమో షన్ల విధానాన్ని డీఈవోలకు పాటించాలని వారు డిమాండ్ చేశారు.

## ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి నీకులేదు

**వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నానిపై జూపూడి ఫైర్**



సమావేశంలో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్‌రావు

**విజయవాడ:** అవకాశవాద రాజకీయాలు చేసే నీకు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదంటూ వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నానిపై టీడీపీ అధికార ప్రతినిధి, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా పార్టీ కార్యాల యంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఉపఎన్నికలో పరాజయాన్ని జీర్ణించు కోలేక వైసీపీ నేతలు ప్రభుత్వంపై అర్ధరహిత విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలకు దిగితే ప్రచారంలో నోరు పారేసుకున్న రోజాకు పట్టిన గతే నీకు పడుతుందని నానీని హెచ్చరించారు. భవిష్యత్‌లో వైసీపీ రాష్ట్రంలో కనుమరుగవడం ఖాయమన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆకేపోగు ప్రభాకర్, గుడిసే దేవానంద్ పాల్గొన్నారు.



మహా మండపంలో కానుకలు లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

## దుర్గగుడి హుండీ ఆదాయం రూ. 1.90 కోట్లు

**విజయవాడ:** దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఈవో ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో మహామండపంలో మంగళవారం లెక్కించారు. 21 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 1,90,16,127ల ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. 685 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆరు కేజీల 430 గ్రాముల వెండి ఆభరణాలను భక్తులు సమర్పించినట్లు ఈవో తెలియజేశారు.

### 2, 3వ తేదీల్లో హైదరాబాద్‌లో పౌరహక్కుల సదస్సు

**విజయవాడ:** ప్రజా ఉద్యమాలను ప్రభుత్వాలు అణిచివేయటాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 2, 3 తేదీలలో హైదరాబాద్‌లో అఖిల భారత సదస్సును నిర్వహించనున్నట్టు కృష్ణాజిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు టి.ఆంజనేయులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన మందిరంలో జరిగే ఈ సదస్సుకు ఛత్తీస్‌ఘడ్ పౌరహక్కుల ఉద్యమ నాయకురాలు సోలీసోరి, పౌరహక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతిచైతన్య, పౌరహక్కుల నాయకుడు హరగోపాల్, బేలా భాటియా పాల్గొంటారని తెలిపారు.

# 'మీతో మీ ఎస్పీ'

- సమస్యల పరిష్కారానికి ప్రజల వద్దకే
- ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో చోరీలను అరికట్టాలి
- క్రికెట్ బెట్టింగ్, పేకాటలపై కఠిన వైఖరి
- నేర సమీక్షలో రూరల్ ఎస్పీ అప్పలనాయుడు



రూరల్ ఎస్పీ అప్పలనాయుడి నుంచి రివార్డులు అందుకుంటున్న ఓఎస్డీడీ సుధాకర్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు అశోక్‌కుమార్, హనుమంతరావు, సురేష్‌బాబు, శోభన్‌బాబు, ఆంజనేయులు

**గుంటూరు:** ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పోలీస్‌పరమైన సమస్యల పరిష్కారానికి 'మీతో మీ ఎస్పీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్పీ సీహెచ్ వెంకట అప్పలనాయుడు తెలిపారు. తాను పోలీస్ స్టేషన్ సందర్శనకు వచ్చినప్పుడు మీతో మీ ఎస్పీ కార్యక్రమం ద్వారా ఆ మండలంలోని ప్రజల ఫిర్యాదులను కూడా స్వీకరించి సమస్య పరిష్కారానికి సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయా స్టేషన్లను సందర్శించే విషయాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మంగళవారం పోలీస్ కార్యాలయంలో జరిగిన నేర సమీక్షలో ఆయన ప్రకటించారు. సమావేశంలో అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నిరుపయోగంగా ఉన్న బోరు బావులు పూడ్చని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్) ద్వారా ఇళ్లల్లో దొంగతనాలు అరికట్టాలన్నారు. తాళం వేసిన ఇళ్లల్లో చోరీల నియంత్రణకు ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకునేలా చూడాలన్నారు. రాత్రి వేళ గస్తీలను ముమ్మరం చేయాలన్నారు. పాత నేరస్థులు, జైలు నుంచి విడుదలైన నేరస్థుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు.

**మహిళా హాస్టల్స్‌పై నిఘా ఉంచండి...**

రూరల్ జిల్లా పరిధిలోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌పై నిఘా ఉంచాలని ఆదేశించారు. హాస్టల్‌లో ఆయా మహిళల పూర్తి వివరాలు, విజిటింగ్ రిజిస్టర్‌తో పాటు సీసీ కెమెరాలు ఉన్నాయో లేవో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసు నమోదు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి తగిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మట్కా, జూదం, క్రికెట్ బెట్టింగ్, కోడి పందాలు వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తప్పిపోయిన వారి కేసుల గురించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరితగతిన కేసులను ఛేదించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కాలేజి యాజమాన్యాలతో కలిసి విద్యార్థులకు ఆయా కళాశాలల్లో రహదారి భద్రత, యాంటి ర్యాగింగ్ తదితర అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సూరిబాబు, ఓఎస్‌డీ సుధాకర్, డీఎస్పీలు మధుసూదనరావు, నాగేశ్వరరావు, రమణమూర్తి, వెంకట నారాయణ, విక్రమ్ శ్రీనివాస్, చుండూరు శ్రీనివాసరావు, సూర్య నారాయణరెడ్డి, గోలి లక్ష్మయ్య, సత్యనారాయణ, శ్రీలక్ష్మి, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

**పోలీస్ అధికారులకు శోభిత, స్పందన, శోధన అవార్డులు**

**గుంటూరు :** విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన పలువురు డీఎస్పీలు, సీఐలకు శోభిత, స్పందన, శోధన అవార్డులు లభించాయి. ఈ మేరకు మంగళవారం పోలీస్ కార్యాలయంలో జరిగిన నేర సమీక్షలో వారికి అవార్డులు అందజేశారు. సమయ స్ఫూర్తి, అంకిత భావం, తక్షణం స్పందించిన తీరుపై అధికారులను ఈ అవార్డులకు ఎంపిక చేశారు.

పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా నిర్వహించిన మాక్‌డ్రిల్‌కు సంబంధించి ఓఎస్‌డీ సుధాకర్, ఏఆర్‌డీఎస్పీ సత్యనారాయణలకు శోభిత అవార్డులు లభించాయి. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన తప్పిపోయిన బాలుడిని పిడుగురాళ్ల బస్టాండ్‌లో గుర్తించడమే కాక తక్షణమే స్పందించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పిడుగురాళ్ల సీఐ హనుమంతరావుకు స్పందన అవార్డు లభించింది. పలు మిస్టరీ కేసులను ఛేదించిన తెనాలి త్రీటౌన్ సీఐ అశోక్‌కుమార్, చిలకలూరిపేట రూరల్ సీఐ శోభన్‌బాబు, చిలకలూరిపేట సీఐ సురేష్ బాబు, రేపల్లె రూరల్ సీఐ పీవీ ఆంజనేయులుకు శోధన అవార్డులు లభించాయి.

# రైతులకు మెరుగైన సేవలందించాలి

- అధికారులతో డీసీఎంఎస్ పాలక వర్గ సభ్యుల భేటీ
- రిక్విజిషన్ నోటీస్‌ను అజెండాలో చేర్చాలని ప్రతిపాదన

**ఆంధ్రజ్యోతి, గుంటూరు:** రైతులకు డీసీఎంఎస్ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి పాలకవర్గం ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని, ప్రధానంగా ఆదాయ వనరులను పెంచుకోవడానికే కోడి గుడ్ల పంపిణీని చేపట్టినట్లు సభ్యులు ఆరోపించారు. డీసీఎంఎస్‌లోని ఐదుగురు పాలక వర్గ సభ్యులు గుంటూరులో మంగళవారం అధికారులతో భేటి అయ్యారు. వైస్ ఛైర్మన్ పి నాగయ్య యాదవ్ (నరసరావుపేట), రావిపాటి కోటేశ్వరరావు (సత్తెనపల్లి), నారపరెడ్డి (మాచర్ల), నాయక్ (వినుకొండ), ఎలిశమ్మ (పెదకూరపాడు)లు సమావేశంలో పాల్గొన్నారు. సహకార శాఖలోని ఉన్నతాధికారులు విశ్రాంత అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా ఐదుగురు పాలక వర్గ సభ్యులు ఇచ్చిన రిక్విజిషన్ నోటీస్‌ను అజెండాలో నమోదు చేయలేదని సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. 2013 నుంచి ఇప్పటి వరకు డీసీఎంఎస్‌లో జరిగిన లావాదేవీలు, లెక్కలు, ఆడిట్, ఇతర అంశాలను సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించాలనే ప్రతిపాదన కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. రెండు వారాల్లో జరిగే పాలక వర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలను సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చారు. వైస్ ఛైర్మన్ నాగయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులు అధికార పార్టీకి చెందిన కీలక నేతతో భేటీ కావాలని సమావేశంలో నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

# అగ్రిగోల్డ్ కుంభకోణంలో రాజకీయపార్టీల భాగస్వామ్యం

- బాధితుల సమావేశంలో చలసాని శ్రీనివాస్



సభలో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు, వేదికపై చలసాని శ్రీనివాస్, మాదల రవి తదితరులు

**గుంటూరు(సంగడిగుంట):** అగ్రిగోల్డ్ కుంభకోణంలో అన్ని ప్రధాన పార్టీలకు భాగస్వామ్యం ఉందని ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మహిమా గార్డెన్స్‌లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 17 వరకు జరుగుతున్న బస్సు యాత్ర మంగళవారం గుంటూరుకు చేరింది. బస్సు యాత్రకు ఆటోనగర్ వై జంక్షన్ వద్ద సీపీఐ జిల్లా నేతలు స్వాగతం పలికి సభా స్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చలసాని మాట్లాడుతూ అన్ని పార్టీలకు పాత్ర ఉండడం వలనే ఏ పార్టీ కూడా తమతో కలిసి ఉద్యమ బాట పట్టడం లేదన్నారు. ఇప్పటికే 107 మంది అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, మరో ఆత్మహత్య జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. సినీ నటుడు మాదల రవి మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది అగ్రిగోల్డ్ సంస్థ వల్ల ఇబ్బంది పడుతున్నారని ఇంతకన్నా పెద్ద సమస్య రాష్ట్ర ప్రభుత్వానికి ఏముందన్నారు. ప్రభుత్వ పెద్దలు కారు చౌకగా అగ్రిగోల్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని చూస్తే ఉద్యమం తప్పదన్నారు. రూ.1200 కోట్లతో రూ.20వేల లోపు ఉన్న డిపాజిట్‌దారులకు సొమ్ము చెల్లిస్తే 15 లక్షల మంది బాధితలు ఒడ్డున పడతారన్నారు. బాధితుల సంఘం గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 లోపు ప్రభుత్వం స్పందించకపోతే అన్ని కార్మిక, విద్యార్థి సంఘాలతో భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మార్చి 6న విజయవాడలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, బాధిత సంఘ నాయకులు విశ్వనాథరెడ్డి, తిరుపతిరావు పాల్గొన్నారు.

**సమావేశంలో పూల వర్షాలా....?**

**● బాధితుల విస్మయం**

సమావేశానికి హాజరైన నాయకులకు పూల వర్షంతో స్వాగతం పలకడం, వేదికపైకి వస్తున్నపుడు బాణసంచాకాల్చడం అందరినీ విస్మయానికి గురి చేసింది. బాధితుల పేరు చెప్పి అభినందన సభల్లాంటి కార్యక్రమాలు సబబా అని.. పలువురు ప్రశ్నించారు.

# త్రిపురాపురంలో క్వార్ట్జ్ రాళ్లు స్వాధీనం

**నకరికల్లు:** అక్రమంగా నిల్వ ఉంచిన క్వార్ట్జ్ రాళ్లను మంగళవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొందరు వ్యాపారులు రాళ్లను కొనుగోలు చేసేందుకు త్రిపురాపురానికి వచ్చి శాంపిల్ చూసి వెళ్లారని అధికారులకు సమాచారం అందింది. దీంతో మండలంలోని త్రిపు రాపురంలో మంగళవారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు గడిబోయిన కొండలు ఇంట్లోని రాళ్లను బయటకు తీయించి పరిశీలించారు. నడికుడి -శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనులకు కొండల మట్టిని వాడుతున్న నేపథ్యంలో ఆ మట్టితోపాటు వచ్చిన రాళ్లలో కొన్ని విలువైనవిగా భావించి కొందరు వేరు వేరు ఆకృతుల్లో ఉన్న రాళ్లను దాచిపెట్టారు. ఆ క్రమంలోనే కొండలు ఈ రాళ్లను దాచిపెట్టినట్లు భావిస్తున్నారు. ఒక రాయిని మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ షరీఫ్ పగులగొట్టి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కూడా ఈ రాళ్లు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న రాళ్లు మూడు క్వింటాళ్ల బరువుంటాయని అంచనా వేశారు. గాజు, గ్లాసు ఉత్పత్తుల్లో ఈ రాళ్లను వినియోగించే అవకాశం ఉందని షరీఫ్ తెలిపారు. ఈ రాళ్లు కొండమట్టి నుంచి వచ్చినవా.. లేక ఇతర ప్రాంతాల నుంచి తెచ్చారా.. అనే విషయాన్ని పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ రాళ్లను ప్రయోగశాలకు పంపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు షరీఫ్ తెలిపారు.



రాళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవకుమారి, షరీఫ్



స్వాధీనం చేసుకున్న రాళ్లు

**ఖరీదైనవి కావు : జగన్నాథరావు**

త్రిపురాపురంలో లభ్యమయిన రాళ్లు అంత ఖరీదైనవి కావని దాచేపల్లి మైనింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బీ జగన్నాథరావు తెలిపారు. ఈ రాళ్లలో ఖనిజాలకుండాల్సిన లక్షణాలున్నాయని, ఉష్ణోగ్రతల వలన అలా ఉంటాయని అన్నారు. వేల రూపాయలలోపే వీటి విలువ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



- న్యూ ఢిల్లీలో రాష్ట్రపతిచే అర్జున అవార్డు అందుకున్న జ్యోతి సురేఖ
- ఆనందోత్సాహాల్లో కుటుంబ సభ్యులు, అభిమానులు
- నేడు విజయవాడలో ఘన స్వాగతం

# విలువైన ఘనత

**విజయవాడ/చెరుకుపల్లి:** రాజధాని అమరావతి ఆర్చరీ జెండా ఢిల్లీలో రెపరెపలాడింది. అర్జున అవార్డును అందుకుని క్రీడా మణిరత్నంగా మెరిసింది. వెన్నం జ్యోతి సురేఖ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అర్జున అవార్డును అందుకుంది. క్రీడా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఎంపికయిన క్రీడాకారులకు పలు అవార్డులను అందజేశారు. అందులో భాగంగా ఆర్చరీ తరఫున ఎంపికయిన జ్యోతి సురేఖకు అవార్డును అందజేశారు. పిన్న వయసులోనే ఉన్నత స్థానానికి చేరిన జ్యోతి సురేఖ, ఆమె తల్లిదండ్రులు 'ఆంధ్రజ్యోతి'తో తన అనుభూతులను పంచుకున్నారు. తమ కుమార్తె ఈ స్థాయికి చేరుకునేందుకు సమయంతో పోటీపడుతూ కృషి చేసిందని, కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని జ్యోతి సురేఖ తల్లిదండ్రులు వెన్నం సురేంద్రకుమార్, శ్రీదుర్గా ఆనందం వ్యక్తం చేశారు. తన క్రీడా తపన గురించి మొదట్నుంచి తమకు తెలుసునని రాబోయే రోజుల్లో తను వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మెడల్ సాధించడంతోపాటు ర్యాంకింగ్‌లో కూడా అత్యుత్తమ స్థానాన్ని చేరాలని కోరుకుంటున్నామన్నారు. క్రీడలతో పాటు చదువులోనూ తను ఎంతో పట్టుదలగా ఉంటుందని చెప్పారు.

### అంచెలంచలుగా ఎదిగి..

జ్యోతి సురేఖ ఆర్చరీలో గ్రామీణ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన వెన్నం సురేంద్రకుమార్, శ్రీదుర్గ దంపతులకు జూలై 3, 1996లో సురేఖ జన్మించారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు విజయవాడ నలంద విద్యాసంస్థలో విద్య పూర్తి చేశారు. కేఎల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి అదే యూనివర్సిటీలో ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నారు. సురేఖ నాలుగు సంవత్సరాల పది మాసాల వయస్సులో కృష్ణానదిని మూడుసార్లు ఈది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో ఎక్కారు. స్విమింగ్‌లో సుమారు 40కు పైగా పతకాలు సాధించారు. స్విమింగ్ కోచ్‌లు అందుబాటులో లేకపోవడం, ఆర్థికపరమైన ఇబ్బందులు కారణంగా ఆమె ఆర్చరీపై దృష్టిసారించి అంచెలంచెలుగా ఎదిగి 2011లో ఇరానీలో జరిగిన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్ షిప్‌లో బ్రాంజ్‌మెడల్ సాధించింది. 2013 చైనాలో జరిగిన ప్రపంచ యూత్ ఛాంపియన్ షిప్‌లో జ్యోతి సురేఖ బంగారు పతకాన్ని సాధించి భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రస్తుతం ఆర్చరీ ఉమెన్స్ కాంఫౌండ్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ, అంతర్జాతీయ స్థాయిలో 12వ స్థానం కైవసం చేసుకుంది. జ్యోతి సురేఖ అర్జున్ అవార్డు అందుకోవడంతో నడింపల్లి గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. అవార్డు అందుకోవడం పట్ల ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నడింపల్లి ఎంపీటీసీ ఉప్పల శ్వేత, తహసీల్దార్ శేషకుమార్, ఎంపీడీవో సుభాని హర్షం వ్యక్తం చేశారు.

### నేడు విజయవాడలో స్వాగత సత్కారం

**తాడేపల్లి :** అంతర్జాతీయ విలు విద్య క్రీడాకారిణి, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థిని, అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతిసురేఖకు బుధవారం విజయవాడలో స్వాగత సత్కారాలు అందించనున్నట్లు కేఎల్‌యూ క్రీడా విభాగం అసోసియేట్ డీన్ కాకర్ల హరికిషోర్ తెలిపారు. బుధవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటుందని, అక్కడి నుంచి భారీ ప్రదర్శనతో కేఎల్ యూనివర్సిటీకి విచ్చేస్తుందని వెల్లడించారు. కేఎల్‌యూ తరఫున విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ హబీబుల్లాఖాన్, క్రీడా విభాగం అధికారులు, విద్యార్థులు ఆహ్వానం పలికేందుకు గన్నవరం వెళుతున్నట్లు హరికిషోర్ చెప్పారు.



అర్జున అవార్డుతో సురేఖ

### అవకాశాలను సృష్టించుకోవాలి

అవకాశాల కోసం ఎదురు చూడటం కాదు, జీవితాన్ని నలుగురికి స్ఫూర్తిగా మలుచుకునేలా అవకాశాలను సృష్టించుకోవాలి. రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకుంటానని ఏనాడు అనుకోలేదు. కానీ దేశం గర్వించేలా నిలబడాలని మాత్రం నిత్యం అనుకునేదాన్ని. భవిష్యత్తులో సీనియర్ చాంపియన్ షిప్‌లో ఎంపికయి, పతకం సాధించే దిశగా అడుగులు వేస్తున్నాను. ప్రస్తుతం నామీద కొంత ఒత్తిడి పెరిగింది. కానీ దాన్ని బాధ్యతగా భావిస్తూ లక్ష్యాన్ని చేరుకుంటాను.

**- జ్యోతి సురేఖ,**
**అర్జున అవార్డు గ్రహీత**

# నంద్యాలను అభివృద్ధి చేస్తా..

### భూమా బ్రహ్మనందరెడ్డి

**తాడేపల్లి:** దాదాపు 13 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని నంద్యాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమా బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం రాత్రి ఉండవల్లి సీఎం నివాస గృహం వద్దకు వెళ్లి సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం తిరిగి వెళుతూ ఉండవల్లి కరకట్ట వద్ద మంత్రులతో కలిసి కొద్దిసేపు ఆయన విలేకర్లతో మాట్లాడారు. భూమా మాట్లాడుతూ హామీ ప్రకారం నంద్యాలను ప్రగతిపథంలో నడిపిస్తానన్నారు. బాబాయ్ మీద ప్రేమతో ప్రజలు ఓటుతో చూపించిన అభిమానం జీవితంలో మర్చిపోలేనని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏ నేత మాట్లాడని విధంగా జగన్ రాక్షసుడిలాగా మాట్లాడాడని, ఎన్నికల కమిషన్‌కు ఆవేదనలో మాట్లాడాను అని చెప్పిన తరువాత కూడా జగన్ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. నంద్యాలను పులివెందుల లాగా జగన్ చేస్తానంటే సీఎం చంద్రబాబు పులివెందులను కూడా నంద్యాలలాగా మారుస్తామని చెప్పారన్నారు. నంద్యాల ప్రజలు జగన్ మాటలకు బుద్ధి చెబుతూ చంద్రబాబు మూడళ్ల పాలనకు నంద్యాల ప్రజలు కానుక అందించారన్నారు. మంత్రి అఖిలప్రియ మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నిక ద్వారా మా నాన్నను బతికించుకున్నానని అఖిలప్రియ చెప్పారు. పార్టీలో ఒక వ్యక్తి చనిపోతే అధిష్టానం ఎలా కష్టపడుతుందో టీడీపీలో నాయకులు, కార్యకర్తలు చూపించారన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి మేమందరం ప్రజల వద్దకు వెళ్లబోతున్నామని భూమా చెప్పారు. నంద్యాల ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి హామీలను నెరవేర్చాలని సీఎం ఆదేశించారని అఖిలప్రియ చెప్పారు. శిల్ప బ్రదర్స్ ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాల్ చేశారని, నైతికంగా ఆ సవాల్‌ను శిల్ప బ్రదర్స్ నిలబెట్టుకోవాలని అఖిలప్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, టీడీపీ మంగళగిరి ఇన్‌చార్జి గంజి చిరంజీవి, వేములపల్లి మంజుషా, హరిబాబు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి, అఖిలప్రియ

# విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి

### డీజీపీ నండూరి సాంబశివరావు



డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు

**గుంటూరు :** రాష్ట్రంలో విశ్రాంత పోలీస్ అదికారుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని డీజీపీ నండూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు గుంటూరులో జరిగిన విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ నండూరి సాంబశివరావును కలిసి విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అతి తక్కువ సమయంలో అధునాతన వసతులతో పోలీస్ హెడ్ క్వార్టర్స్ నిర్మించడంపై డీజీపీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ ఆయా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు.

తొలుత చుట్టుగుంట సెంటర్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్య సేవ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఐపీఎస్ అధికారి డాక్టర్ సీఆర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కాళహస్తి సత్యనారాయణ సమర్థంగా పనిచేస్తున్నారన్నారు. ఆయనకు సహకరిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కార్యవర్గ సభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో విశ్రాంత ఉద్యోగులు మరింత సంఘటితమై సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కాగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈవో రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్రాంత ఉద్యోగులందరికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రాష్ట్రంలోనూ, హైదరాబాద్‌లోనూ, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విశ్రాంత పోలీస్ అధికారుల రాష్ట్ర అధ్యక్షుడు, ఐపీఎస్ అధికారి డాక్టర్ పీఆర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఉపాధ్యక్షులు కె.లక్ష్మణ మోహన్, ఎం.రంగప్రసాదరావు, సంయుక్త కార్యదర్శులు డీవీఎస్‌వీస్మూర్తి, ఎస్.శేషగిరిరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం రవి, కోశాధికారి యు మాణిక్యాలరావు, అన్ని జిల్లాల నుంచి సంఘ నాయకులు, సభ్యులు హాజరయ్యారు.

# పైసా.. వసూల్!

- లబ్ధిదారుల నుంచి ఉద్యాన శాఖ డీడీ జయచంద్రారెడ్డి లంచం డిమాండ్
- డబ్బు ఇవ్వాల్సిందేనంటూ ఫోన్‌లో హుకుం!
- వాయిస్ రికార్డు చేసి ఉన్నతాధికారులకు వినిపించిన రైతులు
- కమిషనర్‌తో పాటు విజిలెన్స్ దర్యాప్తు
- సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు

**ఆంధ్రజ్యోతి, గుంటూరు:**
జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ చిరంజీవి చౌదరి ఆదేశాలిచ్చారు. జిల్లాలో ఉద్యాన పంటలు, కూరగాయల సాగును పెంచడం కోసం ప్రభుత్వం గుంటూరు జిల్లాకు ఉద్యాన శాఖ డీడీ పోస్టును కేటాయించింది. ఈ పోస్టుకు మొదట పి.రవికుమార్ డీడీగా పని చేశారు. ఆయన బదిలీ అయిన తరువాత సుమారు మూడేళ్ల నుంచి జయచంద్రారెడ్డి డీడీగా కొనసాగుతున్నారు. ఉద్యాన శాఖ నుంచి ప్రభుత్వ సబ్సిడీ అందకపోవడంతో లబ్ధిదారులు అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగారు. పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులు నేరుగా చుట్టుగుంట సెంటర్‌లోని ఉద్యానవన శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జయచంద్రారెడ్డి పనితీరుపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో కొన్ని నెలలుగా ఆ శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి అంతర్గత దర్యాప్తు నిర్వహించారు. మరో వైపు విజిలెన్స్ అధికారులు కూడా రంగంలోకి దిగారు.





### సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డు..

ఉద్యానవన శాఖ డీడీ జయచంద్రారెడ్డి లబ్ధిదారులను డబ్బు డిమాండ్ చేస్తూ మాట్లాడిన మాటలను సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేశారు. సెల్ ఫోన్ వాయిస్ రికార్డులను కమిషనర్ చిరంజీవి చౌదరి, దర్యాప్తు అధికారులకు వినిపించారు. ఉద్యానవన శాఖ డీడీ జయచంద్రారెడ్డికి ఇచ్చిన సిమ్ కార్డు నెంబర్ ఫోన్‌లోనే ఈ వాయిస్‌లు రికార్డు అయినట్లు తేలింది. మాచర్ల, వినుకొండ, మంగళగిరి, తాడికొండ, నారాకోడూరు, తెనాలి, తదితర ప్రాంతాల నుంచి ఉద్యానవన శాఖ రైతులు సబ్సిడీ పథకాలు అందడం లేదని, లబ్ధిదారుల ఎంపిక, పథకాల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు లిఖిత పూర్వకంగా తెలిపారు.

### పైసలిస్తేనే సబ్సిడీ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై), జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) వంటి పథకాలలో కూరగాయలు, ఉద్యాన పంటల రైతులకు 40-50 శాతం సబ్సిడీపై వివిధ పథకాలను అమలు చేస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్లు, షేడ్ నెట్, ఫామ్ హౌస్, టార్పాలియన్ పట్టలు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, సుందరీకరణ పథకాలు, ఆధునిక యంత్ర పరికరాలకు సబ్సిడీలు ఇస్తున్నారు. ఈ పథకాల్లో లబ్ధిదారుల ఎంపిక, సబ్సిడీ కేటాయింపు ఇతర అంశాల్లో క్షేత్రస్థాయిలోని ఉద్యానవన శాఖ సిబ్బంది ద్వారా డీడీ జయచంద్రారెడ్డి డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. లబ్ధిదారుల నుంచి ముడుపులు వసూలు చేయడానికి అంగీకరించని ఏడీలను పక్కకు పెట్టి నేరుగా డీడీ జయ చంద్రారెడ్డే అవినీతికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. తాడికొండ, మంగళగిరి, వినుకొండ, మాచర్ల, నారాకోడూరు, తెనాలి, తదితర ప్రాంతాల్లోని ఉద్యానవన రైతులు డీడీ జయ చంద్రారెడ్డిపై నేరుగా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ, పశు సంవర్ధక, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో చేసే పథకాల్లో కూడా తన వాటా ఇవ్వాల్సిందేనంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులతో డీడీ బేరసారాలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి.

### నర్సరీల యజమానులతో లాలూచీ..

జిల్లాలో మిరప, వివిధ కూరగాయల తోటల నర్సరీల యజమానులతో డీడీ జయచంద్రారెడ్డి లాలూచీ పడినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. మిరప, కూరగాయల విత్తనాల్లో నకిలీల వలన నష్టపోయిన రైతులు అనేకసార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేశారు. అనుమతులు లేకుండా కూరగాయలు, మిరప నారు అమ్ముఉన్న నర్సరీల యజమానులతో జయచంద్రారెడ్డి చేతులు కలిపినట్లు కమిషనర్ చిరంజీవిచౌదరి దర్యాప్తులో తేలింది.

### సస్పెండైన మొదటి డీడీ

గుంటూరు ఉద్యానవన శాఖలో డీడీ పోస్టు మంజూరైన తరువాత సస్పెండైన మొదటి అధికారి జయచంద్రారెడ్డి. ఆయన గతంలో గుంటూరులో ఏడీగా పనిచేశారు. అప్పట్లో ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఏడీగా ఉన్న సమయంలోనే గుంటూరులో సస్పెండ్ అయ్యారు. డీడీ జయ చంద్రారెడ్డిని సస్పెండ్ చేయడంతో ఇన్‌చార్జి డీడీగా ఏపీఎంఐపీ పీడీ పద్మావతిని నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి మంగళవారం ఆదేశాలు ఇచ్చారు.

## ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

### సీనియర్ విభాగంలో సత్తా చాటిన కృష్ణా జిల్లా ఎడ్లు

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడులోని కాకాని వెంకట్రామయ్య క్రీడా ప్రాంగణంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు మంగళవారం ముగిశాయి. నాలుగు రోజులు జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి ఎడ్ల జతలు పాల్గొన్నాయి. చివరి రోజున సీనియర్ విభాగంలో రసవత్తరంగా సాగిన ఈ పోటీలలో కృష్ణా జిల్లా ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతల వివరాలను కమిటీ సభ్యులు ప్రకటించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధులకు చెందిన ఎడ్లు 2711.4 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన మర్రి సుందరరామిరెడ్డి ఎడ్లు 2700 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో, కృష్ణా జిల్లా పెనమలూరు మడలం, యనమదలకుదురు గ్రామానికి చెందిన అంతనేని శ్రీకావ్య, శ్రీమధు ల ఎడ్లు 2,416 అడుగులు లాగి తృతీయ స్థానాన్ని, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన గొర్రెపాటి నవనీత్ కృష్ణ చౌదరి గిత్తలు 2,403.7 అడుగులు లాగి నాల్గవ స్థానాన్ని, గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన శామనపూడి శివారెడ్డి ఎడ్లు 2,400 అడుగులు లాగి ఐదవ స్థానాన్ని, కృష్ణా జిల్లా మోపిదేవి మండలం బొబ్బర్లంక గ్రామానికి చెందిన కోనేరు నిరూప్‌బాబు ఎడ్ల జత 2,270 అడుగులు లాగి ఆరవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే రావెల కిషోర్ బాబు బహుమతులు అందజేశారు.

### ● ప్రతిభకు పురస్కారం



తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం గుంటూరుకు చెందిన రచయిత సింగారావు, వినుకొండకు చెందిన సహజకవి దుబ్బల దాసుకు పురస్కారం అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

## యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై పరిశోధన

- ప్రభుత్వాస్పత్రిలో నెదర్లాండ్స్ ఉన్నత స్థాయి బృందం పర్యటన

**గుంటూరు (మెడికల్):** యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై పరిశోధన చేపట్టేందుకు న్యూఢిల్లీకి చెందిన నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) ప్రతినిధుతో కలసి నెదర్లాండ్స్ ఉన్నతాధికారుల బృందం మంగళవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించింది.ప్రభుత్వాస్పత్రిలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ఏ స్థాయిలో ఉందో అంచనా వేసేందుకు నెదర్లాండ్స్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి రోసా మరియా పెర్సన్‌సాల, ఆర్థిక శాఖ ప్రతినిధి జొహన్నెస్ క్రిస్పినాన్ వాండెన్, ఎరాస్పస్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన జులిటీ సెవిరన్‌లతో పాటు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లతాకపూర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంకుర్ గార్గ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ గీతా ప్రసాదిని, ఏపీ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ వినయ్ కుమార్ తదితరులు జీజీహెచ్‌ను సందర్శించారు. ఈ బృందం బుధవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రి, సిద్దార్థ వైద్య కళాశాలను సందర్శిస్తారు. గుంటూరుకు వచ్చిన డచ్, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు రెండు బృందాలుగా విడివడ్డారు. ఒక బృందం జీజీహెచ్/జీఎంసీలో పర్యటించగా, మరో బృందం జిల్లాలోని పశు సంవర్ధక శాఖను సందర్శించింది. నెదర్లాండ్స్ ప్రతినిధులను సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ రాజునాయుడు సాదరంగా ఆహ్వానించారు.



జీజీహెచ్‌లో పర్యటిస్తున్న డచ్, కేంద్ర బృందాల సభ్యులు

### వైద్యులతో సమీక్ష

సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వీరు సమావేశమయ్యారు. జీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం పర్నీకుమార్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు మార్కాండేయులు, వరప్రసాద్, యశోధర తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. నిర్దేశిత సమయంలో ఆయా వార్డుల్లో స్వ్యాబ్స్ నమూనాలను సేకరించి మైక్రోబయాలజీ విభాగంలో పరీక్షలకు పంపుతున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. యాంటీ బయోగ్రామ్ నిర్వహిస్తున్నారా? అని ప్రశ్నించారు. మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రశాంతి, పలు వివరాలను అందించారు. అనంతరం ఈ బృందం పలు వార్డుల్లో అక్కడ రోగులను పరిశీలించారు. ఐసీయూ వార్డులను కూడా సందర్శించారు. అనంతరం వైద్య కళాశాలకు వెళ్లి మైక్రోబయాలజీ విభాగం పరిశీలించారు. ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ వైద్యులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. చివరగా తమ పర్యటనపై బృందం సభ్యులు మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్‌లో పలు వార్డుల చికిత్సలు పొందే రోగుల ఉంచి నుంచి తమ బృందం రక్త నమూనాలుసేకరించి పరీక్షించి యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ ఏ స్థాయిలో ఉందో నిర్ధారిస్తామని తెలిపారు. యాంటీ బయోటిక్ మందుల వినియోగంపై కఠిన చర్యలు సారించకపోతే సమీప భవిష్యత్తులో ప్రస్తుతం ఉన్న మందులు కూడా పనిచేయని దుస్థితి నెలకొంటుందని వారు తెలిపారు.

# మేముసైతం..

● ఉపపోరులో జిల్లా నేతల కీలకపాత్ర

● నంద్యాలలో ఫలించిన నేతల ప్రణాళికలు

● సీఎం చంద్రబాబు నుంచి మెచ్చుకోలు

(ఆంధ్రజ్యోతి - గుంటూరు )

నంద్యాల ఉప పోరు విజయంలో జిల్లాకు చెందిన నేతలు కీలకపాత్ర వహించారు. నోటిఫికేషన్ నుంచి నంద్యాలలో అడుగుపెట్టిన జిల్లా నాయకులు ప్రణాళికాబద్ధంగా ప్రచారం నిర్వహించి భారీ మెజార్టీలో భాగస్వాములైయ్యారు. ఈ క్రమంలో ఎన్నికల్లో విజయానికి సోపానాలుగా నిలిచామనే ఆనందంతో జిల్లాకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నేతలు తబ్బిబ్బు అవుతున్నారు. పార్టీ అధినేత ఆదేశా నుసారం నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే జిల్లాకు చెందిన కొందరు సీనియర్ నేతలు నంద్యాలలో మకాం వేసి మంత్రి అఖిలప్రియ, నంద్యాల అభ్యర్థి బ్రహ్మానం దరెడ్డిలకు అండగా నిలిచారు. తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ 30 రోజులకు పైగా అక్కడే ఉండి వైసీపీకి కొంత పట్టు ఉన్న గోస్పాడు మండలం తిష్ట వేశారు. ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ మండలంలో వైసీపీకి ఎంతో కొంత మెజారిటీ ఖాయమని అందరూ ఊహించారు. అయితే అందుకు భిన్నంగా టీడీపీకే ఈ మండలంలో 1800కు పైగా మెజారిటీ రావటం నేతల కృషికి దర్పణం పడుతున్నది. రాజా, మంత్రి ఆనందబాబులతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చందు సాంబశివరావు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ హిదాయత్, వికలాం గుల కార్పొరేషన్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వర రావులు నంద్యాల ఎన్నికల ప్రచారంలో భాగస్వా మ్యం వహించారు. సాంబశివరావు నంద్యాలలో ప్రచారం నిర్వహించారు. హిదాయత్ నంద్యాల పట్టణం, నడిగడ్డ, జిల్లెళ్ల గ్రామాలలో ప్రచారం చేశారు. దళితులు, కాపులు, ముస్లింల ఓటర్లు కూడా తెలుగుదేశం వైపు ఆకర్షితు లయ్యేలా కృషి చేశారు. మంత్రి పుల్లారావు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్‌తో పాటు పలువురు నంద్యాల విజయంలో కీలక పాత్ర వహించారు. పార్టీ సుప్రీం చంద్రబాబునాయుడు నంద్యాల విజయంలో జిల్లా నేతల కృషిని మెచ్చుకున్నారు. అధినేత నుంచి అభినందనలు రావడంతో ఆనందంలో మునిగి తేలుతున్నారు.

# హస్తం.. నిస్తేజం

● నంద్యాల డిపాజిట్ కూడా రాకపోవడంతో కాంగ్రెస్‌లో కలవరం

● రాజకీయ భవిష్యత్తుపై జిల్లా నేతల్లో బెంగ

**గుంటూరు :** ఇటీవల గుంటూరు వేదికగా రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక హోదా భరోసా సభ విజయవంతంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహం నంద్యాల ఎన్నికల ఫలితాలు నీరుగార్చాయి. ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 1300 ఓట్లు పోలవడంతో పార్టీలో మరింత నిస్తేజం అలుముకుంది. కనీసం సంప్రదాయ ఓటింగ్ కూడా పార్టీ అభ్యర్థికి రాకపోవటంతో శ్రేణులను తీవ్ర నిరాశ పరిచింది. ఈ పరిణామాలతో ప్రస్తుతం పార్టీలో తిరుగుతున్న నాయకులకు రాజకీయ భవిష్యత్తుపై బెంగపట్టుకొంది. కాంగ్రెస్ పార్టీని విభజన పాపం వీడటం లేదన్నది నంద్యాల ఉప ఎన్నికల ఫలితాలతో మరోసారి తేటతెల్లమైందని పలువురు అభిప్రాయపడుతున్నారు. విభజన కారణంగా కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో పలువురు సీనియర్ నేతలు ఇతర పార్టీల్లోకి వెళ్ళిపోయారు. అయితే ఉన్న కొద్ది మంది కూడా అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి పార్టీ కార్యక్రమాల్లో కొనసాగుతున్న పరిస్థితులు లేవు. కేంద్ర మంత్రిగా పనిచేసిన పనబాక లక్ష్మీ, కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలంలు అడపాదడపా తప్ప క్రియాశీలకంగా పనిచేయటంలేదన్న విమర్శలు ఉన్నాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడుగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, నగర అధ్యక్షుడుగా, మాజీ కార్పొరేటర్ మాదా ముత్యాలరావులు తదితరులు కేవలం జాతీయ నేతల వర్ధంతులు, జయంతులు నిర్వహించటం తప్ప ప్రజా సమస్యలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై స్పందిస్తున్న పరిస్థితులు లేవనే విమర్శలున్నాయి. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ద్వితీయ శ్రేణి నాయకులే దిక్కయ్యారు. ఉన్న నాయకుల, కార్యకర్తలు వర్గాలు, గ్రూపులుగా విడిపోవటంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది. టీడీపీ, వైసీపీలో చేరితే భవిష్యత్తు ఉంటుందని భావిస్తోన్న కొందరు నాయకులు ఆ దిశగా ఆలోచనల్లో ఉన్నట్లు సమాచారం.

# వైజ్ఞానిక ప్రదర్శనలలో నవోదయ విద్యార్థుల ప్రతిభ

## సైన్స్, సోషల్, గణితం విభాగాలలో జాతీయస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు

**మద్దిరాల(చిలకలూరిపేట టౌన్)** : మండలంలోని మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలలో సత్తా చాటారు. ఈ నెల 26, 27, 28 తేదీలలో విద్యాలయలో నిర్వహించిన నవోదయ విద్యాలయాల హైదరాబాద్ రీజియన్ దక్షిణభారత ప్రాంతీయ స్థాయి ప్రదర్శనలలో వీరి ప్రదర్శనలు జాతీయస్థాయికి ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎన్‌విడి విజయకుమారి విద్యార్థులను అభినందించారు. ప్రదర్శన వివరాలను పరిశీలిస్తే.. 12వ తరగతికి చెందిన బైపీసీ విద్యార్థిని కె మెల్కిషిఫ్రా మానవ శరీరంలో డ్రగ్స్‌ను నిర్వీర్యం చేసేందుకు తీసుకోవలసిన చర్యలు వివరించింది. మానవుని శరీరంలో చేరిన డ్రగ్స్ తదితర మత్తు మందులు బయటకు పంపే విధానాన్ని తెలియజేసింది. ఈ ప్రదర్శనకు సైన్స్ విభాగంలో రీజియన్ స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థి కె నాగవెంకట గోపి రూపొందించిన మేక్ ఇన్ ఇండియా ప్రదర్శనకు సోషల్ విభాగంలో తృతీయస్థానం లభించింది. కొద్దిపాటి స్థలంలో అధిక సంఖ్యలో వస్తువులను క్రమంలో కూర్చే విధానాన్ని తెలుపుతూ 11వ తరగతికి చెందిన వై బాలవెంకటేష్ ప్రదర్శన ప్రాంతీయస్థాయిలో గణితశాస్త్రంలో ద్వితీయ బహుమతి లభించింది. గణితశాస్త్రం ప్రకారం ఏ పద్ధతిలో స్పేస్ మేనేజ్ చేయవచ్చో ప్రయోగాత్మకంగా ప్రదర్శన వివరించారు.



డిజిటల్ ఇండియా మార్పులను వివరిస్తున్న విద్యార్థి కె నాగ వెంకటగోపి

- ఈ- మార్కెట్‌పై పెరుగుతున్న మోజు
- అపోహలకు ఫుల్‌స్టాప్..
- వినియోగదారుల చెంతకే కొత్త ఉత్పత్తుల కబుర్లు
- నాణ్యత నచ్చాకే నగదు చెల్లింపు
- డిస్కౌంట్లతో ఆకట్టుకుంటున్న ఆన్‌లైన్ షాపింగ్

ధర తక్కువ... డిస్కౌంట్ ఎక్కువ... వైవిధ్యం... ఇవన్నీ ఆన్‌లైన్ షాపింగ్‌ను రెట్టింపు చేస్తున్నాయి. 'ఆన్‌లైన్ మార్కెట్‌తో సమయం వృథా... ముట్టుకోనిదే నాణ్యత ఎలా తెలుస్తుంది.. ఐనా నాలుగు దుకాణాలు తిరగకపోతే థ్రిల్లేముంది'... ఇదీ ఒకప్పుడు సగటు నగరవాసికి ఆన్‌లైన్ మార్కెట్‌పై ఉన్న అభిప్రాయం. కానీ ఇప్పుడు పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఒకవైపు పెరిగిన ఇంటర్నెట్ వినియోగం... మరోవైపు ఆన్‌లైన్ మార్కెట్‌లో డిస్కౌంట్లు... వస్తువు వచ్చాక, నాణ్యత నచ్చాకే నగదు చెల్లింపు.... ఒకటా రెండా ఇలా బోలెడన్ని ఆఫర్లను ఇవ్వడంతో ఆన్‌లైన్ షాపింగ్‌పై నగరవాసుల్లో రోజురోజుకీ ఆసక్తి పెరుగుతుంది. మనకు కావాల్సిన వస్తువుపై ఒక్క క్లిక్ చేస్తే చాలు నేరుగా ఇంటికే వచ్చేస్తున్నాయి. పప్పు, ఉప్పు, పళ్లు, కూరగాయలు, కాస్మెటిక్స్, సెల్‌ఫోన్లు, ఖరీదైన నగలు... ఇలా ఒకటనేమిటి అన్నీ ఆన్‌లైన్ దొరుకుతున్నాయి. దీంతో ఆన్‌లైన్ షాపింగ్ ఓ పెద్ద మార్కెట్‌గా అవతరిస్తోంది.

# ఈ-జీ షాపింగ్

Online Shopping


## ఆన్‌లైన్‌పై ఓ కన్నేస్తున్నారు

నిన్న మొన్నటి వరకూ మందకొడిగా సాగిన ఆన్‌లైన్ షాపింగ్ మెల్లమెల్లగా ఊపందుకోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ఇంటర్నెట్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. నగరంలో సుమారు లక్షన్నర ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయి. మధ్యతరగతి ఇళ్లలోనూ కంప్యూటర్ ఓ అవసరంగా మారింది. ఉద్యోగులు, విద్యార్థుల సంగతి సరేసరి. వారానికి ఏడు గంటలు బ్రౌజింగ్‌కు, పది గంటలు సోషల్ నెట్‌వర్కింగ్‌కు, ఆరు గంటలు ఇ మెయిళ్ల కోసం కేటాయిస్తున్నారనేది మార్కెట్ వర్గాల అంచనా. వీరంతా ఏదో ఒక సమయంలో ఆన్‌లైన్ షాపింగ్‌పై ఓ కన్నేస్తున్నారు.




**ఆకర్షిస్తున్న ఇ-కామర్స్ సంస్థల తాయిలాలు**

కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు అనేక ఆఫర్లు ఇచ్చేస్తున్నాయి ఇ- కామర్స్ సంస్థలు. హాట్ డీల్స్, బంపర్ ఆఫర్లు, ఇ- కూపన్లతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో ఆకట్టుకుంటున్నాయి. వీటికి తోడు నిత్యం డిస్కౌంట్ల సందడి. వస్తువు కొనాలని ఉన్నా... ఒకేసారి అంత డబ్బు కట్టలేని వారి కోసం వాయిదాల పద్ధతి ఉండనే ఉంది. కొన్ని సంస్థలైతే పార్సిల్ అందుకున్నాక సరుకును పరీక్షించి చూసుకున్నాక సంతృప్తి చెందితేనే డబ్బు చెల్లించడంటూ 'ట్రై అండ్ బై' అనే బేరం పెడుతున్నాయి. ఇన్ని నజరానాలు ఆఫ్‌లైన్‌లో అసలు ఉండవు. సగటు నగరజీవి ఇక్కడే ఈ షాపింగ్ వైపు మొగ్గు చూపిస్తున్నాడనేది మార్కెట్ విశ్లేషకుల మాట. బహిరంగ మార్కెట్‌లో ఏ వస్తువు ఎంత రేటో తెలుసుకోవాలంటే ఏ బీసెంట్ రోడ్డుకో, వన్‌టౌన్‌కో వెళ్లాలి. ఈ షాపింగ్‌లో అలాంటి బాధలేదు. పోల్చి చూసుకోండంటూ ఓ పట్టిక ఇచ్చేస్తారు. ఆన్‌లైన్ పరిశ్రమ అనుభవాల నుంచి పాఠాలు నేర్చు కుంటూ వినియోగదా రులతో ఫేస్‌బుక్, ట్విట్టర్ల ద్వారా ప్రతినిత్యం టచ్‌లో ఉంటోంది. కొత్త ఉత్పత్తుల కబుర్లు నేరుగా చేరవేస్తోంది. రకరకాల వీడి యోలు, యాప్స్, ఫ్యాషన్ సమాచారం అందించడం ద్వారా ఆ అభిమానుల్ని తన ఖాతాదారులుగా మార్చుకుంటున్నాయి ఇ- కామర్స్ సంస్థలు. క్రాస్‌వర్డ్, ల్యాండ్‌మార్క్ వంటి ఆఫ్‌లైన్ రిటైల్ దుకాణాలు సైతం ఆన్‌లైన్ లోనికి వచ్చేస్తున్నాయి. శాంసంగ్, రీబాక్ తదితర ప్ర ఖ్యాత బ్రాండ్‌లు అవే సొంతంగా ఆన్‌లైన్ విక్రయాలు నిర్వహిస్తు న్నాయి. ప్రస్తుతం ఈ కామర్స్ సంస్థలు సొంతంగా గిడ్డంగులు ఏర్పాటు చేసుకునే స్థాయికి ఎదిగాయి. ఫ్లిప్‌కార్ట్, ఈబే, స్నాప్‌డీల్, అమెజాన్, ఫ్యాషన్ అండ్‌యూ, బిగ్ బాస్కెట్, జబాంగ్... ఇలా ఇ- కామర్స్‌లో తమదైన స్థానాన్ని సంపాదించుకున్న సంస్థలు చాలానే ఉన్నాయి.



**బ్రాండెడ్‌పై మోజు**

ఆన్‌లైన్ విక్రయాల్లో ముప్పై శాతం సెల్‌ఫోన్ల ద్వారానే జరుగుతోంది. లేటెస్ట్ ఫ్యాషన్స్ నగర వాసుల్ని ఊపేస్తున్నాయి. చుట్టుపక్కల పల్లెల్లోనూ బ్రాండ్ స్పృహ పెరిగింది. బ్రాండెడ్ సరుకులు అవసరమైన వారు ఆన్‌లైన్‌షాపింగ్‌నే ఆశ్రయిస్తున్నారు. బ్యాంకింగ్ సంస్కరణలు సైతం ఇ- కామర్స్‌కు వరంగా మారాయి. ప్రతి కుటుంబానికి ఆ మాటకు వస్తే ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉంటోంది. ఉద్యోగులకు బ్యాంకులు ఉదారంగా క్రెడిట్ కార్డులు మంజూరు చేసేస్తున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపులు తేలికవుతున్నాయి. 25 నుంచి 35 ఏళ్ల వయసు మధ్యలోని వారు తాము సంపాదించిన దాంట్లో 60 శాతం షాపింగ్‌కే ఖర్చు పెట్టేస్తున్నారు అందులోనూ అధికభాగం ఆన్‌లైన్ కొనుగోళ్లకే మొగ్గు చూపిస్తున్నారు.

### పాత వస్తువుల అమ్మకాలు, కొనుగోలు

ఆఫ్‌లైన్‌లో పాత సామాన్లను వదిలించుకోవడానికి వ్యవస్థీకృతమైన మార్కెట్ లేదు. ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకుంది ఆన్‌లైన్ మార్కెట్. సెకండ్స్ కొనేవారికి, అమ్మేవారికి ఆన్‌లైన్‌లో బోలెడు వేదికలు ఉన్నాయి. ఓఎల్‌ఎక్స్ ఆన్‌లైన్ క్లాసిఫైడ్ అలాంటిదే. ఇదే కోవలో బుక్‌అడ్డా.కామ్, అకడ్‌జోన్.కామ్ ద్వారా విద్యార్థులు పాతపుస్తకాలు అమ్ముకోవచ్చు. అవసరమైనవి తక్కువ ధరలో కొనుక్కోవచ్చు. ఏ రోజు కొంటే అదే రోజు డెలివరి అనే సూత్రాన్ని పాటిస్తున్నాయి ఈ కామర్స్ వేదికలు.



### సగటు జీవికి ఊరట

నిత్యం ట్రాఫిక్ కష్టాలు దాటుకుంటూ, కాలుష్యాన్ని పీల్చేసుకుంటూ వృత్తి జీవితంలో గడిపే నగరవాసులు ఆన్‌లైన్ షాపింగ్‌పై మక్కువ చూపిస్తున్నారు. పార్కింగ్ నుంచి బిల్లింగ్ వరకూ ఎక్కడికెళ్లినా రద్దీ రద్దీ. దీంతో హాయిగా ఇంట్లో సేదతీరుతూ అవసరమైనవన్నీ కొనే సదుపాయాన్ని కల్పిస్తున్న ఈ- కామర్స్ సైట్లను ఆశ్రయిస్తున్నారు. షాపింగ్ మాల్స్, రిటైల్ అవుట్‌లెట్లు అద్దాల అలంకరణతో మిరుమిట్లు గొలిపే లైట్లతో రారమ్మంటూ ఆకర్షిస్తున్నా ఏ మాత్రం ఆవేశపడకుండా క్లిక్కులతోనే షాపింగ్ కానిచ్చేస్తున్నారు నగరజీవులు.



ఆంధ్రజ్యోతి, విజయవాడ ఫీచర్స్

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎంత డిస్కౌంట్ ఇచ్చినా ఎన్ని ఆఫర్లున్నా పరిచయం లేని సైట్లలోకి వెళ్లకపోవడమే మంచిది.
- ఇంటర్నెట్ సెంటర్లు, అందరూ ఉపయోగించే ఆఫీస్ కంప్యూటర్‌తో ఆన్‌లైన్ షాపింగ్ చేస్తే కోరి కష్టాలు తెచ్చుకున్నట్లే. యూజర్ నేమ్, పాస్‌వర్డ్ ఆటోసేవ్ చేయరాదు.
- వెబ్‌పేజి చిరునామాలో హెచ్‌టీటీపీ. అని కాకుండా హెచ్‌టీటీపీఎస్. అని ఉంటేనే సైట్‌లోకి వెళ్లాలి. ఎస్ అని ఉంటే సురక్షితం అనడానికి సంకేతం. మీ సిస్టమ్‌లో వైరస్ ఉంది. ఈ సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేసుకోండి తరహా ఊరింపులకు లొంగిపోవద్దు. ఐపీ అడ్రస్‌లో డొమైన్ పేరు లేకపోతే మాత్రం ఆ సైట్‌ను అనుమానించాల్సిందే.
- బహుమతులకు ఆశపడి ఆన్‌లైన్‌లో ఇంటిపేరు, ముద్దుపేరు, భార్యపేరు, సొంతూరు వంటి ప్రశ్నలకు జవాబులు ఇవ్వకూడదు. వాటన్నిటినీ క్రోడీకరించి పాస్‌వర్డ్ ఊహించే ప్రమాదం ఉంది.
- కంప్యూటర్ కీబోర్డు కంటే వర్చువల్ కీబోర్డు మీద పాస్‌వర్డ్ టైప్ చేయడమే మంచిది. అన్నింటికీ ఒకే పాస్‌వర్డ్ వాడవద్దు. హ్యాకర్లు ఆన్‌లైన్ ఫోరాలు, బ్లాగ్‌ల పాస వర్డ్‌లను సులభంగా పట్టుకోగలిగే అవకాశం ఉంది.
- మనం షాపింగ్ చేసే ఈ పోర్టల్ పేమెంట్ గేట్‌వే సర్టిఫికెట్‌ను పరిశీలించి తీరాలి. వెరిఫైడ్ బై వీసా సెక్యూర్డ్‌బై మాస్టర్‌కార్డ్ అనే పదాలు ఉన్నాయేమో చూడాలి. లేకపోతే జాగ్రత్త వహించాల్సిందే.
- ఏ షోరూమ్‌కో వెళ్లి కొనాలనుకున్నా ధరలు, ఫీచర్ల గురించి తెలుసుకోవడానికి ఫ్లిప్‌కార్ట్ వంటి సైట్లు చూడవచ్చు. ఇదో రకమైన ఈ విండో షాపింగ్.
- పెద్దగా డిమాండ్ లేని రోజుల్లో కస్టమర్లను ఆకర్షించడానికి చాలా సంస్థలు ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తుంటాయి. సోమవారం, గురువారం, శుక్రవారాల్లో ఈ హంగామా అధికం.
- బృందాలుగా కొనుగోలు చేస్తే ప్రత్యేక తగ్గింపులు ఉండవచ్చు. బుక్‌అడ్డా.కామ్‌లో ఈ పద్ధతిలో కొంటే ఐదు శాతం డిస్కౌంట్ లభిస్తాయి.
- పాత సెల్‌ఫోన్లను అమ్మేస్తున్నప్పుడు మూలన పడేస్తున్నప్పుడూ అందులోని డేటా తీసేయాలి. సెల్‌ఫోన్‌కు పాస్‌వర్డ్ ఆప్షన్ ఉంటే మంచిది.
- పాస్‌వర్డ్ ఎంత బలంగా ఉంటే మనం అంత సురక్షితంగా ఉన్నట్లు. భార్య పేరు, పిల్లల పేర్లు, 12345 వంటి పాస్‌వర్డ్‌లు వాడుతున్నారంటే మీరు తీసుకుంటున్న జాగ్రత్తలు ఫెయిల్ అయినట్లే.
- కీబోర్డు వేళ్ల కదలికల్ని ఎవరైనా గమనిస్తున్నారేమో గమనించాలి.



ఒకప్పుడు పార్టీలు తమ నాయకుల పనితీరుపై సర్వేలు చేసుకునేవి. జనం నుంచి వివరాలు రాబట్టేవి. వాటి ప్రకారం పనితీరు నిర్ధారించుకునేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రభుత్వమే తన పనితీరుపై సర్వే చేయించుకుంటోంది. ప్రజల నాడి, బాధలు తెలుసుకుంటోంది. ఇది ఒక విధంగా ప్రజలకు వరమే! క్షేత్రస్థాయిలో జరుగుతున్న తప్పులు మొహమాటం లేకుండా చెబితే ప్రభుత్వం దృష్టికి వెళ్తుంది. లబ్ధిదారులు, సమాజానికి న్యాయం జరుగుతుంది. అయితే కొంతమంది వాస్తవాలు చెప్పడం లేదు. తమ బాధ్యత కాదన్నట్లుగా తప్పించుకుంటున్నారు. వాస్తవాలు చెబితేనే ప్రయోజనం ఉంటుంది. క్షేత్రస్థాయిలో తప్పులు సరిదిద్దడంతో పాటు న్యాయం జరుగుతుంది.

-చిలకలూరిపేట అర్బన్

# సర్వేజనా.. సంక్షేమం



- అభివృద్ధి, సంక్షేమం అమలుపై ప్రభుత్వ సర్వే
- ప్రజలు నిర్భయంగా నిజం చెబితే ప్రయోజనాలు
- తప్పులు సరిదిద్దేందుకు సర్కారుకు వెసులుబాటు
- సెల్‌ఫోన్ ద్వారా విస్తృతంగా వాయిస్ సర్వే


సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ఇవన్నీ బాగానే అమలవుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ.. క్షేత్రస్థాయిలో అవి ప్రజలకు చేరువవుతున్నాయా? లేదా? అనే దానిపై పక్కా సమాచారం మాత్రం నేరుగా ప్రజల నుంచి ప్రభుత్వానికి చేరితేనే ప్రయోజనం ఉంటుంది. అందుకే ప్రభుత్వ విభాగాలు సెల్‌ఫోన్ వాయిస్ మెసేజ్‌ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నాయి. వీటికి ప్రజలు నిర్భయంగా సమాధానం చెబితేనే క్షేత్రస్థాయిలో తప్పులు సరిదిద్దడంతో పాటు లబ్ధిదారులకు న్యాయం జరుగుతుంది.



### 'చెత్త'శుద్ధి అవసరం..

- జిల్లాలోని అన్ని పంచాయతీల్లో చెత్త సంపద ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుసాగుతోంది. ఇప్పటికే ఎంపిక చేసిన పలు పంచాయతీల్లో శిక్షణను ఇచ్చారు.

? జిల్లాలోని ఏర్పాటు చేసిన పంచాయతీల్లో చెత్త సంపద ఉత్పత్తి కేంద్రాలు ఏ దిశగా పయనిస్తున్నాయి, చెత్త సేకరణ, తరలింపు పైనా అప్పుడప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో నిజమేంతో చెప్పండి.



### మీ రహదారి, కాలువలు మెరుగ్గా...

- పల్లెల్లో తాగునీటి సమస్య, రహదారులు, కాలువల పరిస్థితిపై పంచాయతీరాజ్‌శాఖ ప్రజల అభిప్రాయాలు కోరుతోంది. ఉపాధి హామీ కింద సీసీ రహదారులకు 90 శాతం నిధులు కేటాయించి పనులు చేపట్టారు.

? ఆ పనులు ఎలా ఉన్నాయి. మీ ఇంటి పక్కనున్న కాలువ పరిస్థితి నిర్భయంగా తెలియజేయండి.

### దీపం వెలుగులివ్వాలి...

- పొగరహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరికి గ్యాస్ పొయ్యిలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.


? వాస్తవ పరిస్థితి ఇలా ఉంది.. గ్యాస్ పొయ్యిలు అందరికీ అదిందా నిజమేనా.. నిర్భయంగా తెలపండి.



### పింఛన్లు అందుతున్నాయా?

- జిల్లాలో 3.75 లక్షల మందికి ఆగస్టు నెలకు పింఛన్లు మంజురయ్యాయి. ప్రతి నెల 5వ తేదీ నాటికి ఫించన్లు పంపిణీ చేయాలి. ప్రతి నెలా ఇబ్బందులు దృష్ట్యా దీని 10వ తేదీ వరకు పెంచారు. దీనికి తోడు కొత్త పింఛన్లు మంజూరుకు జన్మభూమి కమిటీల సభ్యులు చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పింఛన్లు పంపిణీలోనూ కొంతమంది సిబ్బందిపై ఆరోపణలున్నాయి. మృతులు, వలసదారుల పింఛన్లు పక్కతోవ పడుతున్నట్లు అనుమానాలున్నాయి.

? పింఛన్లు అర్హులకు అందుతున్నాయా.. ఆరోపణలు ఉన్నాయా.. కొత్త పింఛన్లు అవసరమా? సిబ్బంది సరిగా పనిచేస్తున్నారా? నిర్ణీత గడువులోగా సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? జన్మభూమి కమిటీ సభ్యులు సరైన వారినే సిఫార్సు చేశారా? వంటి ప్రశ్నలు అడుగుతున్నారు. మీరు వివరాలు తెలపండి.



### వైద్యసేవలు.. అంతంతేనా?

- జిల్లాలో సర్కారు వైద్యంపై చాలా విమర్శలు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలో జీజీహెచ్‌తోపాటు అన్ని పట్టణాలు, గ్రామాలలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నా వైద్య సేవలపై విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి.

? ఆసుపత్రుల్లో వైద్య నిపుణులు, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? మందుల కొరత వెంటాడుతోందా? ఆధునిక వైద్యం అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితం ఇస్తున్నాయా? 69 శాతం మంది సొంత ఖర్చులతోనే వైద్యం చేయించుకుంటున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ నిర్వహించిన సర్వేలో తేలిన విషయం నిజమేనా? దీనిపై నిర్భయంగా సమాధానం ఇవ్వండి.

### చంద్రన్న బీమా.. పేదలకు ధీమా?

- కేవలం రూ.12 ప్రీమియంతో రూ.5 లక్షల వరకు పరిహారం పొందేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పేదలకు మేలు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఈ పథకం 13 లక్షల మంది చేరారు. ఇంతవరకు 10 వేలమంది మృతి చెందినట్లు గుర్తించి 6వేల మంది వరకు సుమారు రూ.32 కోట్లు క్లెయిమ్‌లు అందించారు.

? నిర్ణీత గడువులోగా బీమా పరిహారం అందుతోందా లేదా? సకాలంలో పరిహారం బీమా సంస్థల చెల్లిస్తోందా? ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? ధైర్యంగా తెలపండి.



### పక్కా ఇళ్లు..బాగున్నాయా...

- జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకాల కింద గత ఏడాది 12,500 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది మరో 12,500 ఇస్తున్నారు.

? ఇవి అర్హులకు అందాయా.. వీటి నిర్మాణాలు, బిల్లులు చెల్లింపులు అయ్యా యా? చెల్లింపులు సరిగా లేవా? ఇంకా నిధులు అవసరమా? మోహమాట పడకుండా నిజాలు తెలపండి.



### రుణం.. భారమా?



- స్వయం ఉపాధి కల్పనకు మార్గం సుగమం చేసేందుకు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయిస్తున్నారు.

? రికవరీలు సరిగా చెల్లిస్తారన్న వారికే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారా... బ్యాంకర్లు అంగీకరించిన లబ్ధిదారులకు జన్మభూమి కమిటీలు ఆమోద ముద్ర వేయకపోవడంతో సమస్యలు తలెత్తాయా.. లక్ష్యం చేరుకోకపోవడానికి కారణమేమిటి? యూనిట్లు గ్రౌండ్ ఎందుకు కాలేదు. అక్రమాలు చోటుచేసుకుంటున్నాయా? అర్హులకు అందుతున్నాయా? సమాచారమివ్వండి.

# తాతయ్య కోసం.. ఓ యాప్




**ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.**



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'


**- కావ్య**

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

## ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



## దారి కనుక్కోండి



## చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

## మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

## చుక్కలు కలపండి



## జవాబులు

**చెప్పగలరా? :** జాతీయం
**జంతర్‌మంతర్ :** 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
**జంబ్లింగ్ వర్డ్స్ :** 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL

## టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

## నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో
**డాక్టర్:** ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?
**రోగి: (పర్సు తడుముకుంటూ):** హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

## సూక్తి

పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

## రంగులు వేయండి



## పదాలు గుర్తించండి

shoe
duck
doll
globe
block
green

| | | | | | |
|---|---|---|---|---|---|
| x | k | c | o | l | b |
| l | n | e | e | r | g |
| l | g | l | o | b | e |
| o | q | n | c | w | c |
| d | n | s | h | o | e |
| u | w | k | c | u | d |

## జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▸ ..................
2. LDOR ▸ ..................
3. ALPM ▸ ..................
4. TLAL ▸ ..................

## జంతర్ మంతర్

1. రాయంజకీ ▸ ..................
2. అన్నతంత్యు ▸ ..................
3. నీతిఅవి ▸ ..................
4. నంవమార్త ▸ ..................

# రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?



కొమ్ము సుందర్‌రాజు
పొలిటీ ఫ్యాకల్టీ

## భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్

2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ

6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ

7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ

8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ

9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా

10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ

11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్

12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు

14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి

15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ

16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి

17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు

18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు

19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్

## జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ

21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు

22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ

23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు

24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ

25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత

26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం

28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా

29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ

30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్ 5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4

31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ

32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ఠ సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది

33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు

34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ

35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్

36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ

37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్

38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ

39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి

40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్

41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి

42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్

43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్

44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17

45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్

46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా

47. జాకీర్ హుస్సేన్ మరణాంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా

48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు

49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర

50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

### సమాధానాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) సి | 8) బి | 15) ఎ | 24) ఎ | 33) సి | 42) బి |
| 2) ఎ | 9) సి | 16) బి | 25) సి | 34) ఎ | 43) సి |
| 3) ఎ | 10) బి | 17) సి | 26) బి | 35) డి | 44) బి |
| 4) డి | 11) ఎ | 18) బి | 27) ఎ | 36) సి | 45) డి |
| 5) ఎ | 12) సి | 19) సి | 28) డి | 37) బి | 46) ఎ |
| 6) సి | 13) సి | 20) డి | 29) డి | 38) ఎ | 47) బి |
| 7) బి | 14) డి | 21) ఎ | 30) ఎ | 39) సి | 48) సి |
| | | 22) సి | 31) సి | 40) డి | 49) ఎ |
| | | 23) ఎ | 32) బి | 41) సి | 50) సి |

## అడ్మిషన్స్

### జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.

**పీజీ కోర్సులు:** ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పిహెచ్‌డి/ ఎమ్మెస్సీ - పిహెచ్‌డి డ్యూయెల్ డిగ్రీ

**టెస్ట్ పేపర్స్ - కోడ్స్:** బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)

**అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

**జామ్ 2018 జరిగే తేదీ:** 2018 ఫిబ్రవరి 11

**ఫలితాల విడుదల:** 2018 మార్చి 20

**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 5

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10

**వెబ్‌సైట్:** www.jam.iitb.ac.in

### ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

**కోర్సు వ్యవధి:** ఏడాది

**అర్హత:** 50 శాతం మార్కులతో బిఎస్సీ/ బిఫార్మసీ/ బిఎస్సీ - అగ్రి/ ఎంబిబిఎస్/ బివిఎస్సీ/బిడిఎస్/ బిహెచ్‌ఎంఎస్/ బిఎఎంఎస్/ బియుఎంఎస్/ బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసిఏ/ పిహెచ్‌డి పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16

**వెబ్‌సైట్:** www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

# 'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

## భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

### మోడల్ - 1
### పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

**టైప్ 1:** నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

**టైప్ 2:** నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

### టైప్ 1

**1.** ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
**వివరణ:** భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

**2.** ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
**వివరణ:** నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

**3.** ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
**వివరణ:** ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

**4.** ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
**వివరణ:** పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

**5.** ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
**వివరణ:** గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

**6.** ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
**వివరణ:** బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

**7.** ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
**వివరణ:** జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

**8.** ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
**వివరణ:** నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

**9.** ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
**వివరణ:** గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

**10.** ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

## Competitive Exams Special

**వివరణ:** ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

**11.** ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
**వివరణ:** తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

**12.** ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
**వివరణ:** కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

**13.** ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
**వివరణ:** లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

**14.** ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
**వివరణ:** గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

**15.** ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
**వివరణ:** వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

**16.** ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
**వివరణ:** థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

**17.** ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
**వివరణ:** ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

**18.** ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
**వివరణ:** ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

**19.** ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: **ఎ**
**వివరణ:** గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

**20.** ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: **డి**
**వివరణ:** డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

**21.** ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: **బి**
**వివరణ:** వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

**22.** ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: **ఎ**
**వివరణ:** నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

**23.** ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: **సి**
**వివరణ:** మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

**24.** ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: **డి**
**వివరణ:** బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

**25.** ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: **ఎ**
**వివరణ:** నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

**26.** ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: **ఎ**
**వివరణ:** కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

**27.** ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: **సి**
**వివరణ:** కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

**28.** ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: **డి**
**వివరణ:** ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

**29.** ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: **సి**
**వివరణ:** అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

**30.** ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: **డి**
**వివరణ:** గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

**31.** ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: **సి**
**వివరణ:** బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

**32.** ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: **డి**
**వివరణ:** ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

**33.** ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: **ఎ**
**వివరణ:** గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

**34.** ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: **బి**
**వివరణ:** బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

**35.** ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: **డి**
**వివరణ:** జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

**36.** ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: **సి**
**వివరణ:** బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

**37.** ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: **బి**
**వివరణ:** ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

**38.** ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: **బి**
**వివరణ:** అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

**39.** ఎ) మెరీనా బి) జెర్సొప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: **ఎ**
**వివరణ:** మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

## JOBS ఉద్యోగాలు

### సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

**మొత్తం ఖాళీలు: 67**

**ప్రాజెక్ట్ మేనేజర్** **ఖాళీలు:** 2
**అర్హత:** బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
**వయసు:** 50 ఏళ్లు మించరాదు

**ప్రాజెక్ట్ ఇంజనీర్** **ఖాళీలు:** 65
**అర్హత:** బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
**వయసు:** 37 ఏళ్లు మించరాదు
**ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
**ఆన్‌లైన్ టెస్ట్:** సెప్టెంబరు 23
**దరఖాస్తు ఫీజు:** రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 18
**చిరునామా:** Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
**వెబ్‌సైట్:** http://cdac.in/

### ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**మొత్తం ఖాళీలు: 66**

**టెక్నికల్ సూపరింటెండెంట్** **ఖాళీలు:** 3
**అర్హత:** డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
**వయసు:** 30 ఏళ్లు మించరాదు.

**వర్క్‌షాప్ సూపరింటెండెంట్** **ఖాళీలు:** 1
**అర్హత:** బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
**వయసు:** 30 ఏళ్లు మించరాదు.

**సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్)** **ఖాళీలు:** 1
**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
**వయసు:** 30 ఏళ్లు మించరాదు.

**మెడికల్ అటెండెంట్** **ఖాళీలు:** 34
**అర్హత:** 10వ తరగతి
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**లేడీ మెడికల్ అటెండెంట్** **ఖాళీలు:** 15
**అర్హత:** 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**కన్జర్వేషన్ అసిస్టెంట్** **ఖాళీలు:** 2
**అర్హత:** 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్** **ఖాళీలు:** 9
**అర్హత:** 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**ఎవల్యూషన్ అసిస్టెంట్** **ఖాళీలు:** 1
**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
**వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 24
**దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ:** అక్టోబరు 4
**వెబ్‌సైట్:** www.sscsr.gov.in

# సాంకేతికతతో గ్రామాల సమగ్రాభివృద్ధి

● యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఆచార్యుడు డార్విన్ ● కేఎల్‌యూలో ప్రారంభమైన ఓపెన్ ఇన్నోవేషన్ ఫోరం

**తాడేపల్లి :** సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామాల సమగ్రాభివృద్ధికి వినియోగించాలని ఓపెన్ ఇన్నోవేషన్ ఫోరమ్ ప్రోగ్రామ్ డైరెక్టర్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కెలే ఆచార్యుడు సాల్మన్ డార్విన్ పిలుపునిచ్చారు. కేఎల్ యూనివర్సిటీలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా కేఎల్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా మూడురోజుల పాటు నిర్వహించనున్న సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డార్విన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన 100 గ్రామాలను ఎంపిక చేసి అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. సహజ వనరులను సద్వినియోగం చేయడంతో పాటు భవిష్యత్తు తరాలకు అభివృద్ధి చెందిన ఆరోగ్యకరమైన స్మార్ట్ విలేజ్‌స్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేఎల్ యూ వీసీ డాక్టర్ ఎల్ఎస్ఎస్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఆచార్యులు టెర్రీ, కేఎల్ యూ అధ్యాపకులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ డార్విన్

### 31న సదస్సుకు సీఎం చంద్రబాబు

సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామీణ ఆర్థికాభివృద్ధే లక్ష్యంతో జరుగుతున్న ఈ సదస్సులో 31వ తేదీ గురువారం సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని సదస్సు కమిటీ ఛైర్మన్ డాక్టర్ కిషోర్‌బాబు వెల్లడించారు. వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, విదేశీ విద్యాలయాలకు చెందిన ఆచార్యులు, ఈ సదస్సులో పాల్గొంటారని కిషోర్‌బాబు చెప్పారు.

# ఘాట్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


నిర్మాణ పనుల వివరాలను ఈఈని అడిగి తెలుసుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు

**విజయవాడ (వన్‌టౌన్) :** దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఘాట్ రోడ్డులో నిర్మాణ పనులను మంగళవారం ఆలయ కమిటీ ధర్మకర్తలు వెలగపూడి శంకరబాబు, పద్మశేఖర్, ధర్మారావు, కె.సూర్యలత, ఆలయ ఈఈ భాస్కరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ రోడ్డులో జరుగుతున్న నిర్మాణ పనుల వివరాలు ఈఈని అడిగి తెలుసుకున్నారు. సుమారు పది రోజుల్లో నిర్మాణ పనులు పూర్తయి, దసరా మహోత్సవాలకు ఘాట్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఈఈ ధర్మకర్తలకు తెలియజేశారు. దసరా మహోత్సవాలకు ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న క్యూల వివరాలను సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కొత్తగా యాగశాల నిర్మాణానికి పూజా కార్యక్రమాలు చేసిన ప్రాంతాన్ని భక్తుల విశ్రాంతి కోసం షెడ్ ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకోవాలని ధర్మకర్తలు ఈఈ భాస్కరరావుకు సూచించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో క్యూలను పరిశీలించారు.

# మిశ్రమ చేపల పెంపకమే లాభదాయకం

● మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బాలకృష్ణ

**తాడేపల్లి:** బొచ్చె, రాగండి, మోసు చేపలను ఒకే చెరువులో పెంచడం వలన మిశ్రమ సాగు జరిగి రైతులకు మంచి లాభాలు చేకూరతాయని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బాలకృష్ణ మత్స్యకారులకు సూచించారు. మూడు రోజులుగా సాగుతున్న మత్స్యకారులకు శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. పోలకంపాడులో జరిగిన ముగింపు తరగతులకు హాజరైన బాలకృష్ణ మాట్లాడుతూ కార్డు లివర్, షార్క్ లివర్ ఆయిల్ నుంచి టాబ్లెట్‌లను తయారు చేస్తారని, అవి కంటి చూపుకు ఉపయోగపడతాయని చెప్పారు. ఏ, బి, ఈ విటమిన్లు ఆహారం ద్వారా లభ్యమవుతాయన్నారు. కేన్ కల్చర్, పెన్ కల్చర్‌పై ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల చేప పిల్లలను పెంపకానికి తెచ్చినప్పుడు అవి ఆరు మిల్లీమీటర్ల సైజులో వుంటాయని, 9 నెలలకు ఒక కేజీ సైజుకు ఈ చేప పిల్లలు పెరుగుతాయని చెప్పారు. చిన్న చేప పిల్లలను పెంచేటప్పుడు వాటికి ఆహారంగా తవుడు చెక్క, వేరుశనగ, వినియోగిస్తారని చెప్పారు. చేపల పరిమాణం పెరిగిన తరువాత నీటిలో వృక్ష ప్లవకాలు తిని అవి జీవిస్తాయన్నారు. భవానీ ఐలాండ్‌లో క్షేత్రస్థాయి శిక్షణ కూడా ఇచ్చారు. టూరిజం శాఖ, మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిక్షణా తరగతులు ద్వారా మత్స్యకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మోహనరావు, జేడీ శివసాయ్రామ్యం, సహాయ సంచాలకులు గాలి దేవుడు, ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు సైకం వెంకట నారాయణ, జిల్లా అధ్యక్షుడు నడికుదిటి శివయ్య, మత్స్యశాఖ అధికారి నరసింహారావు, పలువురు మత్స్యకారులు, మహిళలు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బాలకృష్ణ

# దుర్గ గుడిలో కొన్ని నిర్మాణాలతో ముప్పే

## శృంగేరీ శివగంగ శారదా పీఠాధిపతి పురుషోత్తమ భారతీ స్వామి

**ఆంధ్రజ్యోతి, విజయవాడ:** దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తలపెట్టిన కొన్ని నిర్మాణాలు ముప్పు తెస్తాయని, వాస్తు విరుద్ధంగా, ఆగమ శాస్త్రానికి వ్యతిరేకంగా ఆలయాల్లో ఎలాంటి పనులు చేయకూడదని శృంగేరి శివగంగ శారదా పీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామి చెప్పారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగత సత్కారాలు చేశారు. తిరిగి వెళుతుండగా ట్రస్ట్ బోర్డు సభ్యుడు పద్మశేఖర్ ఆలయంలో, మహా మండపం వద్ద జరుగుతున్న నిర్మాణాల అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఆయన నిర్మాణాలు తలపెట్టిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయం ప్రజలను అన్ని విధాలా కాపాడుతుందని, ఆలయంలో ఎలాంటి శాస్త్ర విరుద్ధ కార్యక్రమాలు చేయకూడదన్నారు. ఆగ్నేయంలో వాటర్‌ఫాల్, ఈశాన్యంలో వంటశాల నిర్మాణాలు పూర్తిగా శాస్త్ర విరుద్ధమన్నారు. భక్తుల వసతుల కోసం నిర్మాణాలు చేయడం మంచిదే కాని, వాటిని పండితులు, ఆగమ శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని నిర్మిస్తే బాగుంటుందని తెలిపారు. ఆలయాల్లో విరుద్ధ నిర్మాణాలు సాగితే మనశ్శాంతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. భారతీ స్వామికి సీనియర్ అర్చకుడు శంకరశాండిల్య, ఇతర అర్చకులు సత్కారాలు చేశారు


స్వామితో మాట్లాడుతున్న ట్రస్ట్ బోర్డు సభ్యుడు పద్మశేఖర్

# మా స్థలాలు మాకు ఇప్పించండి

● నవులూరు గ్రామస్థుల విన్నపం

**ఆంధ్రజ్యోతి, విజయవాడ:** మంగళగిరిలోని నవులూరు గ్రామంలోని 12 ప్లాట్ల స్థల వ్యవహారంపై తమకు న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు ముఖ్యమంత్రిని వేడుకున్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నవులూరు గ్రామానికి 12 ప్లాట్ల యజమానులు విలేకరుల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి 2016, సెప్టెంబరు వరకు పలు పర్యాయాలు తమకు న్యాయం చేయాలని అర్థించామని, సీఎం కూడా సమస్యలపై సుముఖంగా స్పందించారని, అధికారులు మాత్రం సహకరించడంలేదని పేర్కొన్నారు. అప్పట్లో చంద్రబాబు తమకు హామీ ఇస్తూ విజిటీఎంమ్ ఉడా, సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశించినా నేటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. లోక్‌అదాలత్‌లో ఈ విషయం ఇప్పటికే ఎనిమిదిసార్లు వాయిదా పడిందని, ఒక్క వాయిదాకు కూడా అధికారులు హాజరుకాలేదని విమర్శించారు. 60 ఏళ్ల వయసులో కూడా తాము వాయిదాలకు హాజరవుతుండగా, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తామందరం 1979లో ఆ 12 ప్లాట్లను మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టర్ చేయించుకున్నామని, నవులూరు గ్రామపంచాయితీ అదే సంవత్సరం సెప్టెంబర్ 19న ఆ ప్లాట్లకు లేఅవుట్ మంజూ రయిందని ప్లాట్ల యజమానులు తెలియజేశారు. అధికారులకు వివరించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా.. ఆ వ్యవహారం తమ పరిధిలోది కాదని, ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సమాధానమిస్తున్నట్లుగా వివరిస్తున్నారు. దీనిపై సీఆర్‌డీఏ అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాల్సిందిగా ప్లాట్ల యజమానులు వేడుకుంటున్నారు.

# నవంబర్ 9-11 తేదీల్లో ఢిల్లీలో కార్మిక మహాప్రదర్శన

**విజయవాడ సెంట్రల్:** కార్మికుల న్యాయమైన కోర్కెల సాధన కోసం నవంబర్ 9 నుంచి మూడురోజుల పాటు ఢిల్లీ పార్లమెంటు ముందు జరిగే కార్మిక మహా ప్రదర్శనకు దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను సమీకరించాలని సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి యం.ఏ.గఫూర్ పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో మంగళవారం కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యుఎఫ్ఐ) అఖిల భారత కౌన్సిల్ సమావేశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్లు, విదేశీ కంపెనీలకు బీజేపీ ప్రభుత్వ హయాంలో మంచిరోజులు వచ్చాయన్నారు. కార్మికులకు నష్టం చేసేట్లు చట్టాలు మారుస్తున్నారని చెప్పారు. మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. మత సామరస్యం, కార్మిక ఐక్యత, కార్మిక అనుకూల విధానాల కోసం పోరాటాలు చెయ్యాలని చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం పార్లమెంటు చట్టం చేసిన భవన నిర్మాణ సంక్షేమ నిధికి తూట్లు పొడుస్తోందన్నారు. చంద్రన్న బీమా అంటూ నిధులు మళ్లించిందన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం తగు కార్యాచరణ రూపొందించాలని కోరారు. సీడబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు ఆర్. సింగారవేలు, ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి, వి. ఉమమహేశ్వరరావు తదితరులు సమావేశంలో ప్రసంగించారు. ప్రధాన కార్యదర్శి నివేదికపై రాష్ట్రాల ప్రతినిధులు చర్చించారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశాలు బుధవారం ముగుస్తాయి.



సీడబ్ల్యుఎఫ్ఐ సమావేశాల్లో ప్రసంగిస్తున్న యం.ఏ. గఫూర్


ఒకే రోజు నిర్వహిస్తున్న ఇద్దరి కర్మకాండలు

# కర్మకాండలకు.. స్థలం కరువు

- ముందస్తుగా రిజర్వు చేసుకోవాల్సిన దుస్థితి
- అద్దె ఇళ్లలో ఉండే వారి బాధలు వర్ణనాతీతం
- సంస్థలు కల్పిస్తున్న సౌకర్యాలు సరిపోని వైనం
- నగరంలో పెద్ద ప్రక్రియగా కర్మకాండల నిర్వహణ
- పితృకర్మలకు సౌకర్యాలపై కార్పొరేషన్ కనికరం చూపాలి

**కుటుంబ సభ్యులు చనిపోయి విషాదంలో చిక్కుకుని ఉన్న వారికి అంత్యక్రియలు, తదనంతర కార్యక్రమాల నిర్వహణకు స్థలం పెద్ద సమస్యగా మారింది. అద్దెకు ఉండే వారు.. చాలీచాలని ఇళ్లల్లో ఉండే వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నగరంలో పలు సంస్థలు ఆయా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు ఎటూ సారిపోవడంలేదు. నగరంలో పరిస్థితి ఎలా ఉందంటే మనిషి చనిపోతే అంత్యక్రియల కంటే ముందే కర్మకాండలకు, అన్నదానం నిర్వహించేందుకు స్థలం రిజర్వ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఆశ్చర్యం కాదు.**

**గుంటూరు(సంగడిగుంట):** పితృ కర్మలు ఇవి బతికున్న ప్రతి ఒక్కరి కనీస ధర్మం. చనిపోయిన మనిషికి ఆత్మ శాంతి కలిగేందుకు వారసులు నియమానుసారంగా పిండప్రదానం చేయాలి. వీటినే పితృకర్మలు అంటారు. అయితే నగరంలో పితృకర్మలు చేసేందుకు కనీస సౌకర్యాలు సరిపోనన్ని లేవు. దీంతో నగరవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అవసరానికి తగినంత స్థాయిలో పితృకర్మలు నిర్వహించడానికి సదుపాయాలు కల్పించడంలో నగరపాలక సంస్థ పూర్తిగా విఫలమైంది. దశాబ్దాల నుంచి ఈ సేవలు అందిస్తున్న ధార్మిక సంస్థలు కల్పించిన సదుపాయాలే నేటికీ అందుబాటులో ఉన్నాయి. నాటి కాలానికి అనుగుణంగా కల్పించిన సదుపాయాలు నేటి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. శ్రీనివాసరావుపేట, బొంగరాలబీడు, స్తంభాలగరువు మహాప్రస్థానం సంస్థలు పితృ కర్మలు, పిండప్రదానం తదితర కార్యక్రమాలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలు ఏ మూలకూ సరిపోవడం లేదు. నగరంలో సరాసరిన ప్రతి రోజు 250 మంది చనిపోతున్నారు. వీరిలో హిందూ ధర్మం ఆచరించే వారిలో 200 మంది వరకు ఉంటున్నారు. కానీ ఆయా సంస్థలు నగరంలో మొత్తం కల్పిస్తున్న సదుపాయాలు 50 మందికి కూడా సరిపోవడం లేదు. మిగిలిన వారి పరిస్థితి ఊహించుకోవచ్చు.

## అద్దెలకు ఉండే వారి పరిస్థితి వర్ణనాతీతం..

నగరంలో పరిస్థితి ఎలా ఉందంటే మనిషి చనిపోతే అంత్యక్రియల ముందే కర్మకాండలకు, అన్నదానం నిర్వహించేందుకు స్థలం రిజర్వ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కారణం ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎక్కువగా అద్దెకు ఇచ్చేందుకు ఇష్టపడరు. పెళ్లిళ్లు, పుట్టిన రోజులకు లక్షలకు అద్దెకు ఇచ్చే మండపాలకు నగరంలో కొదవలేదు. కానీ చనిపోయిన మనిషికి పిండ ప్రదానం చేయడానికి మాత్రం స్థలాన్ని అద్దెకు ఇచ్చేందుకు ముందుకు రారు. కారణం తరతరాలుగా పిండ ప్రదానాలు అంశాన్ని అశుభ కార్యంగా చూడడమే. ఇంటి యజమానుల పరిస్థితి కొంత వరకు ఫరవాలేదు. అద్దెల కుండే వారి పరిస్థితి వర్ణనాతీతం. యజమానులు కర్మలు చేసుకునుందుకు ఒప్పుకోవడం లేదు. దీనితో ఎక్కడోచోట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఒకే స్థలంలో ఐదు నుంచి పది మంది కూడా ఒకే సమయంలో కర్మలు నిర్వహించుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కర్మకాండలు ఒక ఎత్తైతే బంధుమిత్రులకు భోజన ఏర్పాట్లు చేసుకునేందుక ఇబ్బందులు పడుతున్నారు.

## భర్త చనిపోయిన స్త్రీలకు ఇబ్బందులు..

హిందూ సంప్రదాయంలో భార్య బతికుండగా భర్త చనిపోతే ఆమెకు పసుపు, కుంకుమలు తీసే పేరిట కొన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీని కోసం అద్దెలకిచ్చే సంస్థలు రూ.300 నుంచి రూ.500 వరకు రోజుకు అద్దెలు వసూలు చేస్తున్నారు. కొన్ని సమాజిక వర్గాల్లో మూడు నెలల వరకు ఆ మహిళకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీనితో 10 నుంచి 15 వేల వరకు వీటికే వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచితంగా గదులు ఇచ్చే సంస్థలు ఉన్నా వాటిలో ఉండే పరిస్థితి లేదు. ఇటీవల మహాప్రస్థానం వంటి సంస్థలు వీటిపై దృష్టి కేంద్రీకరించి వసతులు కల్పిస్తున్నా అవి కొందరికే పరిమితమవుతున్నాయి. కొన్ని ధార్మిక సంస్థలు కల్పిస్తున్న సదుపాయాలు కొన్ని వర్గాలకు మాత్రమేనని బోర్డులే పెడుతున్నాయి. దీనితో కర్మ కాండ నిర్వహించుకోవడం నగరంలో పెద్ద ప్రక్రియగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఈ సమస్యపై దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


సౌకర్యాలు లేని భర్త చనిపోయిన మహిళలు ఉండే షెడ్లు

## ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధన గ్రంథావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ఏ.రాజేంద్ర ప్రసాద్

**ఏఎన్‌యూ :** ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధన గ్రంథాన్ని వర్సిటీ వీసీ ఆచార్య ఏ. రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. విద్యా విభాగంలో జరిగిన కార్యక్రమంలో పుస్తకావిష్కరణ గావించారు. విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ మందాసు వసంతరావు రచించిన క్రిసాన్ మూవ్‌మెంట్ ఆఫ్ ఆచార్య ఎన్‌జీ రంగా గ్రంథంలో పలు ముఖ్య అంశాలను ప్రస్తావించడం సంతోషంగా ఉందన్నారు. గ్రంథ .కర్త డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ ఆచార్య రంగా ప్రపంచంలోని ప్రథమంగా రైతుల కోసం పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. రైతు ఉద్యమాలలో పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నూర్ బాషా అబ్దుల్, విద్యా విభాగాధిపతి డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ విమల, డాక్టర్ ఈవ, డాక్టర్ మధు, సందీప్, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాణీలతకు పీహెచ్‌డీ



వర్సిటీ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధన గ్రంథం సమర్పించిన సోముల వాణీలతకు వర్సిటీ పీహెచ్‌డీని ప్రదానం చేసినట్లు పరిశోధన విభాగపు కో ఆర్డినేటర్ ఆచార్య రత్న షిలా మణి మంగళవారం తెలిపారు. పర్యవేక్షుడిగా ఆచార్య రత్నకర్‌వ్యవహరించారని పేర్కొన్నారు.

## దూరవిద్య పీజీ ఫలితాల విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం పరిధిలో ఈ ఏడాది మేలో జరిగిన ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డిప్యూటీ రిజిస్ట్రార్ భవనం ఆంజనేయ రెడ్డి మంగళవారం తెలిపారు. రివాల్యూయేషన్‌కు ప్రతి పేపరుకూ రూ. 960లు అని, సెప్టెంబర్ 9వ తేదీలోపు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

## అష్టావధానంపై దృష్టిని సారించాలి

తెలుగు ప్రజల సొత్తైన అష్టావధానం వంటి వివిధ ప్రక్రియలను తెలుగు విభాగం నిర్వహించాలని వర్సిటీ వీసీ ఆచార్య ఏ.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. మంగళవారం తెలుగు, ప్రాశ్చాత్య భాషా విభాగంలో గిడుగు వెంకటరామమూర్తి జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషోత్సవ సభలో వీసీ మాట్లాడారు. తెలుగు భాష గొప్ప తనాన్ని, ఆవశ్యకతను వివరించారు. తెలుగు సాహిత్య పరమైన అంశాలకు తమ వరకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నూర్ బాషా అబ్దుల్ మాట్లాడుతూ తెలుగు భాషా ఉద్యమ స్ఫూర్తిగా గిడుగు జయంతిని జరుపుకోవాలన్నారు. పాలనా కార్యక్రమాలన్నీ తెలుగు భాషలోనే జరిగేలా ప్రభుత్వం నిర్వహించాలన్నారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గిడుగు వారి వైశిష్ట్యాన్ని, తెలుగు భాషా వైభావాన్ని, వాడుక భాష ఆవశ్యకతను వివరించారు. సీనియర్ ఆచార్యులు పి.వర ప్రసాద మూర్తి, ఆచార్య జీవై ప్రభావతి దేవి, బోధదనేతర సిబ్బంది డాక్టర్ ఆచ్చయ్య బాబు పాల్గొన్నారు.

# పార్టీ అభివృద్ధికి యార్లగడ్డ కృషి



సభలో ప్రసంగిస్తున్న రావుల వెంకయ్య

**మంగళగిరి రూరల్:** సీపీఐ నియోజకవర్గ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా పార్టీ అభివృద్ధికి యార్లగడ్డ ఎనలేని కృషి చేశారని, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షుడు రావుల వెంకయ్య చెప్పారు. చినకాకానిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన యార్లగడ్డ సుబ్బారావు 19వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగించారు. రావుల వెంకయ్య మాట్లాడుతూ నేటి కమ్యూనిస్టు నేతలు యార్లగడ్డను ఆదర్శంగా తీసుకొని, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన తరహా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, నీటి సంఘం అధ్యక్షుడిగా, రైతులకు, ప్రజల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. నియోజకవర్గ కార్యదర్శి రావుల శివారెడ్డి మాట్లాడుతూ కొందరు మరణించినప్పటికీ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయి ఉంటారని, అటువంటి వారిలో యార్లగడ్డ ఒకరని చెప్పారు. నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శులు పిలల్లమర్రి నాగేశ్వరరావు, కంచర్ల కాశయ్య మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం యార్లగడ్డ చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఆర్‌ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వంచారు. ఈ శిబిరాన్ని ఎన్‌ఆర్‌ఐ మెడికల్ సూపిరెండెంటెంట్ డాక్టర్ ఫణిభూషణ్ ప్రారంభించారు. 150 మంది వృద్ధులు శిబిరంలో పాల్గొనగా, 50 మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందని, త్వరలో ఆసుపత్రిలో ఆపరేషన్ నిర్వహించడం జరుగుతందని చెప్పారు.

## కూలి డబ్బులు అడిగినందుకు దాడి

**గుంటూరు:** తాను చేసిన పనికి డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఎస్‌వీఎన్ కాలనీ మూడోలైనులో జరిగింది. స్వర్ణభారతీ నగర్ 17వ లైనుకు చెందిన మౌర్య దర్శదేవ్ కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో సత్యనారాయణ వద్ద కాంట్రాక్ట్ పద్దతిన కార్పెంటర్ పని చేశాడు. తాను కూలి డబ్బులు అడిగినందుకు కర్రతో దాడి చేసి కొట్టాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు కమిటీలు ఏర్పాటు చేయండి

- రాజధాని రైతుల డిమాండ్
- తుళ్లూరు, అనంతవరంలో పపంచ బ్యాంక్ ప్రతినిధుల పర్యటన

**తుళ్లూరు:** పర్యావరణ ప్రభావ అంచనా, వరద నియంత్రణ ప్రభావిత పునరావాస పాలసీ గురించి మంగళవారం అనంతవరం, తుళ్ళూరు గ్రామాల్లో సీఆర్‌డీయే ఆధ్వర్యంలో కన్సల్టేషన్ వర్క్‌షాపులను నిర్వహించారు. రాజధానిలో ప్రపంచ బ్యాంకు సహకారంతో చేపట్టబడుతున్న రోడ్లు, వరద నియంత్రణ చర్యలు, ప్రాజెక్టుల వల్ల ప్రభావిత అంశాల గురించి ప్రజల అభిప్రాయాలు, సలహాలు స్వీకరించారు. నలుగురు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణకు సిటిజన్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తుళ్లూరులో జరిగిన కార్యక్రమంలో పాలవాగు గురించి రైతులు తెలియజేశారు. ప్రత్యామ్మాయ ఏర్పాట్లు చేయకుండా పాలవాగును పూడ్చారని, దాని వలన గ్రామాలలోకి వరద నీరు వచ్చే అవకాశాలున్నాయని రాయపూడి సొసైటీ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి అనుమానం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించటానికి సీఆర్‌డీయేలో కానీ, ప్రభుత్వం తరఫున కానీ అధికారికంగా రైతు కమిటీ ఉందా...? అని ప్రశ్నించారు. గ్రామ కంఠాలు, అసైన్డ్, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాడికొండ మార్కెట్ యార్డు చైర్మన్ నరహింహారావు కోరారు. రిహాబిటేషన్ కాలనీల సమాచారం సంబంధిత వ్యక్తులకు తెలియజేయాలని తుళ్లూరుకు చెందిన శేషుబాబు కోరారు. రైతు నాయకుడు సత్యనారాయణ మాట్లాడుతూ విస్తీర్ణ సమస్యలు ఇంకా కొన్ని అలాగే ఉన్నాయని తెలిపారు. సీఆర్‌డీయే లాండ్సు డైరెక్టర్ చెన్న కేశవరావు, స్టాటజీ అధికారి శాస్త్రి, ప్రపంచ బ్యాంకు ప్రతనిధుల బృందం, డీసీలు సాధన గ్లోరియా, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. వెంకటపాలెం,నీరుకొండలో బుధవారం సదస్సు ఉంటుందనిఅధికారులు తెలిపారు.

## రహంతుల్లా మృతికి ఎమ్మెల్యే కొమ్మాలపాటి సంతాపం

**అమరావతి:** మండల పరిధిలోని ముస్లింలకు అమీర్ (పెద్ద) హాజీ పఠాన్ రహంతుల్లా ఖాన్(70) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతికి ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ సంతాపం తెలిపారు. రహంతుల్లా మృతి మండలంలోని ముస్లిం సోదరులకు తీరని లోటని అన్నారు. కుటుంబసభ్యులకు తన సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు, ముస్లిం పెద్దలు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

## విద్యార్థులకు ప్రయోగ పరికరాలపై విశ్లేషణ అవసరం

**తాడికొండ :** పాఠ్యాంశాలతో పాటు ప్రయోగపరికరాలపై విద్యార్థులకు విశ్లేషణా శక్తి అవసరమని జీవన్ సైంటిఫిక్ టెక్నాలజీ సీఈవో ఎన్.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. లాం చలపతి ఫార్మశీ కళాశాలలో మంగళవారం ఫార్మా ఎనలైటిక్ 2017 జాతీయ వర్క్‌షాపునకు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో విశ్లేషణా శక్తిని పెంచుకుని సమాజ శ్రేయస్సుకు పాటు పడేలా చూడాలన్నారు. ఎక్సిస్ క్లినికల్ విభాగాధిపతి ఎన్.నాగరాజు మాట్లాడుతూ ఫార్మా కంపెనీలతో పాటు దాదాపు ప్రతి పరిశ్రమలో ఎనాల్సిస్ ల్యాబ్‌లు ఉంటాయన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక రూపొందించుకుని కష్టపడితే విజయాలు సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ విశ్లేషణ పరికరాలు వినియోగంలో ఉన్నందున పుస్తక పరిజ్ఞానంతో పాటు విశ్లేషణా శక్తిని పెంచుకోవాలన్నారు. కళాశాలలో ఉన్న 25 అధునాతన పరికరాల పని తీరును ప్రయోగ పూర్వకంగా వివరించి శిక్షణ ఇచ్చేందుకు ఫార్మ ఎనలైటిక్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రంలోని 12 కళాశాలల నుంచి 250 మంది విద్యార్థులు హాజరయ్యారు. డిఫరెన్షియల్, కెలోరిమోటర్, హెచ్‌పీఎల్‌సీ, ఎఫ్‌టి వీఆర్ మొదలైన పరికరాల పని తీరును సూత్రాల ద్వారా విద్యార్థులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీడీలను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి

**తాడికొండ :** విద్యార్థులకు వారిపై వారికి నమ్మకాన్ని కలిగించేలా ఉపాధ్యాయులు ఉండాలని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ పార్వతి అన్నారు. మంగళవారం సాయంత్రం తాడికొండ స్కౌట్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయుల శిక్షణా కార్యాక్రమానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా సాధించగమనే ధైర్యాన్ని ఉపాధ్యాయులు కలిగించాలన్నారు. ప్రాథమిక పాఠశాల విద్య నుంచే వారిని అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చి దిద్దినప్పుడే అభివృద్ధి చెందుతారన్నారు. అబ్దుల్ కాలం చెప్పినట్లు మనిషి నిరంతరం నేర్చుకోవాలనే విధానాన్ని పిల్లలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎలాంటి విద్యను బోధిస్తున్నారు, వారి విధివిధానాలనుగురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏఎస్‌వో శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి బి.రామ్మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వ్యవసాయ డిప్లొమా కోర్సులతో మంచి ఉపాధి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వీసీ ఆచార్య దామోదర నాయుడు

**తాడికొండ :** వ్యవసాయ డిప్లొమా కోర్సులు చదివిన విద్యార్థులకు భవిష్యత్ చాలా ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య దామోదర నాయుడు తెలిపారు. మంగళవారం వ్యవసాయ డిప్లొమా కోర్సుల రెండో విడత కౌన్సెలింగ్ లాం ఫారంలో జరిగింది. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి వీసీ మాట్లాడుతూ వ్యవసాయ కోర్సులు చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉన్నాయని, సొంతంగా ఎరువులు, పురుగు మందుల దుకాణాలను, వ్యవసాయ సలహా కేంద్రాలను పెట్టుకోవచ్చని తెలిపారు. మల్టీపర్పస్ వర్కర్స్ 3 వేల మందిలో సగానికి పైగా డిప్లొమా కోర్సులు చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. రెండో విడత కౌన్సెలింగ్ రెండో రోజు ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలోని నాన్ లోకల్ అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. మధ్యాహ్నం వరకు జరిగిన కౌన్సెలింగ్‌లో 300 మందికి సీట్లు కేటాయించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ టివి సత్యనారాయణ, పాలిటెక్నిక్ కోఆర్డినేటర్ సి.సునీల్‌కుమార్‌బాబు ఉన్నారు.

### సినిమా గైడ్


| | |
|---|---|
| వీఎం (తాడికొండ) | వివేకం |
| సంధ్య (అమరావతి) | ఫిదా |
| ఆనందమహల్ (లెమల్లె) | నేనే రాజు నేనే మంత్రి |


ఉంగుటూరులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం


నిమజ్జనానికి తరలివస్తున్న గణనాథుని విగ్రహాలు

## ఘనంగా వినాయక విగ్రహాల నిమజ్జనాలు

**తాడికొండ :** మండల పరిధి తాడికొండ, నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో వినాయకుడి విగ్రహాల ఊరేగింపులు, లడ్డూ వేలం పాటలు, ఘనంగా నిర్వహించారు. నిమజ్జనానికి తరలించే ముందు స్వామి వారిని అలంకరించి గ్రామాల్లో ఊరేగిపులు జరిపారు. తీన్‌మార్, తప్పెట్లు, డీజేలతో కోలాహలంగా యువత బాణా సంచా కాలుస్తూ సందడి చేశారు. నిడుముక్కల, బడేపురం గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. నిడుముక్కల గ్రామంలో వైసీపీ నాయకులు హెన్రీ క్రిస్టినా, కత్తెర సురేష్, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు తదితర నాయకులు వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించారు.



తాడికొండలో నిమజ్జనానికి బయలుదేరిన గణనాధుడు, నిడుముక్కలలో వైసీపీ నాయకుల పూజలు

### అమరావతిలో...

**అమరావతి:** వినాయక చవితి పర్వదినం సందర్భంగా భక్తులతో ప్రత్యేక పూజలు అందుకున్న వివిధ రూపాలలోని గణనాథులు మంగళవారం అమరావతి చేరుకున్నారు. ప్రత్యేక వాహనంలో మంగళ వాయిద్యాలతో, బాణా సంచా కాల్చుతూ విగ్రహాలను నదీ తీరం వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పండుగ జరిగి ఐదవ రోజు కావడంతో సుమారు 50 విగ్రహాలు నిమజ్జనం జరిగాయి.

### కేఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో...

మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో మాజీ సర్పంచ్ కేఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఐదు రోజుల పాటు ఘనంగా జరిగాయి. మంగళవారం గ్రామస్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంపై స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మేదరమెట్ల సోమశేఖర్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బి పూర్ణయ్యలతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## పరిసరాల పరిశుభ్రంగా ఉంచాలి

**తాడికొండ :** పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూస్తామని ఎంపీపీ షేక్ రిజ్వానా తెలిపారు. మంగళవారం పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పి.రమేష్ అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో అమలు జరిగేలా చూస్తామన్నారు. దోమల నివారణకు గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని అధికారులకు తెలిపారు. రోగాల బారిన పడినవారిని గుర్తించి వారికి చికిత్స చేసి మందులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డి.నరేంద్ర, ఎమ్మార్వో అనిల్‌కుమార్, సర్పంచ్ శివలీల, వైద్యాధికారి డాక్టర్ దుర్గాశైలజ, గుంటుపల్లి మధు, కె సుబ్బారావు, డాక్టర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి పంట రక్షణకు చర్యలు తీసుకోవాలి

**అమరావతి:** అధిక వర్షాల వలన దెబ్బతిన్న పత్తి పంటను రక్షించుకునేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని ఏవో లావణ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని లింగాపురం, మండెపూడి గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పత్తి పంటను పరిశీలించి రైతులకు సూచనలు అందజేశారు. పంటపై పైపాటుగా 2శాతం యూరియా లేదా ఒక కిలో ముల్టిక్ ఎకరానికి ఐదు రోజుల వ్యవధిలో రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. తరువాత ఎకరానికి 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ చల్లుకోవాలన్నారు. పూత పిందె, గూడ రాలడం నివారణకు 2మి.లీ ప్లానోఫిక్స్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బందితో పాటు రైతులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఏవో లావణ్య


ఆటోనగర్ వై జంక్షన్ వద్ద అగ్రిగోల్డ్ బాధితుల చైతన్యయాత్రలో పాల్గొనేందుకు గుంటూరు తరలి వెళ్తున్న రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి తిరుపతిరావు, అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, జంగాల అజయ్‌కుమార్ తదితరులకు స్వాగతం పలుకుతున్న పెదకాకాని మండలం సీపీఐ నాయకులు ముప్పాళ్ల బుజ్జి, రంగారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు. **- పెదకాకాని.**



పీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సెప్టెంబర్ 1 విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రం నుంచి ప్రారంభం కానున్న మిలీనియం మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గోడపత్రిలను ఆవిష్కరిస్తున్న పెదకాకాని మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రతాప రెడ్డి, మురళీ కృష్ణ తదితరులు **- పెదకాకాని.**

# దినఫలాలు


**అదృష్టసంఖ్యలు : 3, 5**



**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.



**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.



**మిథునరాశి: (మే21-జూన్21):** ప్రియతములు కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.



**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



**సింహరాశి: (జూలై24-ఆగస్టు23):** పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



**కన్యారాశి: (ఆగస్టు24-సెప్టెంబర్23):** బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.



**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

## గన్నవరం విమాన సమాచారం

**ఎయిర్ పోర్టు ఫోన్ నెంబర్ : 0866- 2846729**

- **హైదరాబాద్** : ఉదయం 9:35, సాయంత్రం 5:20, 5:35, రాత్రి 9:55 (ప్రతి రోజు), మధ్యాహ్నం 1:20 (బుధవారం మినహా)
- **విశాఖపట్నం** : ఉదయం 10:55 (బుధవారం మినహా), మధ్యాహ్నం 3:35 (బుధవారం మాత్రమే)
- **బెంగళూరు** : ఉదయం 7:45, రాత్రి 8:00 (ప్రతిరోజు), మధ్యాహ్నం 2:00 (మంగళవారం మినహా)
- **ఢిల్లీ** : ఉదయం 9:05, సాయంత్రం 5:20 (హైదరాబాద్ మీదుగా), రాత్రి 8:40 (ప్రతిరోజు)
- **చెన్నై** : ఉదయం 7:55, సాయంత్రం 5:20 (ప్రతిరోజు)
- **తిరుపతి** : ఉదయం 7:55 (బుధవారం మినహా)

## జిల్లాలో 34 శాతం అధిక వర్షపాతం

**● భట్టిప్రోలులో అధిక వర్షపాతం**

**ఆంధ్రజ్యోతి - గుంటూరు:** జిల్లాలో మంగళవారం ఉదయం 8 గంటల వరకు 38 మండలాల్లో 9.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అధికంగా భట్టిప్రోలులో 96.4 మిల్లీమీటర్లు, తక్కువగా యడ్లపాడులో 0.8 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది. నెలాఖరు వరకు జిల్లాలో 152 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. ఈ నెల 29 తేదీ ఉదయం 8 గంటల వరకు 145.7 మిల్లీ మీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 195.6 మిల్లీ మీటర్లు కురిసి 34 శాతం ఎక్కువగా ఉంది. జిల్లాలో దుగ్గిరాల, మాచవరం, కాకుమాను, గుంటూరు, తాడేపల్లి, ప్రత్తిపాడు, తుళ్లూరు, కారంపూడి, నూజెండ్ల మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో అధికంగా శావల్యాపురంలో 126 శాతం వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 34 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## అండర్ - 16 అంతర్ జిల్లా జట్ల క్రికెట్ పోటీ

**నరసరావుపేట టౌన్:** స్థానిక ఆంధ్రా పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ మైదానంలో అండర్ 16 అంతర్ జిల్లాల బాలుర క్రికెట్ పోటీలు గుంటూరు, ప్రకాశం జిల్లాల జట్ల మధ్య మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 194 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. గుంటూరు జట్టులో జీ కార్తీకరెడ్డి 89 పరుగులు, ఎం మహిమ 25 పరుగులు చేశారు. ప్రకాశం జట్టులో శివ కుమార్ ఐదు వికెట్లు, నవీన్ ఐదు వికెట్లు సాధించారు. 245 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ప్రకాశం జట్టు ఎనిమిది వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. ప్రకాశం జట్టులో లేకజ్‌రెడ్డి 38 పరుగులు, నవీన్ 39 పరుగులు చేశారు. గుంటూరు జట్టులో హర్ష ఐదు వికెట్లు సాధించాడు. ఇరు జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన గుంటూరు జట్టుకు మూడు పాయింట్లు, ప్రకాశం జట్టుకు ఒక పాయింట్ లభించింది. పోటీలను అండర్ - 16 స్టేట్ సెలక్టర్ కేఎస్‌వీ కృష్ణ మోహన్, జిల్లా సెలక్టర్ అమరనాథ్, ఎం రాజారత్నం, పీ శరత్, ఏసీఏ కోచ్ వీ కృష్ణ, గ్రౌండ్ కో-ఆర్డినేటర్ కేవీ పురుషోత్తమరావు పర్యవేక్షించారు.

## నేడు డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం

**గుంటూరు:** రీజియన్‌లో ఆర్టీసీ పరమైన సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రీజనల్ మేనేజర్ జ్ఞానంగారి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. రీజియన్‌లో వివిధ రూట్లకు సంబంధించిన ఆర్టీసీ పరమైన సమస్యలను ప్రజలు 0863-2221565కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

## క్వారీ ప్రమాదంపై నేడు న్యాయ విచారణ

**పిరంగిపురం:** పిరంగిపురంలోని కొర్మెల్‌కొండ క్వారీలో గత మేలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతి చెందిన దుర్ఘటనపై ఈ నెల 30వ తేదీన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో న్యాయ విచారణ జరగనున్నదని తహసీల్దార్ జె పార్థసారథి మంగళవారం తెలిపారు. న్యాయ విచారణకు మృతుల రక్త సంబంధీకులు, క్వారీ యజమానులు, ప్రత్యక్ష సాక్షులు, గ్రామ పెద్దలు పాల్గొనాలని ఆయన కోరారు. విచారణకై తెనాలి రెవెన్యూ డివిజన్ అధికారి, లేబర్ అధికారి, మైనింగ్, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు.

## నేడు స్కూల్ అసిస్టెంట్స్‌కు పదోన్నతుల కౌన్సెలింగ్

**గుంటూరు(విద్య):** ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి నేడు ఉపాధ్యాయులకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జీ డీఈవో ఎన్ రఘుకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈవో పూల్ ఉపాధ్యాయులు, జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్‌కు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జడ్పీలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కౌన్సెలింగ్‌కు సంబంధిత ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు. డీఈవో పూల్ ఉపాధ్యాయులు, ఫైనల్ లిస్టులో ఉన్న స్కూల్ అసిస్టెంట్స్ తప్పని సరిగా హాజరుకావాలని సూచించారు.

## బ్రాయిలర్ ధరలు

**అమరావతి**


| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 96.00, 104.00, 115.00 |
| చికెన్ విత్ స్కిన్ | 184.00 |
| చికెన్‌స్కిన్‌లెస్ | 194.00 |

## బ్రాయిలర్ ధరలు

**వెన్‌కాబ్**

| | |
|---|---|
| రైతు ధర | 90.00 |
| రిటైల్ లైవ్ | 105.00 |
| విత్‌స్కిన్ | 147.00 |
| స్కిన్‌లెస్ | 173.00 |

## జిల్లాలో నేటి వాతావరణం



**గుంటూరు:** జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు ఈ విధంగా ఉండవచ్చు. గుంటూరులో పగలు అత్యధికంగా 34 డిగ్రీల సెల్సియస్, రాత్రి అత్యల్పంగా 26 డిగ్రీల సెల్సియస్. జిల్లాలో కొన్ని ముఖ్య ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు. జంగమహేశ్వరపురం 35-26, తెనాలి 34-26, మాచర్ల 32-24, బాపట్ల 34-27, నరసరావుపేట 34-25 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చు.

## ఆర్టీసీ సమాచారం

**గుంటూరు :** స్థానిక ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి బుధవారం రాత్రి బయలుదేరు దూరప్రాంత సర్వీసుల సీట్ల ఖాళీల వివరాలను ఆర్ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. రిజర్వేషన్ కోసం సెల్ నం: 9959061597కు సంప్రదించాలని కోరారు. రాత్రి 11.00 - గుంటూరు -కేపీహెచ్‌బీ- గరుడ (ఏసీ) - 43, రాత్రి 10.50 -గుంటూరు- కేపీహెచ్‌బీ-అమరావతి(ఏసీ)- 32, రాత్రి 10.15 - గుంటూరు - కెపిహెచ్‌బి - ఇంద్ర (ఏసీ) - 34, రాత్రి 9.45 - గుంటూరు -కేపీహెచ్‌బీ- ఇంద్ర(ఏసీ)-0, రాత్రి 8.30 -గుంటూరు- చెన్నై-సూపర్‌లగ్జరీ - 30 అని ఆర్ఎం తెలిపారు.

## సాగర్‌లో 500.00 అడుగులకు చేరిన నీటిమట్టం

**విజయపురిసౌత్:** నాగార్జున సాగర్ నీటి మట్టం మంగళవారం నాటికి 500.00 అడుగులుంది. ఇది 115.31 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 636 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 820 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 820 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం 785.00 అడుగులుంది. ఇది 22.31 టీఎంసీలకు సమానం.

**సత్రశాల టెయిల్ పాండ్ సమాచారం**

**రెంటచింతల:** సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో 4.76 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శేషారెడ్డి తెలిపారు. దిగువకు నీటి విడుదలను నిలిపివేశామన్నారు.

## పులిచింతలలో 5.09 టీఎంసీల నీటి నిల్వ

**అచ్చంపేట:** పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 5.09 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ జీవీవీ ప్రసాద్ తెలిపారు. ఎగువ నుంచి 1614 క్యూసెక్కుల నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోందన్నారు. పులిచింతల వద్ద స్లూయిజ్‌లను మూసివేసి దిగువకృష్ణకు నీటిని నిలిపివేశామన్నారు.

## పశ్చిమ డెల్టాకు 4,808 క్యూసెక్కుల నీరు

**దుగ్గిరాల:** కృష్ణాపశ్చిమడెల్టాకు విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి 4808 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీవద్ద 11.2 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 270 క్యూసెక్కుల నీరు, తూర్పు కాల్వకు 469 క్యూసెక్కుల నీరు, పశ్చిమకాల్వకు 149 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 323 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 679 క్యూసెక్కుల నీరు, కొమ్మమూరు కాల్వకు 2220 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## రాయపూడి మార్కెట్‌లో నిమ్మ ధరలు

**తుళ్ళూరు:** రాయపూడి నిమ్మకాయల మార్కెట్‌లో మంగళవారం జరిగిన లావాదేవీలు ఈ విధంగా ఉన్నాయి. పచ్చికాయ లావురకం టిక్కీ రూ.1400 నుంచి రూ.1600 పండు కాయ, సన్న రకం రూ.1000 నుంచి రూ.1200 ధర పలికాయి.

## 66,393 టిక్కీల మిర్చి విక్రయం

**ఆంధ్రజ్యోతి-గుంటూరు:** గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి మంగళవారం 64,546 మిర్చి టిక్కీలను రైతులు విక్రయానికి తీసుకొచ్చినట్లు యార్డు ఉన్నతశ్రేణి ఎం దివాకర్ తెలిపారు. యార్డులో నిల్వవున్న వాటితో కలుపుకొని 66,393 టిక్కీలు విక్రయం జరగగా, ఇంకా 22,571 టిక్కీలు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. యార్డులో మంగళవారం నాన్ ఏసీ కామన్ వెరైటీ రకం క్వింటాల్ ధర కనిష్ఠంగా రూ. 2,000, గరిష్ఠంగా రూ. 8,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ రకం రూ. 2,200, రూ. 10,200, తెల్లకాయలు రూ. 800, రూ. 4,500, ఏసీ కామన్ వెరైటీ రూ. 2,600, రూ. 8,300, ఏసీ స్పెషల్ వెరైటీ రూ. 4,000, రూ. 7,300, ఏసీ తెల్లకాయలు రూ. 1,500, రూ. 3,500 ధర లభించినట్లు తెలిపారు.

## పసుపు విక్రయాలు నిల్

**దుగ్గిరాల:** స్థానిక పసుపు మార్కెట్‌యార్డుకు మంగళవారం రైతులెవ్వరూ రాకపోవడంతో ఎలాంటి క్రయవిక్రయాలు జరుగలేదు.

# రికార్డు కోసం.. రోడ్డుపైకి

ఆర్టీసీకి ప్రయాణికుల నుంచి ఆదరణ పెంచేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలు కార్మికుల పాలిట శాపంగా మారాయి. కండెక్టర్.. డ్రైవర్.. ఇతర కార్మికులు తమ పనితో పాటు ఆర్టీసీ రాయితీ కార్డుల విక్రయ భారం మోయాల్సి వస్తోంది. కార్డుల విక్రయాల్లో రికార్డు సాధించాలని అధికారులు కార్మికులకు లక్ష్యాలు నిర్ధేశించారు. దీంతో కార్మికులు ఆయా కార్డుల విక్రయాల కోసం రోడ్డెకాల్సి వస్తోంది. గుంటూరు డివిజన్‌లో లక్ష తెల్ల రేషన్ కార్డుదారులకు ఆర్టీసీ వనిత ఫ్యామిలీకార్డును విక్రయించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని అధికారులు భావిస్తున్నారు. అధికారుల నిర్ణయాలతో పనిభారం పెరిగిపోయిందని కార్మికులు వాపోతున్నారు.

- వనిత రాయితీ కార్డులు లక్ష విక్రయించాలని లక్ష్యం
- టిక్కెట్లు కొట్టాలా.. కార్డులు అంటగట్టాలా అని ప్రశ్నిస్తున్న కండక్టర్లు
- ఉచిత బస్సు పాసులకు దాతలను తీసుకురావాలనే ఆదేశాలపై ఆగ్రహం

**చిలకలూరిపేట అర్బన్:** ఆర్టీసీ బస్సు చార్జీలో రాయితీ కల్పించి ప్రయాణికులను ఆకర్షించేందుకు ఆ సంస్థ క్యాట్ కార్డు, వనిత ఫ్యామిలీ కార్డు వంటి పాసులను జారీ చేస్తోంది. ఈ కార్డులను గుంటూరు రీజియన్ పరిధిలో తెల్లరేషన్ కార్డున్న ప్రతి కుటుంబానికి అందించి, సంస్థకు మరింత ఆదాయం పెంచే ఆలోచనలలో అధికారులున్నారు. జిల్లాలో 48 లక్షల తెల్లరేషన్ కార్డుదారులు వివరాలను సేకరించిన అధికారులు వనిత ఫ్యామిలీ కార్డులను విక్రయించేందుకు ఆర్టీసీ కార్మికులను పురమాయించారు. వీరు గ్రామాలలో తెల్లకార్డు ఉన్న వారి వివరాలను తెలుసుకునే పనిలో వారు నిమగ్నమయ్యారు. ఈ పక్షోత్సవాల సమయంలో జిల్లాలోని 13 డిపోల పరిధిలో లక్ష తెల్లరేషన్ కార్డుదారులకు వనిత రాయితీ కార్డులు అందించాలని కార్మికులకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నారు. దీంతో ఉద్యోగాలు చేయాలా లేక లక్ష్య సాధనకు రోడ్డెక్కాలా అనే ఆందోళనతో కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. పక్షోత్సవాలలో భాగంగా జిల్లాలో 17,728 మందికి వనిత ఫ్యామిలీ కార్డులు అందించి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపారు. గుంటూరు డివిజన్ పరిధిలోని గుంటూరు, రేపల్లే, తెనాలి, మంగళగిరి, పొన్నురు, బాపట్ల డిపోల పరిధిలో ఇప్పటి వరకు 5,395 మందికి ఈ కార్డులు అందించారు. ఇక నరసరావుపేట డివిజన్ పరిధిలోని చిలకలూరిపేట, నరసరావుపేట, మాచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ డిపోల కార్మికులు 11,602 మందికి వనిత ఫ్యామిలీ కార్డులను అందించినట్లు అధికారులు చెబుతున్నారు. పదో తరగతి లోపు చదువుతున్న విద్యార్థులకు అందించే ఉచిత బస్సు పాసులకు ఇచ్చే కార్డులకు (ఒక్కొక్కటికి రూ.40) దాతలను తీసుకురావాలని ఆదేశాలు జారీ చేసినట్టు పలువురు కార్మికులు చెబుతున్నారు. దీంతో ప్రయాణికులతో ఎక్కువగా పరిచయాలుండే కండక్టర్లను ఈ పనికి పురమాయించారు.




### సహకారమే కోరాం: జ్ఞానంగారి శ్రీహరి, ఆర్ఎం

వనిత, క్యాట్ కార్డుల విషయంలో కార్మికులకు ఎటువంటి టార్గెట్లు పెట్టలేదు. ఎక్కువ కార్డులు మంజూరు చేయాలనే లక్ష్యం మేరకు వారు కూడా సహకరించాలని కోరాం. ఈ విధులకు కేటాయించిన వారు కాకుండా మిగిలిన కార్మికులు ఎవరైనా కార్డులు బుక్ చేస్తే ఒక్కొక్క కార్డుకు రూ.10 చొప్పున ప్రోత్సాహం ఇస్తున్నాం. సంస్థ బాగుంటేనే అందరం బాగుంటాం అనే ఉద్దేశంతో కార్మికులకు ఈ బాధ్యతలు అప్పగించాం.

## ఆర్ఎంపీ, పీఎంపీల గౌరవ వేతనానికి ప్రభుత్వం కృషి

### నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ గుంటుపల్లి

**దాచేపల్లి:** గ్రామాల్లో ప్రాథమిక వైద్యాన్ని అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలకు ప్రభుత్వం గౌరవవేతనం ఇచ్చేందుకు కృషి చేస్తుందని నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం నారాయణపురంలోని మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు ప్రభుత్వం కష్టపడేవారిని గుర్తిస్తుందని, అన్నివిధాలుగా అభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. ఆర్ఎంపీ, పీఎంపీలకంటే ముందుగా గ్రామాలలో నాయీ బ్రాహ్మణుల వంశానికి చెందిన వారు వైద్యాన్ని అందించారని తెలిపారు. తొలుత ఆర్ఎంపీలకు, పీఎంపీలకు ప్రభుత్వ పరంగా గుర్తింపునిచ్చిన ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మదిర లాజర్, కార్యదర్శి చింతపల్లి తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ చైర్మన్ గుంటుపల్లి

## సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం

### ఎస్టీయు రాష్ట్ర కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు

**గుంటూరు(విద్య):** ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనిశపాతంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేసే వరకు ఆందోళన చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జోసఫ్‌సుధీర్‌బాబు అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద మంగళవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో చేసిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పాత పెన్షన్ విధానం మరలా పునరుద్దరించాలని కోరారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం కాలరాయాలని చూస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సామాజిక భద్రతకల్పించే పెన్షన్‌ను రద్దుచేయడం దురద్రుష్టకరమన్నారు. సీపీఎస్ విధానం పూర్తిగా రద్దు చేసేవరకు ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. జిల్లా ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఎస్ రామచంద్రయ్య తదితరులు మాట్లాడుతూ సీపీఎస్‌పై నిరంతరపోరాటం చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఎం వెంకటకోటయ్య, ఆర్థిక కార్యదర్శి గేరా మోహనరావు, ఎం రమేష్‌బాబు, బి సంపత్‌బాబు, వై శ్యామ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.



ధర్నాలో మాట్లాడుతున్న జోసఫ్ సుధీర్‌బాబు

# సురక్షిత ప్రయాణానికి చర్యలు



జాతీయ రహదారిపై పరిశీలిస్తున్న జిల్లా రవాణాశాఖాధికారి జీసీ రాజారత్నం, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల బృందం

**జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్ల పరిశీలన**

**భద్రత చర్యలపై హైవే అధికారులకు పలు సూచనలు**

**లైసెన్సు తీసుకొని ఏడాదైన ఆటో డ్రైవర్లకు బ్యాడ్జీలు : డీటీసీ**

**చిలకలూరిపేట:** సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా భద్రతా చర్యలు చేపడుతున్నట్టు జిల్లా రవాణాశాఖాధికారి జీసీ రాజారత్నం తెలిపారు. జాతీయ రహదారిపై విజయవాడ వారధి నుంచి చిలకలూరిపేట మండలంలోని తాతపూడి వరకు గతంలో గుర్తించిన బ్లాక్ స్పాట్‌లను డీటీసీ రాజారత్నం, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి ఆయా ప్రాంతాలలో భద్రత చర్యలు చేపట్టవలసినదిగా హైవే అధికారులకు సూచించామన్నారు. ఈ నేపథ్యంలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రధానంగా చిలకలూరిపేట ప్రాంతంలో రహదారి ఆరువరసల విస్తరణ నిలిచిపోవడంతో సమస్య తీవ్రత ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ ప్రాంతంలోని ఐదుకూడళ్లలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండటం ఆందోళన కలిగించే అంశంగా ఉందన్నారు. అనధికార లెక్కల ప్రకారం చిన్న చిన్న ప్రమాదాలు వందల సంఖ్యలో జరిగాయన్నారు. ఈ మేరకు ఆయా కూడళ్లలో రంబుల్ స్ట్రిప్స్ స్పీడ్ బ్రేకర్లు, థర్మోప్లాస్టిక్ పెయింట్‌లు వేయడం వంటి చర్యలు చేపట్టాలని హైవే అధికారులకు సూచించడం జరిగిందన్నారు. లైసెన్సు తీసుకొని ఏడాది కాలం పూర్తిచేసుకున్న ఆటో డ్రైవర్లకు బ్యాడ్జీలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలోని అన్ని ఎంవీఐ కార్యాలయాలలో నిరంతర ప్రక్రియలా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని ఆటో డ్రైవర్లు సద్వినియోగం చేసుకొని బ్యాడ్జీలు పొందాలని సూచించారు. వాహన తనిఖీలలో బ్యాడ్జీలు లేకుండా వాహనం నడుపుతున్నట్టు గుర్తిస్తే సదరు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేస్తామన్నారు.

**ఆన్‌లైన్‌లోనే వెహికల్ బదిలీ**

పాత వాహనాల ట్రాన్స్‌ఫర్స్‌కు సంబంధించి ఆర్‌టీఏ ఏపీ వెబ్‌సైట్‌లో ప్రత్యేక కాలమ్ కేటాయించడం జరిగిందన్నారు. ఆధార్ నంబరుతో వాహన నంబరును అనుసంధానం చేసుకున్న వాహనదారులు ఆన్‌లైన్‌లో వేలిముద్ర వేసి డెబిట్/క్రెడిట్ కార్డు ద్వారా నిర్ణీత రుసుం చెల్లించి ఎవరికయితే వాహనాన్ని ట్రాన్స్‌ఫర్ చేయదలచుకున్నారో వారికి బదలాయించవచ్చునన్నారు. సంబంధిత వ్యక్తి వేలిముద్రకూడా నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యాలయానికి వాహనదారుడు రానవసరం లేకుండానే ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రక్రియ చేసుకోవచ్చన్నారు. ఆయా వివరాలను ఎంవీఐ కార్యాలయ ఉద్యోగులు పరిశీలించిన తర్వాత 15 రోజులలోపు సంబంధిత వ్యక్తి ఇంటికి వాహన రిజిస్ట్రేషన్ కార్డు వచ్చే విధంగా చూడటం జరుగుతుందన్నారు. మోటారు వర్కర్ యూనియన్‌ల వారు వేలిముద్ర పరికరం, కంప్యూటర్ ఏర్పాటు చేసుకుంటే ఆన్‌లైన్ ప్రక్రియకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రవాణాశాఖ పారదర్శక సేవలను వాహనదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంవీఐ అమర్‌నాయక్, విజయవాడ టోల్‌ప్లాజా జనరల్ మేనేజర్ రవికిరణ్, రోడ్ సేఫ్టీ ఎక్స్‌పర్ట్ బిజుముత్తు, ఎన్‌హెచ్‌ఐఏ ప్రతినిధులు ప్రసాద్, సన్యాసినాయుడు, రవికిరణ్ తదితరలు డీటీసీ వెంట ఉన్నారు.

# పత్తి కొనుగోళ్లకు సన్నాహాలు

- మిర్చియార్డును సందర్శించిన సీసీఐ జీఎం మోహిత్ శర్మ
- యార్డు చైర్మన్ మన్నవ, సెక్రటరీ దివాకర్‌తో చర్చలు
- లావాదేవీల క్రమబద్ధీకరణ బాధ్యత మార్కెట్ కమిటీదేనని స్పష్టీకరణ



గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో చైర్మన్ మన్నవ సుబ్బారావుతో పత్తి కొనుగోళ్లపై చర్చిస్తున్న సీసీఐ జీఎం మోహిత్ శర్మ

**గుంటూరు, ఆంధ్రజ్యోతి:** కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జనరల్ మేనేజర్ మోహిత్ శర్మ ప్రప్రథమంగా గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణాన్ని సందర్శించారు. పత్తి కొనుగోళ్లు అక్టోబర్ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సీసీఐ కేంద్రాలను అందుకు సంసిద్ధం చేసేందుకు ఆయన ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది పత్తిసాగు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్‌లో ధర నిలబెట్టేందుకు జిల్లా వ్యాప్తంగా 11 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, సెక్రటరీ దివాకర్‌తో చర్చలు జరిపారు.

గత సంవత్సరం లక్షా 17వేల 259 హెక్టార్లలో పత్తి పంటసాగు జరగగా ఈ సంవత్సరం ఇప్పటికే లక్షా 66 వేల 673 హెక్టార్లలో పత్తివేశారు. సీజన్ ముగిసేనాటికి లక్షా 85వేల హెక్టార్లలో పత్తి సాగు జరిగే అవకాశం ఉంది. దీని దృష్ట్యా కోటి క్వింటాళ్ల పత్తి దిగుబడి రావొచ్చని లెక్కలు వేశారు. ఈ నేపథ్యంలో మార్కెట్‌కు పంట పోటెత్తే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది సీసీఐ పత్తికి కనీస మద్దతు ధరగా క్వింటాల్‌కు రూ.4,320 ధర నిర్ణయించింది. తేమ శాతాన్ని 8 నుంచి 12 మధ్యన అనుమతిస్తారు. పత్తి కొనుగోళ్లలో దళారుల ప్రమేయాన్ని తగ్గించేందుకు నూతన నిబంధనలను అమలులోకి తెచ్చింది. ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదైన రైతుల వద్ద మాత్రమే పత్తిని కొనుగోలు చేస్తారు. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి నిరీక్షించకుండా ఉండేందుకు మార్కెట్ కమిటీలు తమ పరిధిలోని మండలాలు, గ్రామాలకు షెడ్యూల్ ఇస్తాయి. ఆ రోజుల్లోనే రైతులు పత్తిని కొనుగోలు కేంద్రానికి తేవాల్సివుంది. పత్తిని కొనుగోలుచేసి ఆన్‌లైన్‌లో నగదు చెల్లిస్తారు. గతంలో చెక్కుల విధానానికి ఈ ఏడాది నుంచి ఫుల్‌స్టాప్ పెడతారు. దీనివల్ల పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతాయని సీసీఐ జీఎం మోహిత్‌శర్మ, యార్డు చైర్మన్ మన్నవ స్పష్టం చేశారు.

# మాతృభాషతోనే.. మానసిక వికాసం

**తెలుగును బతికించుకోకుంటే సంస్కృతులు కనుమరుగే**

**కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్**



**తెనాలి కల్చరల్:** ప్రాథమిక స్థాయిలో పౌరులు మాతృభాషతోనే విద్యనభ్యసిస్తే మానసిక వికాసం కలుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ తెలిపారు. తెనాలిలో ఆయన మంగళవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో ఆంగ్లం తప్పనిసరి కాదని, ఉన్నత విద్యా స్థాయిలో ఆంగ్లం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాతృభాషలో విద్య అభ్యసించడం తప్పని పరిస్థితి ఉందన్నారు. తెలుగు పద్యాలు, శతకాలు, సాహిత్యంలోని మానవతా విలువలను తెలుసుకోవాలంటే తెలుగు భాషలోనే చదవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు భాషను బతికించుకోకపోతే సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతాయని వివరించారు. తెలుగు భాషను ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. భాషాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణా ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను నెలకొల్పిందన్నారు. ఏపీలోనూ స్పష్టమైన, స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. భాషపై పటుత్వం, సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తి అవగాహన ఉన్న వారినే సభ్యులుగా నియమించి భాషాభివృద్ధికి తోడ్పాడాలని ప్రభుత్వాన్ని కోరారు. స్పష్టమైన భాషా విధానం ప్రభుత్వం ప్రకటించాలన్నారు. తెలుగు భాషాధివృద్ధికి కృషి చేస్తున్న కవులను, రచయితలను, సాహితీవేత్తలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. శ్రీశ్రీ, గుర్రం జాషువా, మాదవపెద్ద గోఖలే, ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితర రచయితల రచనలను ఇతర భాషల్లోకి అనువాదం చేయాలన్నారు. పరిపాలనలోనూ తెలుగు భాషను అమలు చేయాలన్నారు.

అమ్మ భాష తర్వాతే అన్ని భాషలు అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ ప్రకటనలు తెలుగులోనే ఉండాలన్నారు. తెలుగు వారి మాండలికాలను, యాసలను సజీవంగా నిలిచే రచనలు చేయాల్సిన అవసరం రచయితలపై ఉందని పాపినేని తెలిపారు.

కార్పొరేషన్ హెల్ప్ లైన్

| | | | |
|---|---|---|---|
| అదనపు కమిషనర్(రెవెన్యూ, ఎడ్యుకేషన్) | 9849908386 | ఎంహెచ్‌వో -2(పశ్చిమ) | 9177001865 |
| డిప్యూటీ కమిషనర్(శానిటేషన్, ఉపాసెల్) | 9849908364 | బయాలజిస్ట్- | 9849908366 |
| సూపరింటెండెంట్ ఇంజనీర్ | 9849908400 | మేనేజర్ - | 9849908374 |
| సిటీ ప్లానర్ | 9959666914 | ఫిర్యాదుల విభాగం - | |
| ఎంహెచ్‌వో-1(తూర్పు) | 9849908398 | | 0863 -2345103 |

# రామమూర్తి విద్యార్థులకు ఆదర్శం కావాలి


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న వెంకటసుబ్బయ్య, సుభాని తదితరులు

**గుంటూరు:** తెలుగు భాషాభివృద్ధికి జీవితకాలం కృషి చేసిన గిడుగు రామమూర్తి విద్యార్థులకు ఆదర్శం కావాలని రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమేపల్లి వెంకటసుబ్బయ్య తెలిపారు. మంగళవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామూర్తి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగును స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషోద్యమ దీప్తికి కృషి చేయాలన్నారు. ఆంగ్లం సహా ఇతర భాషలు ఎన్నైనా నేర్చుకోవచ్చని, కానీ మాతృభాషను అశ్రద్ధ చేయకూడదన్నారు. దక్షిణాదిలో మాతృభాషపై ప్రజల్లో అంకిత భావం కలిగేలా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. కవి, రచయిత డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి మాట్లాడుతూ తెలుగు భాష అమృత భాష అని, ఆంగ్ల వ్యామోహంలో నేటి యువత కొట్టుకుపోవడం మంచిది కాదన్నారు. తెలుగు సంస్కృతి, నాడు-నేడు వ్యాసరచన, తెలుగు సంస్కృతి వైభవం వక్తృత్వం పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శశిబాల, డాక్టర్ సుజాత, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ గౌరి, జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షులు ఉమామహేశ్వర రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్‌వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దోమలపై దండయాత్ర

- తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో ర్యాలీలు
- ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక కార్యక్రమాలు
- గోడపత్రికలను అంటించిన కమిషనర్

**గుంటూరు(కార్పొరేషన్):** దోమలపై దండయాత్రను మంగళవారం నగరాపాలక సంస్థ కమిషనర్ అనురాధ ప్రారంభించారు. తూర్పు నియోజకవర్గంలోని ఆర్టీసీ కాలనీ, పశ్చిమ నియోజకవర్గం స్తంభాలగరువు చేబ్రోలు మహాలక్ష్మమ్మ, పుల్లయ్య హైస్కూల్లో దోమలపై దండయాత్ర ర్యాలీలు నిర్వహించారు. తొలుత కమిషన్ అనురాధ గోడపత్రికలను ఆయా ప్రాంతాల్లో అంటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదముందని అందువల్ల ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాల్లో నీరు నిలబడకుండా చూసుకోవాలని కోరారు. నీరు నిల్వ ఉన్న చోట దోమలు వృద్ధి చెందే అవకాశముందని, దోమల వల్ల మలేరియా, డెంగు జ్వరాలు వ్చ ప్రమాదముందని తెలిపారు. ప్రజలు సైడు కాలువల్లో వేయకుండా తడిచెత్త, పొడిచెత్తలుగా విభజించి నగరపాలక సంస్థకు అందజేయాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నగరపాలక సంస్థ మంగళవారం నుంచి శనివారం వరకు దోమలపై దండయాత్ర చేపట్టిందన్నారు. 34 బృందాలుగా ఏర్పాటు చేసిన బృందాలు వారికి కేటాయించిన వార్డుల్లో 50 గృహాలకు డోర్‌టు డోర్ తిరిగి గోడపత్రికలు, పాంప్లెట్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. కాలువలు శుభ్రం చేయడం, గార్బేజ్ నిల్వలు పేరుకు పోకుండా ఎప్పటికప్పుడు తొలగించడం, కల్వర్టు కింద ఫాగింగ్ చేయడం, సెప్టిక్ ట్యాంక్ గొట్టాలకు నెట్ ఏర్పాటు చేయడం గంబూషియా చేపలు వేయడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమన్నా రు. కార్యక్రమంలో డిప్యూటీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దాళి గిరిధర్, ఎంసీఈవో ప్రమీలారాణి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గోడపత్రికను అంటిస్తున్న కమిషనర్ చల్లా అనురాధ

**రోడ్లపై వ్యర్థాలు తొలగించాలి**

నగరపాలక సంస్థ కమిషనర్ అనురాధ మంగళవారం నగర పర్యటనలో భాగంగా కృష్ణనగర్, కోబాల్డ్‌పేట, తుపాన్‌నగర్, శ్యామలానగర్‌లలో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత తుపాన్‌నగర్ ప్రాంతంలో వ్యర్థాలను సేకరించేవారు రోడ్లపైనే వేస్తుండడాన్ని గమనించి వెంటనే వాటిని తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. కృష్ణనగర్‌లో మెట్లు తొలగించి మురుగు సరిగా పారేలా చూడాలని ఆదేశించారు. కోబాల్ట్‌పేటలో తిరుగుతున్న ఆవులను బందెల దొడ్డికి తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. శ్యామలానగర్‌లో నగరపాలక సంస్థ స్విమ్మింగ్‌పూల్ పరిశీలించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని, గార్డెనింగ్ పై శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

# తెలుగు భాష ప్రాముఖ్యతను చాటాలి

విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవం


భాష్యంలో నృత్యం చేస్తున్న విద్యార్థులు


విజ్ఞాన్‌లో సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

**గుంటూరు(విద్య):** విద్యార్థులు తెలుగు భాష ఖ్యాతిని దశదిశలా చాటాలని భాష్యం జోనల్ ఇన్‌చార్జి శివ తెలిపారు. మంగళవారం భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన తెలుగుభాషా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. తెలుగు భాష ఔనత్యాన్ని పెంచాలని సూచించారు. మాతృభాష పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు సంస్కృతి ఉట్టిపడేలా దుస్తులు ధరించి చెమ్మ చెక్క, వైకుంఠపాళి, కోలాటం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**తెలుగు భాషకు అభ్యుడు..**

తెలుగు భాషకు లిపిని కల్పించి భాష వ్యాప్తి కోసం తపించి ఎంతో సేవ చేసిన గిడుగు రామమూర్తిని నేటి తరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలని సిమ్స్ స్కూల్ డైరెక్టర్ భరత్ రెడ్డి తెలిపారు. తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా నందమూరికాలనీ సిమ్స్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల కార్యదర్శి డాక్టర్ బీ శివశిరిష, డీన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కందుకూరి విరేశలింగం, గురజాడ అప్పారావు, తాపీ ధర్మారావు, శ్రీపాద సుబ్రమణ్యంశాస్త్రి వంటి వారి గురించి వక్తలు వివరించారు.

**విజ్ఞాన్‌లో ఘనంగా వేడుకలు**

గార్డెన్స్ విజ్ఞాన్ లిటిల్స్‌లో తెలుగు భాషాదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రాచీన, ఆధునిక కవులు వేషధారణలో ఆలరించారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి అనురాధ, వాసవిక్లబ్ అధ్యక్షులు పద్మ, తెలుగు కో ఆర్డినేటర్ పాపకుమారి, తెలుగు పండిట్ నాయుడు, ప్రిన్సిపాల్ నిర్మల పాల్గొన్నారు.


స్విమ్స్‌లో గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

# పట్టపగలే వస్త్ర దుకాణంలో దోపిడీ

**గుంటూరు:** నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటి అగ్రహారం నాలుగో లైను మెయిన్ రోడ్డులోని గాయత్రీ లేడీస్ టైలర్స్ అండ్ డ్రస్ మెటీరియల్ దోపిడీ జరిగింది. నిర్వాహకురాలు పొట్లూరి రూపా మంగళవారం మధ్యాహ్నం దుకాణం ఒంటరిగా ఉంది. ఈ క్రమంలో ముగ్గురు మహిళలు మరో వ్యక్తితో కలిసి దుకాణంలోకి వచ్చి వస్త్రాలు కొనుగోలు చేస్తున్నట్లు నటించారు. కొద్దిసేపటికి రూప కుర్చీలో కుప్పకూలింది. సాయంత్రం రూప అత్త వచ్చి చూడగా ఆమె కుర్చీలో అపస్మారక స్థితిలో ఉంది. ఆమెను లేపి ప్రశ్నించగా దోపిడి జరిగినట్లు రూప గుర్తించింది. రూ.80 వేల సరుకు చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మత్తు మందు ఇచ్చి దోపిడీకి పాల్పడి ఉంటారని రూప ఫిర్యాదులో పేర్కొంది.

# ధ్యాన్‌చంద్ గొప్ప దేశ భక్తుడు


ర్యాలీ చేస్తున్న విజ్ఞాన్ విద్యార్థులు

**గుంటూరు(విద్య):** హాకీ వీరుడు ధ్యాన్‌చంద్ గొప్పదేశభక్తుడని విజ్ఞాన్ వర్సిటీ డీన్ డాక్టర్ వీ మధుసూదనరావు తెలిపారు. వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధ్యాన్‌చంద్ తన చివరి రోజుల్లో దుర్భర జీవితాన్ని గడిపారని ఆవేదన వ్యక్తం చేశారు. జర్మనీ, అమెరికా లాంటి దేశాలు క్రీడలకు ఎంతోప్రాధాన్యం ఇస్తున్నాయని, ఈ దిశగా మన ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటే ఎంతో మంది క్రీడాకారుల్ని తయారు చేయవచ్చునన్నారు. వర్సిటీ స్టూడెంట్ ఆఫైర్స్ డీన్ డాక్టర్ ఎంఎస్ఎస్ రుక్మిణి మాట్లాడుతూ తమకు ధ్యాన్‌చంద్ ఆటను ప్రత్యక్షంగా చూసే భాగ్యం దక్కకపోయినా ఆయన కుమారుడి ఆట చూశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పీడీ ధశరథరామయ్య, పీఈటీలు పీఐ ఖాన్, ఎం నవ్య పాల్గొన్నారు.

# ఐఐటీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు రద్దు చేయాలని ధర్నా




**గుంటూరు(విద్య):** ఐఐటీల్లో విద్యార్థులకు ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షల నిర్వహణ తగదని, దీనివల్ల అనేక సమస్యలు వస్తాయని పీడీఎస్‌యూ రాష్ట్రప్రధాన కార్యదర్శి గనిరాజు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారని తెలిపారు. దీనిని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు ఈ విధానాల వల్ల ఇబ్బందులుపడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే సెమిస్టర్ విధానంలో బయోమెట్రిక్, ఓఎంఆర్ సిస్టమ్ అమల్లో ఉందన్నారు. పరీక్షల నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను రద్దు చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎస్‌కే అక్బర్ బాషా, ఉపేంద్ర, శివారెడ్డి, ఎస్‌కే బాబావలి, రాజు, గోపి పవన్, విజయ్ పాల్గొన్నారు.



రెడ్డిపాలెం వీవర్స్‌కాలనీలో రహదారి దుస్థితి



రోడ్డు పక్కనే చెత్తాచెదారం

# అధ్వానంగా శివనాగరాజు కాలనీ

● అడ్డగోలుగా రోడ్డు తవ్వకాలు ● మచ్చుకైనా కనిపించని పారిశుధ్యం

**గుంటూరు(కార్పొరేషన్):** నగరంలోని శివనాగరాజు కాలనీ అధ్వాన స్థితిలో ఉంది. అసలే మట్టి రోడ్లు దానికి తోడు అడ్డగోలుగా తవ్వేశారు. దీంతో వర్షం వచ్చినపుడు కాలనీలో రాకపోకలు సాగించాలంటే స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీలో పారిశుధ్యం మచ్చుకైనా కనిపించడు. ఇళ్లమధ్యే పిచ్చి మొక్కలు మొలిచి, మురుగు నిలిచి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కనే చెత్త వేసి ఉండడంతో పారిశుధ్యం క్షీణించి రోగాలొస్తాయేమోనని ప్రజలు భయపడుతున్నారు. ఖాళీ స్థలాల్లో మొలిచిన పిచ్చి మొక్కల కారణంగా పురుగులు, విషకీటకాలు సంచరిస్తున్నాయి. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించండి

● ఎమ్మెల్యే ముస్తఫా

**గుంటూరు:** ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పనిచేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా సూచించారు. మంగళదాస్ నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజలు మరిచిపోరన్నారు. ప్రతి డివిజన్‌లో పార్టీ కన్వీనర్‌లు, నా యకులు ప్రజా సమస్యలను గుర్తించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. త్వరలో నగరపాలక సంస్థ ఎన్నికలు జరుగుతాయని, అనంతరం సాధారణ ఎన్నికలు జరుగు తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు వాకా శ్రీనివాసరెడ్డి, మహమూద్, నూర్‌ఖాన్, కిషోర్, వెంకటేశ్వరరావు, అగ్గిపెట్టె రాజు, అబిద్, సాయి, మురళీ, యాదాల చిన్నా, నాగేశ్వరరావు, హుస్సేన్, హసన్‌బుజ్జి తదితరులున్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

### అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

తూర్పు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుందని వేగం పెంచాలని ముస్తఫా నగర కమిషనర్ అనురాధను కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్‌ను కలుసుకున్న ఆయన నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చిం చారు. రోడ్ల విస్తరణ, కాల్వల నిర్మాణాలు, డ్రైనేజీ నిర్మాణ పనులలో జాప్యం జరుగుతుందన్నారు.

# శాకాంబరి అలంకారంలో గణనాథుడు

**గుంటూరు(సాంస్కృతికం):** గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఐదో రోజు మంగళవారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఏలూరుబజార్‌లో వరసిద్ధి వినాయక సంఘం ఆధ్వర్యంలో స్వామికి పలు రకాల కూరగాయలతో శాకాంబరి గణపతి అలంకారం చేశారు. ఆర్ అగ్రహారం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద శ్రీ వాసవీ యూత్ ఆధ్వర్యంలో స్వామికి నాగవల్లీ గణపతి అలంకారం చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పలు రూపాల్లో ఉన్న స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



### నేడు మహా రుద్రాభిషేకం

**లాలాపేట :** వాసవీ యూత్ ఆధ్వర్యంలో ఆర్ అగ్రహారంలో శ్రీ వాసవి కన్యకాపర మేశ్వరి ఆలయం ఎదుట జరుగుతోన్న బాల గణపతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మహాశివునికి మహా రుద్రాభి షేకం నిర్వహిస్తున్నట్లు వాసవీ యూత్ అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే నవరాత్రోత్సవాల్లో భాగంగా బాలగణపతిని అంగరంగ వైభవంగా అలంకరించారు.

### ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

### మద్దాలి గిరిధర్

**ఆంధ్రజ్యోతి, గుంటూరు :** విఘ్నేశ్వ రుని ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని టీడీపీ గుంటూరు తూర్పు ఇన్ చార్జ్ మద్దాలి గిరిధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక నెహ్రూనగర్‌లో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాడిమళ్ల జాన్ ప్రసాద్, బత్తిని శంకర్‌గౌడ్, వీరిశెట్టి వినోద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పోతురాజు ఉమాదేవి, తిరువళ్ళూరు పద్మావతి, గుడిపల్లి నవీన్ కృష్ణ, రావుల మణి తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మద్దాలి గిరిధర్

## ట్రాన్స్‌కో ఫోన్ నెంబర్లు

| ప్రాంతాలు | - ఏఈ - | కార్యాలయం |
|---|---|---|
| పొన్నూరురోడ్డు | 9490618805 - | 2119346 |
| లిబర్టీ ఏరియా | 9440812284 - | 2221810 |
| బస్టాండ్‌ఏరియా | 9440812285 - | 2224414 |
| నెహ్రూనగర్ | 9440812292 - | 2221760 |

## రక్త నిధి కేంద్రాలు

| | |
|---|---|
| ప్రభుత్వాస్పత్రి | : 98854 98345 |
| ఎన్టీఆర్ ట్రస్ట్ | : 2338444, 2339444 |
| నీడ్స్ బ్లడ్ బ్యాంక్ | : 92464 48899 |
| లయన్స్ విజన్ | : 98859 09188 |
| సెయింట్ జోసఫ్స్ | : 2322700 |
| పద్మావతి హాస్పిటల్ | : 93941 10333 |

## ఫైర్ స్టేషన్

● తూర్పు:
రామకృష్ణ (ఎస్ఐ) - 9963731857
పశ్చిమ:
వినయ్‌కుమార్(ఎస్ఐ) - 9963731643

## రైల్వే సమాచారం

● ఎంక్వైరీ : 139
టోల్‌ఫ్రీ- (లాండ్‌లైన్ నుంచి మాత్రమే) :0863-2268959

# ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

**గుంటూరు:** ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో మంగళవారం రీజనల్ మేనేజర్ జ్ఞానంగారి శ్రీహరి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌లోని పరిసరాలతో పాటు సిబ్బంది విశ్రాంతి గదులను ప్రత్యేకంగా పరిశీలించారు. పురుష, మహిళా సిబ్బంది విశ్రాంతి గదులను పరిశీలించిన ఆయన మంచినీరు, ఫ్యాన్‌లు ఇతర మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. వెంటనే సమస్య లుంటే పరిష్కరించాలని సూచించారు. ఆయా రూమ్‌లను ఆధునీకరించి వసతులను మెరుగపర చాలని సివిల్ ఇంజనీరింగ్ అధికారులకు ఆర్ఎం ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాలను డ్యూటీకి వెళ్ళేందుకు వస్తోన్న కార్మికుల వాహనాలకు పార్కింగ్ ప్రదేశం కేటాయించాలని పలువురు సిబ్బందిని ఆర్ఎం కోరారు. దీనిపై స్పందించిన ఆయన పార్కింగ్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం వెంకటేశ్వరరావు, కమర్షియల్ ఏటీఎం రమేష్‌బాబు, బస్టాండ్ ఏటీఎం వీవీ సుబ్బారావు, షెడ్యూల్ సీఐ పిచ్చయ్య, సివిల్ ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.



సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఆర్ఎం శ్రీహరి తదితరులు

# యువత చేతుల్లోనే తెలుగు వెలుగులు

**గుంటూరు(సాంస్కృతికం):** తెలుగు భాష పది కాలాల పాటు వెలుగొందాలంటే దానికి నేటి యువతరమే తగిన సాధనమని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఎస్ గంగప్ప పేర్కొన్నారు. స్థానిక హిందూ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ సభ జరిగింది. సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై గౌరీ శంకర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్ గంగప్ప మాట్లాడుతూ తెలుగు భాష మీద నిర్లక్ష్య ధోరణి పనికి రాదని భాష నశిస్తే తెలుగు జాతికే ముప్పుకలుతుందన్నారు. సభలో కళాశాల పాలకమండలి కార్యదర్శి ఎంవీఆర్‌కె ముత్యాలు, తెలుగు శాఖాధిపతి డాక్టర్ వై మల్లికార్జునరావు, నారపరాజు రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె. జాన్‌మోహన్, వి. భారతి తదితరులు పాల్గొని ఆచార్య ఎస్ గంగప్పను ఘనంగా సత్కరించారు.



పురస్కారం అందుకుంటున్న ఆచార్య ఎస్ గంగప్ప

## విద్యారంగ సమస్యలపై 31న సదస్సు

**గుంటూరు(విద్య):** విద్యారంగ సమస్యలపై ఈనెల 31న జడ్పీలో సదస్సు నిర్వహిస్తున్నట్లు నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ వ్యవస్థాపకుడు ఎ.అయ్యస్వామి వెల్లడించారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సదస్సుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కళాశాల హాస్టల్స్ సమస్యలు, మెస్‌చార్జీల పెంపు తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుర్రం శ్రీనివాసరావు, నాగరాజు, కొవ్వూరి హరి, ఎ.గోపి, మహేష్, ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్లిక్.. పోస్ట్ Click.. Post

మీ దృష్టికి వచ్చిన, మీ ప్రాంతంలోని సామాజిక సమస్యను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. సమస్యకు సంబంధించి క్లుప్తంగా వివరాలు, పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి. నెంబర్ : 9985411212

### కాటికాడి కష్టాలు తొలగేదెప్పుడో..



ఏటీ అగ్రహారం శ్మశానవాటికలోకి వెళ్లే దారి చెక్కలతో నిర్మించారు. దీనిపై నుంచి మృతదేహాలను శ్మశానవాటికలోకి తీసుకెళ్లాల్సి వస్తోంది. అంత్యక్రియల కార్యక్రమాలకు వచ్చిన వారు భయంతో వణికిపోతున్నారు.
( ఓ పాఠకుడు)

### డ్రెయినేజి మట్టి తొలగించరూ..



కొత్తపేట వడ్డూరి వారివీధిలో డ్రెయిన్ శుభ్రం చేసి సుమారు నెల గడుస్తుంది. ఇంతవరకు డ్రెయిన్‌లో నుంచి తీసిన మట్టిని తొలగించలేదు. రోజుల తరబడి వర్షాలకు తడిసి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులకు ఇబ్బందిగా ఉంది.
( ఓ పాఠకుడు)

### ఈ రహదారికి మోక్షం లేదా.?



భానుప్రసాద్‌కాలనీ పుట్టవీధిలో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచిపోయింది. పట్టించుకునే నాథుడే లేరు. నీరు పాచిబట్టిపోయింది. ఈ రహదారిలో నడిచేందుకు ఎవరూ సాహసించడం లేదు. చర్యలు తీసుకోవాలి.
(ఓ పాఠకుడు)

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




క్రీడా ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్డీఓ మహేష్‌బాబు తదితరులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎస్డీఓ మహేష్‌బాబు

**గుంటూరు(క్రీడలు) :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించారు. రెండు రోజులుగా కబడ్డీ, హాకీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. మంగళవారం ధ్యాన్‌చంద్ క్రీడాస్ఫూర్తిని చాటుతూ జిల్లా క్రీడా ప్రాధికారి మహేష్ ఆధ్వర్యంలో నగరంలో క్రీడా ర్యాలీని నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు, వివిధ క్రీడా సంఘ నాయకులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు సాయంత్రం బహుమతులను రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి ఎం.నిరంజన్ రెడ్డి, డీఎస్డీఓ మహేష్‌లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కబడ్డీ బాలుర విభాగంలో..** ఉర్దూ ప్రభుత్వ పాఠశాల, ఎస్పీకే హైస్కూల్, సెయింట్ ప్రాక్టిక్ హైస్కూల్‌లు మొదటి మూడు స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో ఎస్పీకే హైస్కూల్, ఉర్దూ ప్రభుత్వ పాఠశాలు గెలుపొందాయి.

**హాకీ బాలుర విభాగంలో..** మేజర్ ధ్యాన్ చంద్ అకాడమి, హిందూ జూనియర్ కాలేజి, హిందూ కాలేజి హైస్కూల్‌లు మొదటి మూడు స్థానాలు సాధించారు.

**వాలీబాల్ విభాగంలో..** బాలుర విభాగంలో ఎస్పీకే హైస్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఉర్దూ హైస్కూల్ మొదటి మూడు స్థానాలు సాధించారు. బీసీసీ ఎంపిక కమిటీ ఛైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్‌ను గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ శేషయ్య, జీవీ ప్రసాద్ సత్కరించారు.

## రిఫరల్ ఫారంలు వెంటనే ఇవ్వాలని డిమాండ్

**ఆంధ్రజ్యోతి, గుంటూరు:** అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరిన రోగులకు రిఫరల్ ఫారంలు వెంటనే అందజేయడంలో రైల్వే ఆసుపత్రి అధికారవర్గాలు నిర్లక్ష్యం వహిస్తోన్నాయని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి వై హన్మంతరావు అన్నారు. రైల్వే అధికారుల తీరుని నిరసిస్తూ మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందించడానికి సౌకర్యాలు లేవన్నారు. దీని దృష్ట్యా నగరంలోని కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులతో రైల్వే శాఖ ఒప్పందం చేసుకొందన్నారు. అత్యవసర చికిత్సల కోసం వచ్చిన రైల్వే కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు రిఫరల్ ఫారంలు రైల్వే ఆస్పత్రి వర్గాలు ఇస్తే వారు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం మూలంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతోన్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, నారాయణరెడ్డి, వీ రవిశంకర్, ఎం సాంబశివరావు, ఎంవీ ప్రసాద్ పాల్గొన్నారు.

## నంద్యాల ఓటమికి దిగాలు వద్దు

- వైసీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి లావు కృష్ణదేవరాయ



మాట్లాడుతున్న వైసీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి లావు కృష్ణదేవరాయ

**తెనాలి రూరల్ :** నంద్యాల ఓటమికి కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహ పడవద్దని, 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు నాంది అని వైసీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి లావు కృష్ణదేవరాయ అభివర్ణించారు. స్థానిక బోసురోడ్డులోని తోటకూర రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ నవరత్నాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నంద్యాల గెలుపు అనైతికమని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ గెలిచిందని విమర్శించారు. శివకుమార్ మాట్లాడుతూ అధికారానికి అతి దగ్గరలో వైసీపీ ఉందన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలకు ఎవరూ ప్రాధాన్యత ఇవ్వవద్దని, మన గురి 2019 ఎన్నికలు అన్నారు. సభకు వైసీపీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ భట్టిప్రోలు వరలక్ష్మి, ఎంపీపీ తోడేటి చంటి, కౌన్సిలర్లు రామయ్య,రమేష్, ముక్తేశ్వరరావు, ఝాన్సీరాణి, శ్రీనివాసరావు, నాయకులు కత్తెర సురేష్‌కుమార్, బొల్లిముంత బాపారావు, పెరికల కాంతారావు, చెన్నారెడ్డి, శివనాగేశ్వరరావు, జోషిబాబు, దుబాయ్ బాబు, పలువురు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించిన భూమా బ్రహ్మానందరెడ్డిని మంగళవారం మంత్రి అఖిల ప్రియ చాంబర్‌లో కలిసి జిల్లా తెలుగు యువత నాయకుడు రావిపాటి సాయి అధ్వర్యంలో పలువురు అభినందనలు తెలిపారు. - ఆంధ్రజ్యోతి, గుంటూరు

# భాష అంతరిస్తే జాతి మనుగడే ప్రమాదం


సభలో ప్రసంగిస్తున్న పొట్లూరి హరికృష్ణ

**గుంటూరు(సాంస్కృతికం):** తెలుగు భాష అంతరిస్తే జాతి మనుగడకే ప్రమాదమని తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు, ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు పొట్లూరి హరికృష్ణ తెలిపారు. స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం సభ జరిగింది. సభకు సాహితీవేత్త రావెల సాంబశివరావు అధ్యక్షత వహించారు. హరికృష్ణ మాట్లాడుతూ విలువైన సంస్కృతిని నిలిపేది, ముందు తరాలకు అందించేంది భాష మాత్రమేనన్నారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రావి రంగారావు రచించిన రావి కిరణాలు గ్రంథాన్ని హరికృష్ణ ఆవిష్కరించారు. సాహితీ వేత్తలు గోటేటి లలితా శేఖర్, దాసరి చంద్రశేఖర్, డాక్టర్ చింతపల్లి సత్యానారాయణ, వాకా మాణిక్యాలరావు, కలువకొలను సూర్యనారాయణ, పింగళి భాగ్యలక్ష్మి, లంకామాధవి, కొల్లూరి నాగంద్రం, డాక్టర్ సేవకుమార్ తదిరులు పాల్గొన్నారు.

### తెలుగు వెలుగులను వెదజల్లాలి

తెలుగు వెలుగులను ప్రపంచాన వెదజల్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాహితీవేత్త కె శేషాద్రి పేర్కొన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌యూపీపీ జిల్లా అధ్యక్షుడు పి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభలో శేషాద్రి తెలుగు భాషా వైభవాన్ని వివరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత గిడుగురామ్మూర్తి పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

### పలు పాఠశాలల్లో ..

**గుంటూరు(విద్య):** నగరంలోని పలు పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ రోడ్డులోని భారతీయ విద్యాభవన్, బృందావన్‌గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ , అమరావతిరోడ్డులోని శ్రీచైతన్య స్కూల్, సీతారామ్‌నగర్‌లోని శ్రీ సరస్వతి కమిటీ ఎయిడెడ్ స్కూల్ తదితరప్రాంతాల్లో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్, ఏవోలు పాల్గొన్నారు.

### అక్షర విద్యాలయంలో..

**గుంటూరు(సంగడిగుంట):** ప్రతి విద్యార్థి మాతృభాష ప్రాధాన్యంను గుర్తించాలని బృందావన్ గార్డెన్స్‌లోని అక్షర విద్యాలయం కరెస్పాండెంట్, కార్యదర్శి ఎం సుబ్బారావు తెలిపారు. తెలుగు భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు కె వలరాజు, కోశాధికారి బి అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకావేరి పుష్కర ప్రాశస్త్యం గ్రంథావిష్కరణ

**గుంటూరు(సాంస్కృతికం):** స్థానిక సంపత్‌నగర్ శ్రీశారదా పరమేశ్వరి ఆలయ ప్రాంగణం జగద్గురు ప్రవచన మందిరంలో మంగళవారం స్వయంపాకుల యలమందల కోటేశ్వరశర్మ రచించిన శ్రీకావేరి పుష్కర గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఆలయ ధర్మాధికారి పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. హిందూ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ వై మల్లికార్జునరావు గ్రంథ సమీక్ష చేశారు. సభలో సిరసనగండ్ల సుబ్బయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాధాదేవి అవతరణ దినోత్సవం

స్థానిక పండరీపురం కోదండ రామమందిరంలో మంగళవారం రాధాదేవి అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాధికారాణికి సహస్రనామ అష్టోత్తర శతనామ పూజలు, రాధికా ప్రసాద్ మహరాజ్‌కు గులాబీలతో అష్టోత్తర శతనామ పూజ నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ అధ్యక్షుడు బ్రహ్మాండం శేష గంగాధర శర్మ పర్యవేక్షించారు.

### ధ్యాన్ చంద్ జయంతి



ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జీఆర్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఫౌండేషన్ కార్యదర్శి గోళ్ల అరుణ్‌కుమార్, ప్రసాద్, నాగుల్ మీరా, షేక్ సుభాని, సురేష్ యాదవ్ తదితరులు (గుంటూరు-క్రీడలు)

# అభివృద్ధికి నోచుకోని ఆదర్శనగర్



డ్రెయినేజీ నిర్మాణం లేక కాలువలో పేరుకుపోయిన మురుగు, కాలనీలోని మట్టి రోడ్డు

**గుంటూరు(కార్పొరేషన్):** ఎటుచూసినా మట్టి రోడ్లు, అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ, అడవులను తలపించేలా ఖాళీ స్థలాలు .. ఇదీ నగరంలోని ఆదర్శనగర్ పరిస్థితి. కాలనీకి వెళ్లే పధాన రహదారి సైతం మట్టిరోడ్డు కావడంతో చినుకు పడితే మోకాలు లోతు బురదమయంగా మారుతోంది. కాలనీ ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉండడం గమనార్హం. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## రైఫిల్ షూటింగ్‌లో శ్రీచైతన్య విద్యార్థి ప్రతిభ

**గుంటూరు(విద్య)**: నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రైఫిల్ షూటింగ్‌లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థి పాతూరి అభి ద్వితీయ బహుమతి సాధించినట్లు ఏజీఎం డాక్టర్ ఎన్ అంజయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల ఏడున జరిగిన యూత్ లెవల్ పోటీల్లో పాల్గొన్న అభి సీనియర్ లెవల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. డిసెంబర్‌లో జరిగే నేషనల్ చాంపియన్ షిప్ లీగ్‌కు అర్హత సాధించిట్లు తెలిపారు. అభిని పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ వినీత, డీన్ శౌరిప్రకాశ్, ఆర్‌ఏ శ్రీనివాసరావు అభినందించారు.


విద్యార్థిని అభినందిస్తున్న అంజయ్య

## గణపతి పూజల్లో పాల్గొన్న ఎమెల్సీ మాణిక్య వరప్రసాద్



అరండల్‌పేట 18వలైన్‌లో నిర్వహించిన గణపతి పూజల్లో పాల్గొన్న ఎమెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, యార్డు మాజీ డైరెక్టర్ జాన్‌బాబు, టీడీపీ నాయకులు క్రాంతి కుమార్, గర్నెపూడి సుధాకర్, వీర మనీంద్ర, పెద్ది వెంకటేశ్వర్లు, వల్లసెట్టి నాగరాజు, వెంకటేశ్వర్లు, కాళి, తమ్మిసెట్టి రవి

## శ్రీనివాసరావుపేటలో అన్నదానం


శ్రీనివాసరావుపేట 12వ లైనులో జరుగుతోన్న గణేష్ నవరాత్రుల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు శివారెడ్డి, అచ్చయ్య, శ్రీను, నాగరాజు, ఒంగోలు శ్రీనివాసరావు, బుడ్డాయి, రాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. (గుంటూరు)

## సూక్ష్మ ఎరువుల పంపిణీ

**ఆంధ్రజ్యోతి, గుంటూరు:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసార పరీక్షలను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉచితంగా సూక్ష్మ ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు గుంటూరు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం ధనలక్ష్మి సూచించారు. మండలంలోని దాసుపాలెం, చినపలకలూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. సర్పంచ్‌లు మానుకొండ శివకుమారి (దాసుపాలెం), దాసరి వసంతరావు (చినపలకలూరు) అధ్యక్షతన సభలు నిర్వహించారు.

### ట్రాన్స్‌కో ఫోన్ నెంబర్లు

| ప్రాంతాలు | - ఏఈ - | కార్యాలయం |
|---|---|---|
| బ్రాడీపేట | 9440812287 | 2221760 |
| గుజ్జనగుండ్ల | 9440812288 | 2231151 |
| కృష్ణనగర్ | 9440812291 | 2256506 |
| గోరంట్ల | 9440812290 | 2331200 |
| వికాస్‌నగర్ | 8330938792 | 2221151 |
| నగరంపాలెం | 9440812289 | 2235447 |
| చుట్టుగుంట | 7382623147 | 2254065 |
| నల్లచెరువు | 9440812283 | 2324708 |

### రక్త నిధి కేంద్రాలు

| | |
|---|---|
| ప్రభుత్వాస్పత్రి | 98854 98345 |
| ఎన్టీఆర్ ట్రస్ట్ | 2338444, 2339444 |
| నీడ్స్ బ్లడ్ బ్యాంక్ | 92464 48899 |
| లయన్స్ విజన్ | 98859 09188 |
| సెయింట్ జోసఫ్స్ | 2322700 |
| పద్మావతిహాస్పిటల్ | 93941 10333 |

### రైల్వే సమాచారం

- ఎంక్వైరీ : 139
  టోల్‌ఫ్రీ- (లాండ్‌లైన్ నుంచి మాత్రమే) :0863-2268959

### ఫైర్ స్టేషన్

- పశ్చిమ:
  వినయ్‌కుమార్(ఎస్‌ఐ) - 9963731643
  తూర్పు:
  రామకృష్ణ (ఎస్‌ఐ) - 9963731857

## విద్యారంగ సమస్యలపై 31న సదస్సు

**గుంటూరు(విద్య):** విద్యారంగ సమస్యలపై ఈనెల 31న జడ్పీలో సదస్సు నిర్వహిస్తున్నట్లు నవ్యాంధ్ర విద్యార్థి జేఏసీ వ్యవస్థాపకుడు ఎ.అయ్యస్వామి వెల్లడించారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సదస్సుకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ, విద్యావేత్తలు, ప్రజా సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, కళాశాల హాస్టల్స్ సమస్యలు, మెస్‌చార్జీల పెంపు తదితర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుర్రం శ్రీనివాసరావు, నాగరాజు, కొవ్వూరి హరి, ఎ.గోపి, మహేష్, ఎ.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్లిక్.. పోస్ట్ Click.. Post

మీ దృష్టికి వచ్చిన, మీ ప్రాంతంలోని సామాజిక సమస్యను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. సమస్యకు సంబంధించి క్లుప్తంగా వివరాలు, పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి. నెంబర్ : 9985411212

### కాటికాడి కష్టాలు తొలగేదెప్పుడో..



ఏటీ అగ్రహారం శ్మశానవాటికలోకి వెళ్లే దారి చెక్కలతో నిర్మించారు. దీనిపై నుంచి మృతదేహాలను శ్మశానవాటికలోకి తీసుకెళ్లాల్సి వస్తోంది. అంత్యక్రియల కార్యక్రమాలకు వచ్చిన వారు భయంతో వణికిపోతున్నారు.
( ఓ పాఠకుడు)

### డ్రెయినేజి మట్టి తొలగించరూ..



కొత్తపేట వడ్డూరి వారివీధిలో డ్రెయిన్ శుభ్రం చేసి సుమారు నెల గడుస్తుంది. ఇంతవరకు డ్రెయిన్‌లో నుంచి తీసిన మట్టిని తొలగించలేదు. రోజుల తరబడి వర్షాలకు తడిసి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులకు ఇబ్బందిగా ఉంది.
( ఓ పాఠకుడు)

### ఈ రహదారికి మోక్షం లేదా.?



భానుప్రసాద్‌కాలనీ పుట్టవీధిలో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచిపోయింది. పట్టించుకునే నాథుడే లేరు. నీరు పాచిబట్టిపోయింది. ఈ రహదారిలో నడిచేందుకు ఎవరూ సాహసించడం లేదు. చర్యలు తీసుకోవాలి.
(ఓ పాఠకుడు)

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం




క్రీడా ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్డీఓ మహేష్‌బాబు తదితరులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఎస్డీఓ మహేష్‌బాబు

**గుంటూరు(క్రీడలు) :** జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పద్మశ్రీ మేజర్ ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో నిర్వహించారు. రెండు రోజులుగా కబడ్డీ, హాకీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. మంగళవారం ధ్యాన్‌చంద్ క్రీడాస్ఫూర్తిని చాటుతూ జిల్లా క్రీడా ప్రాధికారి మహేష్ ఆధ్వర్యంలో నగరంలో క్రీడా ర్యాలీని నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు, వివిధ క్రీడా సంఘ నాయకులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు సాయంత్రం బహుమతులను రాష్ట్ర హాకీ సంఘ కార్యదర్శి ఎం.నిరంజన్ రెడ్డి, డీఎస్డీఓ మహేష్‌లు అందజేశారు. కార్యక్రమంలో శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కబడ్డీ బాలుర విభాగంలో..** ఉర్దూ ప్రభుత్వ పాఠశాల, ఎస్పీకే హైస్కూల్, సెయింట్ ప్రాక్టిక్ హైస్కూల్‌లు మొదటి మూడు స్థానాలు సాధించారు. బాలికల విభాగంలో ఎస్పీకే హైస్కూల్, ఉర్దూ ప్రభుత్వ పాఠశాలు గెలుపొందాయి.

**హాకీ బాలుర విభాగంలో..** మేజర్ ధ్యాన్ చంద్ అకాడమి, హిందూ జూనియర్ కాలేజి, హిందూ కాలేజి హైస్కూల్‌లు మొదటి మూడు స్థానాలు సాధించారు.

**వాలీబాల్ విభాగంలో..** బాలుర విభాగంలో ఎస్పీకే హైస్కూల్, లిటిల్ ఫ్లవర్ స్కూల్, ఉర్దూ హైస్కూల్ మొదటి మూడు స్థానాలు సాధించారు. బీసీసీ ఎంపిక కమిటీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్‌ను గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ శేషయ్య, జీవీ ప్రసాద్ సత్కరించారు.

## రిఫరల్ ఫారంలు వెంటనే ఇవ్వాలని డిమాండ్

**ఆంధ్రజ్యోతి, గుంటూరు:** అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరిన రోగులకు రిఫరల్ ఫారంలు వెంటనే అందజేయడంలో రైల్వే ఆసుపత్రి అధికారవర్గాలు నిర్లక్ష్యం వహిస్తోన్నాయని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి వై హన్మంతరావు అన్నారు. రైల్వే అధికారుల తీరుని నిరసిస్తూ మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరావు మాట్లాడుతూ రైల్వే ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య చికిత్సలు అందించడానికి సౌకర్యాలు లేవన్నారు. దీని దృష్ట్యా నగరంలోని కొన్ని కార్పొరేట్ ఆస్పత్రులతో రైల్వే శాఖ ఒప్పందం చేసుకొందన్నారు. అత్యవసర చికిత్సల కోసం వచ్చిన రైల్వే కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు రిఫరల్ ఫారంలు రైల్వే ఆస్పత్రి వర్గాలు ఇస్తే వారు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకొనే అవకాశం ఉంటుందన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం మూలంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతోన్నారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బారావు, నారాయణరెడ్డి, వీ రవిశంకర్, ఎం సాంబశివరావు, ఎంవీ ప్రసాద్ పాల్గొన్నారు.

## నంద్యాల ఓటమికి దిగాలు వద్దు

**●వైసీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి లావు కృష్ణదేవరాయ**



మాట్లాడుతున్న వైసీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి లావు కృష్ణదేవరాయ

**తెనాలి రూరల్ :** నంద్యాల ఓటమికి కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహ పడవద్దని, 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుపునకు నాంది అని వైసీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి లావు కృష్ణదేవరాయ అభివర్ణించారు. స్థానిక బోసురోడ్డులోని తోటకూర రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ నవరత్నాల సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. నంద్యాల గెలుపు అనైతికమని, అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ గెలిచిందని విమర్శించారు. శివకుమార్ మాట్లాడుతూ అధికారానికి అతి దగ్గరలో వైసీపీ ఉందన్నారు. నంద్యాల ఉప ఎన్నిక ఫలితాలకు ఎవరూ ప్రాధాన్యత ఇవ్వవద్దని, మన గురి 2019 ఎన్నికలు అన్నారు. సభకు వైసీపీ పట్టణ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, జడ్పీటీసీ భట్టిప్రోలు వరలక్ష్మి, ఎంపీపీ తోడేటి చంటి, కౌన్సిలర్లు రామయ్య,రమేష్, ముక్తేశ్వరరావు, ఝాన్సీరాణి, శ్రీనివాసరావు, నాయకులు కత్తెర సురేష్‌కుమార్, బొల్లిముంత బాపారావు, పెరికల కాంతారావు, చెన్నారెడ్డి, శివనాగేశ్వరరావు, జోషిబాబు, దుబాయ్ బాబు, పలువురు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నంద్యాల ఉప ఎన్నికలో విజయం సాధించిన భూమా బ్రహ్మానంద రెడ్డిని మంగళవారం మంత్రి అఖిల ప్రియ చాంబర్‌లో కలిసి జిల్లా తెలుగు యువత నాయకుడు రావిపాటి సాయి అధ్వర్యంలో పలువురు అభినందనలు తెలిపారు. - ఆంధ్రజ్యోతి, గుంటూరు